అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
మంగళవారం 11-4-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 100 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

పూలే ఆశయాలు, కార్యాచరణ నేటికీ స్ఫూర్తిదాయకం



జయంతి సందర్భంగా సీఎం కేసీఆర్ నివాళులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశంలోని మనుషులంతా అన్ని రంగాల్లో సమానత్వంతో జీవించాలనే ఆకాంక్షలతో ఆధిపత్య వ్యతిరేక పోరాటం కోసం తన జీవితాన్ని ధారపోసిన గొప్ప భారతీయ సామాజిక తత్వవేత్త, మహాత్మాజ్యోతిరావు గోవిందరావు పూలే అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, కార్యాచరణ నేటికీ స్ఫూర్తిదాయకమేనని తెలిపారు. పూలే 197వ జయంతి సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలు, త్యాగాలను సీఎం స్మరించుకున్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదలచేశారు. వర్ణ, లింగ వివక్షకు వ్యతిరేకంగా, దళిత, గిరిజన, ...5లో

గవర్నర్ X గవర్నమెంట్...



మరోసారి బిల్లుల రగడ..

- మూడు బిల్లులకు తమిళిసై ఆమోదం
- రెండు రాష్ట్రపతి సమ్మతికి.. రెండు ప్రభుత్వానికి వాపస్
- మరో మూడు పెండింగ్..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర రాజన్ వ్యవహారశైలితో మరోసారి రాష్ట్రంలో రాజకీయ దుమారం రేగింది. గతంలో మాదిరిగా 'గవర్నర్ వర్సెస్ గవర్నమెంట్...'లాగా పరిస్థితి తయారైంది. బిల్లుల విషయంలో తమిళి సై మొండి పట్టు పట్టగా... ఆమె రాష్ట్ర ప్రభుత్వం పట్ల ...2లో

గవర్నర్ తీరుపై పిటిషన్ విచారణ వాయిదా

- దాఖలు చేసిన సర్కార్..రెండు వారాల తర్వాత పరిశీలన : సుప్రీం

వివరాలు 2లో..

తీర్మానం పెట్టిన గంటల్లోనే..

బిల్లుకు తమిళనాడు గవర్నర్ ఆమోదం

- తమిళనాడు రాజకీయాల్లో భగ్గుమంటున్న విభేదాలు



చెన్నై : ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌ను నిషేధించడం, ఇంటర్నెట్ గేమ్‌లను నియంత్రించడం కోసం రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లును తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి సోమవారం ఆమోదించారు. ఆరు నెలల పాటు పెండింగ్‌లో ఉంచిన బిల్లును గవర్నర్‌కి వ్యతిరేకంగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన గంటల వ్యవధిలోనే ఆమోదించడం గమనార్హం. గత నెలలో గవర్నర్ కొన్ని ప్రశ్నలతో బిల్లుని వెనక్కిపంపారు. దీంతో ప్రభుత్వం రెండోసారి బిల్లును ఆమోదించింది. రాష్ట్ర యూనివర్సిటీ ఛాన్సలర్‌గా తనను తొలగించాలని కోరుతూ ప్రవేశపెట్టిన బిల్లుతో పాటు తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన పలు బిల్లులకు గవర్నర్ ఇప్పటివరకు సమ్మతించలేదు. కాగా, ఎంకె స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే గవర్నర్ ఆర్.ఎన్. రవికి ...2లో

మూడు పార్టీలకు జాతీయ హోదా రద్దు



ఆప్ కు జాతీయ హొదా

- సీపీఐ, టీఎంసీ, ఎన్‌సీపీకి తొలగింపు
- ఆరు పార్టీలకు రాష్ట్ర హొదా కట్
- కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో మూడు పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం జాతీయ హొదా రద్దు చేసింది. ఢిల్లీ, పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి కొత్తగా జాతీయ హొదా లభించింది. సీపీఐ,తృణమూల్ కాంగ్రెస్, ఎన్‌సీపీ పార్టీలకు జాతీయ హొదాను రద్దు చేస్తున్నట్లు సీఈసీ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉత్తరప్రదేశ్‌లో ఆర్‌ఎల్‌డీ, ఆంధ్రప్రదేశ్‌లో బీఆర్ఎస్, మణిపూర్‌లో పీడీఏ, పుదుచ్చేరిలో పీఎంకే, పశ్చిమ బెంగాల్‌లో ఆర్ఎస్‌పీ, మిజోరంలో ఎంపీసీలకు ఇచ్చిన రాష్ట్ర పార్టీ హొదాను కూడా కమిషన్ రద్దు చేసింది. ఢిల్లీ, గోవా, పంజాబ్, గుజరాత్ అనే నాలుగు రాష్ట్రాల ఎన్నికల పనితీరు ఆధారంగా ఆప్ కుజాతీయ హొదా కల్పిస్తున్నట్టు కమిషన్ పేర్కొంది.

ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో వారి పనితీరు ఆధారంగా నాగాలాండ్, మేఘాలయలో ఎన్‌సీపీ, తృణముల్ కాంగ్రెస్‌లు వరుసగా రాష్ట్ర పార్టీలుగా గుర్తింపు పొందాయని కమిషన్ తెలిపింది. నాగాలాండ్‌లోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్ పాశ్వాన్), మేఘాలయలోని వాయిస్ ఆఫ్ పీపుల్ పార్టీకి, త్రిపురలోని టిప్రా మోతాకు రాష్ట్ర రాజకీయ పార్టీ హొదాను కూడా మంజూరు చేసినట్టు కమిషన్ పేర్కొంది.


దీంతో ప్రస్తుతం బీజేపీ కాంగ్రెస్, సీపీఐ(ఎం), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ), ఆప్ లుజాతీయ పార్టీలుగా ఉన్నాయి..

అడవి అదృశ్యం...

ఐదేండ్లలో 89 వేల హెక్టార్ల పచ్చటి సంపద కనుమరుగు

- రహదారులు , అటవీయేతర ప్రయోజనాల కోసమంటూ కార్పొరేట్లకు మళ్లింపు

పచ్చదనం ఉంటేనే మానవమనుగడ సమతుల్యంగా ఉంటుంది.పక్షులు,పశుసంపద సుభిక్షంగా ఉంటుంది. లేదంటే..పర్యావరణం దెబ్బతినడమే కాదు. అడవుల్లో ఉండాల్సిన జంతువులు జనవాసాల్లోకి దూసుకువస్తాయి. ఇపుడు అదే జరుగుతోంది. అడవులు అదృశ్యమైపోతున్నాయి. అటవీసంపదను కొల్లగొట్టటానికి ,, అడవులనే జీవనాధారంగా చేసుకున్న గిరిజనులనే తరిమేసేలా చట్టాలకు సవరణలు జరుగుతున్నాయి. అడవుల సంరక్షణ బిల్లులంటూ తెరపైకి తెచ్చి.మొత్తం అడవులే లేకుండా చేస్తున్నారు.కార్పొరేట్ దోస్తులకు పచ్చని అడవులతో పాటు సమస్త సహజ వనరులనూ బీజేపీ ప్రభుత్వం కట్టబెడుతుంది.



న్యూఢిల్లీ: భారతదేశంలో గత ఐదేండ్లలో 89 వేల హెక్టార్ల అడవి (రికార్డెడ్ ఫారెస్ట్) కనుమరుగైంది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ పార్లమెంటులో ఇచ్చిన సమాచారం ప్రకారం, దేశంలోని సుమారు 89 వేల హెక్టార్ల అటవీ భూమి రోడ్లు మొదలైన 25 రకాల అటవీయేతర అవసరాల కోసం మళ్లించడానికి అనుమతించబడింది. వాస్తవానికి ఇంత పెద్ద విస్తీర్ణంలో అనేక చిన్న పట్టణాలకు వసతి కల్పించవచ్చని పర్యావరణ వేత్తలు అంటున్నారు.

భూభాగంలో 24 శాతం అటవీ విస్తీర్ణం

కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రకారం, దేశంలోని మొత్తం భూభాగంలో దాదాపు 24 శాతం అటవీ విస్తీర్ణంలో ఉంది.డిబ్ల్యూ వెబ్‌సైట్ ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం, 88,903.80 హెక్టార్ల అటవీ భూమిని 25 రకాల అటవీయేతర ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం అనుమతించిందని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ పార్లమెంటుకు తెలియజేసింది. రోడ్ల కోసం అటవీ భూమిని గరిష్టంగా మళ్లించడం జరిగింది. గరిష్టంగా 19,424 హెక్టార్ల అటవీ భూమిని రోడ్ల వినియోగానికి మళ్లించారు.

రోడ్లకోసం అడవుల నరికివేత

గత ఐదేండ్లలో అడవులను అటవీయేతర ప్రయోజనాల కోసం అడ్డదిడ్డంగా నరికివేస్తున్నారు. ఇలా 19,424 హెక్టార్ల మేర అడవులు నరికేశారు. అంతేకాదు.. ...5లో

ఓటేయొద్దు..



మసీదులు తవ్వుదాం.. పేపర్ లీక్ చేద్దామనేటోళ్లు మనకొద్దు

- ఆక్వా హబ్‌లో స్థానికులకు ఉపాధి : మంత్రి కేటీఆర్

నవతెలంగాణ - తంగళ్లపల్లి

తెల్లారిలేస్తే మసీదులు తవ్వుదామా.. పేపర్ లీక్ చేద్దామా అనే వారికి ఓటు వేయొద్దని.. ఈ సారైనా మంచి వారిని కరీంనగర్ ఎంపీగా గెలిపించుకోవాలని మంత్రి కేటీఆర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో సోమవారం మంత్రి విస్తృత పర్యటన చేశారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు, మహనీయుల విగ్రహావిష్కరణలు చేశారు. తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఎస్సీ, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. బీఆర్.అంబేద్కర్, చాకలి ఐలమ్మ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామంలో ఇప్పటి వరకు రూ.12కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ముంపు ప్లాట్‌లకు డబ్బులు రాని వారు, 18 సంవత్సరాలు నిండి డబ్బులు రాని వారికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. 350 ఎకరాల్లో ఆక్వా హబ్ ఏర్పాటు చేయనున్నామని, స్థానిక యువతకు శిక్షణ ...5లో

ఆవిష్కరణకు అంబేద్కర్ విగ్రహం సిద్ధం

హుస్సేన్‌సాగర్ తీరంలో 125 అడుగుల నిర్మాణం

- పనులను పరిశీలించిన మంత్రులు, సీఎస్, డీజీపీ

నవతెలంగాణ-హైదరాబాద్

బీఆర్‌కేఆర్ భవన్‌లో ఎస్సీల అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఆర్థిక మంత్రి టి హరీశ్‌రావు, ఆర్‌అండ్‌బీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్‌తో కలిసి ఈ నెల 14న అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లపై సమీక్షించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14వ తేదీన ముఖ్యమంత్రి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించి పూర్తిస్థాయి ఏర్పాట్లను ఘనంగా చేస్తున్నామని పేర్కొన్నారు. పోలీసు శాఖ బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు చేస్తుందనీ, ఆర్ అండ్ బీ శాఖ లైటింగ్, షామియానా, కుర్చీలు, పూలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. విద్యుత్ శాఖకు నిరంతర విద్యుత్ అందించాలనీ, ట్రాన్స్‌ఫార్మర్లను సిద్ధంగా ఉంచాలని కోరారు. అలాగే ఆరోగ్య సిబ్బందితో పాటు అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచాలని ఆరోగ్య శాఖను ఆదేశించామని తెలిపారు. ప్రజాప్రతినిధులతో పాటు జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు సరైన సీటింగ్ ఏర్పాట్లు చేయాలని మంత్రులు ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు నీరు, మజ్జిగ, మిఠాయిలు అందించాలి. 14వ తేదీన వాహనాల రాకపోకల కోసం నెక్లెస్ రోడ్డు మూసివేయనున్నందున ప్రత్యామ్నాయ మార్గాన్ని ఉపయోగించాలని ప్రజలకు ముందస్తుగా తెలియజేయాలని పోలీసులకు సూచించారు. అదేవిధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీని ఆదేశించారు. ఈ సమావేశానికి ఫైనాన్స్ స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, ఆర్ అండ్ బీ సెక్రటరీ శ్రీనివాస్‌రాజు, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, ఉన్నతాధికారులు హాజరయ్యారు.



కోర్టుల్లో కేసులు వేస్తేనే గానీ .. బిల్లులు పాస్ కావా?



తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్న గవర్నర్

- నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లోనే..
- గవర్నర్‌పై మంత్రి హరీశ్‌రావు విమర్శలు
- మూడు బిల్లులు పాస్ చేసినందుకు ధన్యవాదాలు తెలిపిన మంత్రి

నవతెలంగాణ-కొండపాక

కోర్టులో కేసులు వేస్తే తప్పా బిల్లులు పాస్ కాని దుస్థితి నెలకొన్నదని, రాష్ట్ర అభివృద్ధిని గవర్నర్ అడ్డుకుంటున్నారని, బిల్లులు పాస్ చేయకుండా పెండింగ్‌లో పెడుతున్నారని మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నాలుగు జిల్లాలకు తాగు నీరందించే ట్రయల్ రన్ నిర్వహణలో భాగంగా ...5లో

స్ట్రాంగ్ రూం కీ మాయం

- ధర్మపురి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల డాక్యుమెంట్లు సమర్పించాలన్న హైకోర్టు
- గదుల తాళాలు తీసేందుకు యత్నించిన జగిత్యాల కలెక్టర్
- తెరుచుకోని స్ట్రాంగ్‌రూం తాళాలు
- అందులోనే కీలక 17ఏ, 17సీ డ్యాక్యుమెంట్లు, ప్రొసీడింగ్ పత్రాలు

వివరాలు 5లో..

బీఆర్ఎస్ నుంచి బహిష్కరణ

- పొంగులేటి, జూపల్లిపై వేటు..



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బహిష్కరణకు గురయ్యారు. ఈ మేరకు సోమవారం పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన కారణంగా జూపల్లి, పొంగులేటిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలంటూ కేసీఆర్ ఆదేశించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలంగాణ భవన్ ఒక ప్రకటనలో తెలిపింది.

సీఎం సారూ.. పర్మినెంట్ చేయండి..



నాలుగేండ్లు పాయే..కొలువు గ్యారంటీ లేకపాయే

- ఆందోళనలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు
- పెండింగ్‌లోనే రెండు నెలల వేతనాలు
- 28 నుంచి సమ్మెలోకి?

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'సీఎం సారూ చేతులెత్తి వేడుకుంటున్నాం..దయచేసి పర్మినెంట్ చేయించండి' అంటూ రాష్ట్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వేడుకుంటు న్నారు. ఏ ప్రభుత్వ శాఖలో ఉద్యోగమొచ్చినా ప్రొబెషనరీ కాలం మాత్రం రెండేండ్లే. జేపీఎస్‌లకు మాత్రం ఎక్కడా లేని నిబంధన తీసుకొచ్చి పెట్టి మూడేండ్లు అని రాష్ట్ర సర్కారు కొర్రీ పెట్టింది. ఏడాదే ఎక్కువగా కదా..సర్కారు కొలువు ఎందుకు వదిలేయానే ఉద్దేశంతో గమ్మునా పనిచేశారు. టైంకాగానే పర్మినెంట్ ప్రస్తావన ఎత్తితే..'కాదు..కాదు..ఇంకా ఏడాది పెంచుతున్నాం' అని మెలిక పెట్టి కూర్చున్నది. కుంటలో పడ్డాక బురద అంటకుండా పోతుందా భరిద్దాంలే అని జేపీఎస్‌లు చచ్చినట్టు కొలువుచేశారు. మంగళవారంతో నాలుగేండ్లు పూర్తవుతుంది. నేటికీ పర్మినెంట్ ప్రస్తావనే లేదు. 'ఇంకెన్నాళ్లు ఈ ఎదురుచూపులు..బానిస బతుకులు' అని జేపీఎస్‌లు ఆందోళన బాట పట్టేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ నెల 28 నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు కూడా సమాయత్తం అవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2019లో రిక్రూట్‌మెంట్ టెస్టు ద్వారా 9,355 పంచాయతీరాజ్ జూనియర్ కార్యదర్శుల పోస్టులను భర్తీ చేసింది. మూడేండ్ల ఒప్పందం మీద 2019 ఏప్రిల్ 12 నుంచి జేపీఎస్‌లు విధులు చేపట్టారు. గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ, పల్లె ప్రగతి, హరితహారం, తదితర కార్యక్రమాల నిర్వహణతో పాటు 55 దాకా రిజిస్టర్లను వారే చూసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో కొండంత పనిని ...5లో

గవర్నర్ x గవర్నమెంట్...

(మొదటిపేజీ తరువాయి)

అనుసరిస్తున్న తీరుపై బీఆర్ఎస్ నేతలు భగ్గుమన్నారు. రాష్ట్ర అసెంబ్లీ, కౌన్సిల్‌లో పాసై గవర్నర్ ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం రాజ్‌భవన్‌కు పంపిన 10 బిల్లుల్లో మూడింటికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదం తెలిపారు. రెండు బిల్లులను రాష్ట్రపతి సమ్మతి కోసం రాష్ట్రపతి భవన్‌కు పంపారు. మరో రెండింటిని తిరిగి ప్రభుత్వానికి పంపిన గవర్నర్..మూడు బిల్లులను తనవద్దే పెండింగ్‌లో ఉంచారు. ప్రభుత్వం పంపిన బిల్లులపై గవర్నర్ నిర్ణయం తీసుకోవడంలేదని రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన రిట్ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఇదిలా ఉండగా ప్రభుత్వం పంపిన బిల్లుల్లో తెలంగాణ మోటర్ వెహికిల్స్ ట్యాక్సేషన్ అమెండమెంట్ బిల్ 2022, మున్సిపాలిటీస్ అమెండమెంట్ బిల్ 2023, ప్రొ.జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీ అమెండమెంట్ బిల్ 2023కు గవర్నర్ ఆమోదం తెలిపారు. తెలంగాణ ఫారెస్ట్ యూనివర్సిటీ బిల్ 2022, యూనివర్సిటీస్ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ బిల్ 2022లను రాష్ట్రపతి సమ్మతి కోసం గవర్నర్ రాష్ట్రపతి భవన్‌కు నివేదించారు. తెలంగాణ స్టేట్ ప్రయివేటు యూనివర్సిటీస్ అమెండమెంట్ బిల్ 2022, తెలంగాణ మున్సిపల్ లా అమెండమెంట్ బిల్ 2022, తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ అమెండమెంట్ బిల్ 2022పై గవర్నర్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. తెలంగాణ పంచాయతీరాజ్ అమెండమెంట్ బిల్ 2023, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా అమెండమెంట్ బిల్ 2022పై వివరణ కోరుతూ గవర్నర్ ఈ రెండు బిల్లులను ప్రభుత్వానికి వాపస్ పంపారు. ఈ నేపథ్యంలో మరోసారి ఈ వ్యవహారం చర్చనీయాంశమైంది.

తీర్మానం పెట్టిన గంటల్లోనే..

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకంగా సోమవారం ఉదయం మరో తీర్మానం చేసింది. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను గవర్నర్ క్లియర్ చేయడం లేదని, ప్రజా సంక్షేమానికి వ్యతిరేకంగా ఆయన పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ.. ఇది గవర్నర్‌కు వ్యతిరేకంగా తమ ప్రభుత్వం చేసిన రెండో తీర్మానమని అన్నారు. గవర్నర్ నిర్లిప్త వ్యక్తిగా ఉండాలని సర్కారియా కమిషన్ పేర్కొందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారంలో గవర్నర్ జోక్యం చేసుకోకూడదని డాక్టర్ అంబేద్కర్ కూడా చెప్పారన్నారు. కానీ గవర్నర్ బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రతినిధిలా వ్యవహరిస్తున్నారని, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అలాగే గవర్నర్ గైడ్‌గా ఉండాలని అనేక సుప్రీంకోర్టు ఆదేశాలు కూడా స్పష్టం చేశాయన్నారు. అయితే మన గవర్నర్ ప్రజలకు మిత్రుడిగా ఉండటానికి సిద్ధంగా లేరని సీఎం స్టాలిన్ విమర్శించారు. అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులను గవర్నర్ పెండింగ్‌లో ఉంచుతూ తప్పుడు సమాచారం ఇస్తున్నారని దుయ్యబట్టారు. బిల్లును పెండింగ్‌లో ఉంచడం అంటే తిరస్కరించినట్లేనని ఇటీవల గవర్నర్ రవి చేసిన వ్యాఖ్యలపై ఈ సందర్భంగా స్టాలిన్ మండిపడ్డారు. గవర్నర్ చర్యలను మాత్రమే తాము విమర్శిస్తున్నామనీ, అసెంబ్లీ కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తే ఊరుకోమని అన్నారు. అనంతరం తమిళనాడు మంత్రి దురై మురుగన్, గవర్నర్ రవికి వ్యతిరేకంగా చేసిన తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు నిర్దిష్ట వ్యవధిలోగా ఆమోదం తెలిపేలా తమిళనాడు గవర్నర్‌కు తక్షణమే తగిన ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఈ తీర్మానం ద్వారా తమిళనాడు ప్రభుత్వం కోరింది.

నేడు హైదరాబాద్‌లో విద్యార్థి, నిరుద్యోగుల మహాదీక్ష

- ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకుల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీపై సమగ్రమైన న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య పార్క్ వద్ద విద్యార్థి, నిరుద్యోగుల మహాదీక్ష భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో జరగనుంది. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ దీక్షలను జయప్రదం చేయాలని కోరారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్రమైన విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన నిరుద్యోగులకు నెలకు రూ.20 వేలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రాష్ట్రంలోని నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి అందించాలని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీని తక్షణమే ప్రక్షాళన చేయాలని తెలిపారు. పదో తరగతి హిందీ ప్రశ్నాపత్రం బయటకు రావడంపైనా, బండి సంజయ్ పాత్రపైనా సమగ్రమైన విచారణ జరిపించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్ గువేరా, అశోక్‌రెడ్డి, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఎండీ జావీద్ పాల్గొన్నారు.

కుల దురహంకారంతోనే దళిత యువకుడు నవీన్ హత్య

- నిందితులను కఠినంగా శిక్షించాలి :కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కుల దురహంకారంతోనే దళిత యువకుడు నవీన్‌ను హత్య చేశారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్ వెస్లీ, టి స్కైలాబ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందుతులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. 'తక్కువ కులపోడు మా అమ్మాయిని ప్రేమిస్తాడా అని' తాళ్ల జ్యోతి బంధువులు మర్రి రాజు మరికొంతమంది బాధితుడు ఇరిగి నవీన్‌ను కాపు కాసి వెంటాడి అత్యంత దారుణంగా చంపారని తెలిపారు. నల్గొండ జిల్లా త్రిపురారం మండలం గుంటిపల్లి అన్నారంకు చెందినఅతడు (ఎస్సీ) తాళ్ల జ్యోతి (బీసీ) ప్రేమించుకున్నారని పేర్కొన్నారు. ఈ విషయం ముదిరాజ్ కులానికి చెందిన అమ్మాయి బావ మర్రి రాజు, తండ్రి నాగయ్యకు తెలిసి పథకం ప్రకారం నిడమనూరు మండలం గుంటిపల్లికి పిలిపించి కత్తులతో కర్రల తో దాడి చేసి నవీన్‌ను హత్య చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయడం ద్వారా నిందితులను కఠినంగా శిక్షించా లని డిమాండ్ చేశారు. అతని కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియో, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, మూడెకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నిలబడేది ప్రజాసాహిత్యమే

- ప్రముఖ కవి, రచయిత డాక్టర్ తంగిరాల చక్రవర్తి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజల గురించి రాసిన సాహిత్యం చరిత్రలో ఎప్పటికీ నిలబడే ఉంటుందని ప్రముఖ కవి, రచయిత డాక్టర్ తంగిరాల చక్రవర్తి నొక్కి చెప్పారు. కరీంనగర్‌లోని భగవతి పాఠశాలలో సమైక్య సాహితీ, తెలంగాణ సాహితీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్వేచ్ఛా కవి వేణుశ్రీ రచించిన ఓ ప్రచేత సా శతక ఆవిష్కరణ సభ జరిగింది. తంగిరాల చక్రవర్తి ఆ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కవిత్వం సమాజపరంగా వినిపించాలని సూచించారు. కరీంనగర్ ప్రాంత సాహిత్యం విశిష్టతను కలిగి ఉందన్నారు. కవి డాక్టర్ గండ్ర లక్ష్మణరావు మాట్లాడుతూ.. కలాలు వాస్తవాన్ని మాత్రమే తెలుపుతాయన్నారు. వర్తమాన సమాజ స్థితిని, గుణదోషాలను చెప్పిందే ప్రచేత సా శతకం అన్నారు. ఈ కార్యక్రమానికి సమైక్య సాహితీ అధ్యక్షులు మాడిశెట్టి గోపాల్ అధ్యక్షత వహించారు. బిషప్ జూనియర్ కాలేజీ పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజీవరావుకు అంకితం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత వారాల ఆనంద్‌ను ఘనంగా సన్మానించారు. కూకట్ల తిరుపతి పుస్తకం సమీక్షించారు. వేణు శ్రీ భగవతి రమణారావు డాక్టర్ రామకృష్ణ, కేఎస్. అనంతా చార్య, సీహెచ్ రమణా చారి, బీవీఎన్ స్వామి, మాడుగుల రాములు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో యోగా సంపత్, సంకేపల్లి నాగేంద్ర శర్మ, కరుణాకర్, బాలసాని రాజయ్య, గంగుల శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

సునీత్ చోప్రా బహుముఖ ప్రజ్ఞాశాలి

సంతాప సభలో వక్తలు



న్యూఢిల్లీ : సునీత్ చోప్రాను ఉద్యమ సహచరులు, స్నేహితులు గుర్తుచేసుకున్నారు. ఇది ఒక అరుదైన విప్లవకారుడి జీవిత చిత్రమని వక్తలు కొనియాడారు. సోమవారం నాడిక్కడ ఏఐఏడబ్ల్యూయూ కేంద్ర కార్యాలయంలో సునీత్ చోప్రా సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ విప్లవకారుడిగా జీవితం గడిపిన సునీత్‌కు, ఇతరుల సామర్థ్యాలను వెలికితీసే అపురూపమైన సామర్థ్యం ఉందన్నారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని, అన్నింటికంటే మంచి మనిషి అని ఏచూరి పేర్కొన్నారు. కళలు, సాంస్కృతిక రంగాల్లో ఉన్నత వర్గాలతో పాటు, గ్రామీణ వ్యవసాయ కార్మికులతో సమానంగా జీవించిన సునీత్‌ను సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాష్ కారత్ గుర్తు చేసుకున్నారు. సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్ మాట్లాడుతూ లండన్‌లో సునీత్ విద్యార్థి జీవితంతో సహ ఆయన విద్యార్థి ఉద్యమాన్ని గుర్తు చేసుకున్నారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ మాట్లాడుతూ ప్రజల మధ్య జీవించిన సునీత్, సంఘం పనిలో ఉండగానే మెట్రో స్టేషన్ లో కుప్పకూలి మృతిచెందారని తెలిపారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, జాతీయ అధ్యక్షుడు ఎ. విజయరాఘవన్ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి లో కేరళలో ఉన్న సునీత్, ఇఎంఎస్ స్వ గ్రామంలో సీపీఐ(ఎం) ఇంటింటి సందర్శన కార్యక్రమంలో భాగంగా అనేక ఇండ్లను సందర్శించారని గుర్తు చేశారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా సునీత్ తనదైన ముద్ర వేయగలిగాడని విజయరాఘవన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఏడబ్ల్యూయూ సహాయ కార్యదర్శి విక్రమ్‌సింగ్, జేఎన్‌యూ ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్, కళాకారులు, క్యూబా, ఉత్తర కొరియా ప్రతినిధులు, ఏఐకేఎస్ నాయకులు హన్నన్ మొల్లా, విజూ కృష్ణన్, ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు విపి సాను తదితరులు నివాళులర్పించారు.

విమలా రణదివె జయంతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్వాతంత్ర్య సమరయోధురాలు, ట్రేడ్ యూనియన్ నేత విమలా రణదివె 108వ జయంతిని సోమవారం హైదరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విమలా రణదివె చిత్ర పటానికి ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జాతీయ ఉద్యమంలో ఆమె కీలకపాత్ర పోషించిన విషయాన్ని గుర్తుచేశారు. సమాజంలో దోపిడీ పోవాలంటే వర్గపోరాటం తప్ప మరొకటి లేదని చెప్పి కార్మిక పోరాటాన్ని ఉధృతం చేసిన మహనీయురాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వదేశీ జపం చేస్తూ మన దేశాన్ని విదేశీ పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు, మతోన్మాద శక్తులకు కట్టబెడుతున్నదని విమర్శించారు. పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్యం మనుగడకే ప్రమాదం ముంచుకొచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలను, రైతాంగాన్ని, పేద ప్రజలను సమీకరించి ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు చేయడమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రమ మాట్లాడుతూ.. విమలా రణదివె 12వ ఏటనే దేశ స్వాతంత్రం కోసం జరిగిన ఉద్యమంలో పాల్గొన్నదనీ, 6 నెలలు జైలు శిక్షను కూడా అనుభవించారని గుర్తుచేశారు. వాయిస్ ఆఫ్ వర్కింగ్ ఉమెన్ పత్రిక ఎడిటర్‌గా, అంగన్‌వాడీ వ్యవస్థాపక అధ్యక్షురాలిగా పనిచేసిన విషయాన్ని గుర్తుచేశారు. మహిళలను పోరాటాలలో భాగస్వామ్యం చేయకుండా దేశం విముక్తి కాదని నొక్కి చెప్పారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకుపోవడమే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, కార్యదర్శి పి. శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు వై. సోమన్న, పి. సుధాకర్, ఎ. సునీత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గవర్నర్ తీరుపై పిటిషన్ విచారణ వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదం పొందిన 10 బిల్లులను ఆమోదించేలా గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ కు ఉత్తర్వులు ఇవ్వాలని దాఖలైన పిటిషన్ పై విచారణను సర్వోన్నత న్యాయ స్థానం రెండు వారాలకు వాయిదా వేసింది. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు ఆమోదముద్ర వేసే దిశలో గవర్నర్ తీరును తప్పుబడుతూ తెలంగాణ ప్రభుత్వం మార్చి 2న సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ ను దాఖలు చేసింది. ఈ పిటిషన్ సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహా, జస్టిస్ పార్దివాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా సొలిసిటర్ జనరల్(ఎస్ జి) తుషార్ మెహతా వాదిస్తూ... గవర్నర్ కొన్ని బిల్లులు ఆమోదించారని, అందుకు సంబంధించిన వివరాలతో ఉన్న లేఖను పరిశీలించాలని కోరారు. గవర్నర్ బిల్లులను ఆమోదించవచ్చని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 9న గవర్నర్ కార్యాలయం ఒక రిపోర్ట్ కోర్టుకు అందిందనీ, అది సీజేఐ రికార్డు చేశారని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వాన్ని మరి కొన్ని బిల్లుపై గవర్నర్ వివరణ కోరినట్టు వివరించారు. తాను గవర్నర్ తరపున అందుకున్న లేఖపై మాత్రమే వాదిస్తున్నాననీ, అయితే ఆ లేఖలో తనను ఉద్దేశించి ఉన్న అంశాన్ని తొలగించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ తరపు అడ్వకేట్ ఆన్ రికార్డ్ (ఏఓఆర్) శ్రీహర్ష పీచర వాదనలు వినిపించారు. తెలంగాణ ప్రభుత్వం తరపు వాదనలు వినిపిస్తోన్న సీనియర్ అడ్వకేట్ హాజరు కానుందున పాస్ అవుట్ చేయాలని ధర్మాసనాన్ని కోరారు. దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ఏవైనా అంశాలుంటే ప్రస్తావించాలని కోరారు. అసెంబ్లీ పాస్ చేసిన 10 బిల్లుల్లో పలు బిల్లులు 2022 సెప్టెంబర్ లో ఆమోదంపొందాయన్నారు. ఈ వాదనలపై జోక్యం చేసుకున్న సీజేఐ, 'పది బిల్లుల్లో మూడు బిల్లులు గతేడాది సెప్టెంబర్ లో పాస్ అయ్యాయి. ఈ బిల్లులపై గవర్నర్ కార్యాలయం నుంచి ఏవైనా ఫైనల్ ఇండికేషన్స్ ఉన్నాయా?' అని ఎస్ జీ ని ప్రశ్నించారు. ఎస్ జీ జోక్యం చేసుకొనీ, ఈ అంశాలపై తాను ఎలాంటి వ్యాఖ్యలను చేయలేనని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఈ బిల్లులపై గవర్నర్ కార్యాలయంతో చర్చించినట్టు తెలిపారు. మధ్యలో జోక్యం చేసుకున్న తెలంగాణ తరపు ఏఓఆర్ ఒక వారం వాయిదా వేయాలని కోరారు. ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం తెలంగాణ పిటిషన్ పై విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. 2022 సెప్టెంబర్ 9 నుంచి గవర్నర్ కార్యాలయంలో పెండింగ్ లో ఉన్న బిల్లుల ఆమోదంపై నిర్ణయం తెలపాలని ఆదేశాలు జారీ చేశారు. పంచాయితీ రాజ్ చట్టం(అమైండ్ మెంట్) బిల్లు, ఆజామాబాద్ ఇండిస్ట్రియల్ ఏరియా(అమైండ్ మెంట్) బిల్లు-2022 లపై న్యాయ శాఖ నుంచి ఎలాంటి స్పందన రాలేదని సీజేఐ వెల్లడించారు. తదుపరి విచారణ నాటికి ఏం జరిగిందో చెప్పాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశిస్తూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

మండుతున్న ఎండలు

9 జిల్లాల్లో 42 డిగ్రీలకుపైగా నమోదు

- దస్తూరాబాద్(నిర్మల్)లో 42.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత
- వచ్చే నాలుగు రోజుల్లో 2 నుంచి 4 డిగ్రీలు పెరిగే అవకాశం
- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. సోమవారం 9 జిల్లాలో 42 డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో అత్యధికంగా 42.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. వచ్చే నాలుగు రోజుల్లో రాష్ట్రంలో అదనంగా రెండు నుంచి నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

41 డిగ్రీలు దాటిన జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేస్తున్నది. ఆ జాబితాలో ఆదిలాబాద్, నిర్మల్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, హైదరాబాద్, రంగారెడ్డి, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలున్నాయి. ఎండలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

దస్తూరాబాద్(నిర్మల్)	42.8 డిగ్రీలు
కొల్లాపూర్(నాగర్‌కర్నూల్)	42.7 డిగ్రీలు
కట్టంగూర్(నల్లగొండ)	42.6 డిగ్రీలు
ఆదిలాబాద్ అర్బన్	42.6 డిగ్రీలు
నేలకొండపల్లి(ఖమ్మం)	42.5 డిగ్రీలు
అలంపూర్(జోగులాంబ గద్వాల)	42.4 డిగ్రీలు
హుజూర్‌నగర్(సూర్యాపేట)	42.4 డిగ్రీలు
తాళ్లమడుగు(ఆదిలాబాద్)	42.2 డిగ్రీలు
మహదేవ్‌పూర్(భూపాలపల్లి)	42.2 డిగ్రీలు

భారతదేశంలో గణరాజ్యాలు నిజమే

కానీ, ఇది ప్రజాస్వామ్యానికి పుట్టిల్లు కాదు: ఎస్వీకే ట్రస్టీ పి.సాంబిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారతదేశంలో గణరాజ్యాలు (స్టేట్స్ ఆఫ్ రిపబ్లికన్) ఉన్న మాట నిజమే అయినప్పటికీ, ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లు అది కాదని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టీ పి.సాంబిరెడ్డి స్పష్టం చేశారు. ఎస్వీకే కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయంలో 'ప్రజాస్వామ్యానికి మన దేశం పుట్టిల్లా? ప్రధాని వ్యాఖ్యల్లో వాస్తవమెంత?' అనే అంశంపై సోమవారం నిర్వహించిన వెబినార్‌లో సాంబిరెడ్డి వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక పరిణామ క్రమంలో శాస్త్రీయంగాను సాధ్యం కానీ ప్రజాస్వామ్యం ప్రాచీన కాలంలోనే ఉన్నట్టు ప్రధాని మోడీ చెప్పుకోవడానికి ఖండించారు. మన దేశంలో బౌద్ధ పాలకులు పై చేయిగా ఉన్నప్పుడు పురోగమనం జరిగిందని తెలిపారు. ఆదిమ సమాజం సమానత్వాన్ని కలిగి ఉందని తెలిపారు. అయితే సొంత ఆస్తి, ఆ ఆస్తిని వారసులకు ఇవ్వడం తదితర పరిస్థితులు వచ్చిన తర్వాత రాజ్యాలుగా ఏర్పడ్డాయని వివరించారు. అలాంటి రాజ్యాల్లో సమాజంలోని 80 శాతం మందికి ఓటు హక్కు నిరాకరించబడిందనీ, కేవలం 20 శాతం మంది మాత్రమే తమ నాయకులను ఎన్నుకునే హక్కు కలిగి ఉన్నారని వివరించారు. 80 శాతం మంది బానిసలుగా చాతుర్వర్ణ వ్యవస్థలో పై వర్గాలకు ఊడిగం చేయడానికి ఉద్దేశింపబడ్డాయని తెలిపారు. మనుధర్మశాస్త్రం పోవాలని దానితో బాధింపబడిన అసంఖ్యాక ప్రజలు కోరుకుంటుంటే ప్రధాని మోడీ తిరిగి అలాంటి ప్రజాస్వామ్యం తేవాలనుకుంటున్నారని సాంబిరెడ్డి విమర్శించారు.

ఫ్యూడల్, పెట్టుబడీదారీ వ్యవస్థల తర్వాతే ప్రజాస్వామ్యమొచ్చిందనీ, అయితే దానికి పరిమితులున్నాయని ఆయన తెలిపారు. వైదిక మతం, వేదాలు, మనుధర్మశాస్త్రం మనలను బలహీనం చేశాయనీ, అవి బలహీనమైతేనే పురోగమనం సాధ్యం అవుతుందని తెలిపారు. బౌద్ధపాలకుల కాలంలో అవి బలహీనపడి సమాజం పురోగమనంలోకి పయనించిందనీ, అయితే ఆది శంకరాచార్యుడు పాలకుల అండతో బౌద్ధాన్ని తరిమారని తెలిపారు. ఆది శంకరాచార్యునిది ప్రతిఘాత విప్లవంగా అభివర్ణించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రజాస్వామ్యం యూరోప్‌లో పుట్టిందనీ, అంతకు ముందు అక్కడి సమాజం వెయ్యేండ్లు ఫ్యూడల్ వ్యవస్థకు, చర్చి దోపిడీకి గురయిందని తెలిపారు. ఆడంస్మిత్,హెగెల్, రూసో లాంటి వారు శ్రమ, హేతబద్ధత, సమానత్వం, స్వేచ్ఛ తదితర విషయాలు గురించి చెప్పడం, వాటితో పెట్టుబడీదారి సమాజం, కార్మికులు, రైతాంగం కలిసి ఫ్యూడల్ ప్రభు వులు, చర్చికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారని వివరించారు. చరిత్రలో తొలిసారిగా ఫ్రెంచ్‌లో సంపూర్ణ విప్లవమొచ్చిందని వివరించారు. అక్కడ శత్రు శేషం లేకుండా చేశారని తెలిపారు. ఆ తర్వాత అందరికి ఓటు హక్కు వచ్చిందన్నారు. ఆదిమ, బానిక, ఫ్యూడల్, పెట్టుబడీదారీ వ్యవస్థల క్రమాను గత పురోగమనంలో భాగంగా ప్రజాస్వామ్యం ఉద్భవించిందని తెలిపారు.

బండి సెల్‌ఫోన్ ఇవ్వలేదు

- దర్యాప్తునకు సహకరించడం లేదు
- హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి హిందీ పేపర్ లీక్ కేసు దర్యాప్తునకు ఆ కేసులో నిందితుడైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ సహకరించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఫోన్‌ను కూడా ఇవ్వడంలేదని చెప్పింది. దర్యాప్తు అధికారికి ఆయన ఫోన్ అప్పగించేలా ఆదేశాలివ్వాలని కోరింది. ఈ మేరకు ఏజీ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. విచారణకు సహకరించనందున సంజయ్ కింది కోర్టు గతంలో ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరారు. పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో బండి సంజయ్‌ను అరెస్టు చేసి హనుమకొండ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచిన కేసులో 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ మెజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఆయన వేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. జైలు నుంచి సంజయ్ విడుదలైనందున ఈ పిటిషన్‌లో విచారణ అవసరం లేదని ఏజీ వాదనలు వినిపించారు. బండి తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సీనియర్ న్యాయవాది వాదనలు వినిపించనున్నారని విచారణను వాయిదా వేయాలని కోరారు. దీంతో విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

ఎంపీ అర్వింద్‌కు వెసులుబాటు

అట్రాసిటీ కేసులో నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌కు హైకోర్టులో వెసులుబాటు లభించింది. వ్యక్తిగత పూచీకత్తులపై ముందుస్తు బెయిల్ ఇవ్వాలని పోలీసులకు ఆదేశాలిచ్చింది. 2022, జనవరిలో చంచల్‌గూడ వద్ద విలేకరుల సమావేశంలో అనుచితంగా మాట్లాడారన్న ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసు కొట్టేయాలనీ, ఈలోగా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఎంపీ హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. అర్వింద్‌ను అరెస్టు చేయబోమని పోలీసుల తరపు న్యాయవాది చెప్పగా పైవిధంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్‌భూయాన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను ఈనెల 21కి వాయిదా వేశారు.

వివేకా హత్య కేసు నేటికి వాయిదా

ఏపీకి చెందిన మాజీ ఎంపీ, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద హత్య కేసులో నిందితుడు దస్తగిరిని అప్రూవర్‌గా మారారని చెప్పి అతనికి క్షమాభిక్ష పెట్టడాన్ని సవాల్ చేసిన పిటిషన్లపై విచారణ మంగళవారానికి వాయిదా పడింది. ఎంపీ కృష్ణారెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి వేసిన పిటిషన్లను జస్టిస్ సురేందర్ విచారణ చేపట్టారు.

పంచాయతీ కార్మికులకు జీతాలెందుకు పెంచరు?

- 50 వేల మంది కార్మికుల గోస పట్టదా
- వారి సమస్యల్ని వెంటనే పరిష్కరించాలి : పాలడుగు భాస్కర్
- పంచాయతీరాజ్ కమిషనరేట్ ఎదుట జేఏసీ ధర్నా
- డిప్యూటీ కమిషనర్ రామారావుకు వినతి



నవతెలంగాణ - హిమాయత్‌నగర్

అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు పెంచినట్టుగా పంచాయతీ కార్మికులకు జీతాలెందుకు పెంచరని గ్రామ పంచాయతీ కార్మిక, ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మెన్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 50 వేల మంది కార్మికుల గోస పట్టదా? అని నిలదీశారు. వారి సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలనీ, పని భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనరేట్ ఎదుట కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్ రామారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ధర్నానుద్దేశించి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. పంచాయతీల్లో పనిచేస్తున్న సుమారు 50వేల మంది కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం నిలువు దోపిడీ చేస్తున్నదని విమర్శించారు. మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పనిభారం పెంచి వేతనాలు పెంచకపోవటంతో కార్మికులకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, మానసికంగా అలసిపోయి అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన మున్సిపాల్టీల్లో పనిచేస్తున్న కార్మికులకు రూ.15,600 వేతనం చెల్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఒకే విధమైన పనిచేస్తున్న పంచాయితీ కార్మికుల పట్ల ఎందుకు వివక్ష ప్రదర్శిస్తుందని ప్రశ్నించారు. గ్రామపంచాయితీ సిబ్బందికి స్కిల్డ్, సెమీ, అన్‌స్కిల్డ్ కేటగిరీ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

అందర్నీ పర్మినెంట్ చేయాలని కోరారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా పంచాయతీ అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని నియమించుకోవాలనీ, మల్టీపర్పస్ పని విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన కారోబార్, బిల్ కలెక్టర్లకు పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. ఎస్‌కేడే ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని విన్నవించారు. సహజ మరణానికి 5 లక్షల రూపాయలు, ప్రమాదవ శాత్తు మరణిస్తే 10 లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వారాంతపు సెలవులు, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు నర్సింహ్మారెడ్డి, జయచంద్ర, వెంకటరాజం, శివశంకర్, మల్లయ్య, యజ్ఞనారాయణ, సదానందం, పాలడుగు సుధాకర్, వెంకటయ్య సూర్యం, సాంబశివరావు, శివబాబు, దాసు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హోదా ఉపసంహరణ అవివేక చర్య

- ఎన్నికల కమిషన్ నిబంధనలే తప్పు
- కంకి కొడవలి గుర్తుకు ఎలాంటి ఇబ్బంది లేదు : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దాదాపు వందేండ్ల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ హోదాను ఎన్నికల కమిషన్ ఉపసంహరించడం అవివేకమైన చర్య అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలే తప్పుగా ఉన్నాయని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో దీనిపై సవాల్ చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలను ఆధారంగా చేసుకుని జాతీయ హోదా ఇవ్వడం సరైంది కాదని తెలిపారు. ఎన్నికల అవగాహనలు, సీట్ల సర్దుబాట్లు ఉంటాయని వివరించారు. అన్ని సీట్లలో పోటీ చేసే అవకాశముండబోదని పేర్కొన్నారు. వాటిని పరిగణనలోకి తీసుకోకుండా తప్పుడు విధానంతో జాతీయ హోదాను తొలగించడం సరైంది కాదని తెలిపారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో బహుళ పార్టీ విధానం ఉందని పేర్కొన్నారు. ఎన్నికలు డబ్బు, ప్రలోభాల మయం అయిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ స్వాతంత్ర్యంలో ఆ తర్వాత అనేక కీలక మలుపుల్లో తమ పార్టీ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. దామాషా ఎన్నికలు నిర్వహిస్తే అసలు బలం తెలుస్తుందని తెలిపారు. ఎన్నికల్లో ధన ప్రభావాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వమే అభ్యర్థుల ఎన్నికల ఖర్చును భరించాలని డిమాండ్ చేశారు. బహుముఖ పోటీలో 20 లేదా 30 శాతం ఓట్లు వచ్చినా అభ్యర్థులు గెలుస్తున్నారని వివరించారు. కనీసం 50 శాతం ఓట్లు రాని విజేతకు జనామోదం లేదని భావిస్తామా?అని ప్రశ్నించారు. తమ పార్టీ గుర్తు కంకి కొడవలికి ఎలాంటి ఇబ్బంది ఉండబోదని ఆయన స్పష్టం చేశారు.

నేటినుంచి ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవాలు

13 వరకు జరపాలని తెలంగాణ రైతుసంఘం పిలుపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం నుంచి ఈనెల 13 వరకు గ్రామాల్లో సభలు, ప్రదర్శనలను జరిపి సంఘం జెండావిష్కరణలు చేయాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. సోమవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం పోస్టర్లను తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, ఉపాధ్యక్షులు నంద్యాల నర్సింహారెడ్డి, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, రాష్ట్ర నాయకులు ఆర్ రాహుల్, ఆర్ ఆంజనేయులులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ దున్నేవాడికే భూమి, ఆంగ్లేయులు భారతదేశాన్ని విడిచి వెళ్లాలనే నినాదంతో 1936, ఏప్రిల్ 11న స్వాతంత్రోద్యమంలో భాగంగా ఏఐకేఎస్ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర గ్రామీణ పేదల్ని సంఘటిత పరిచిందన్నారు. భూస్వామ్య విధానాన్ని సమూలంగా రద్దు చేయడం, పేద రైతులు, వ్యవసాయ కార్మికుల ఐక్యత పునాదిగా రైతాంగాన్ని ఏకం చేసిందని చెప్పారు. రైతు సమస్యలపై ఆందోళనలు నిర్వహించడంతోపాటు ఇతర వర్గాల పోరాటాలకు సంఘీభావం తెలిపిందని అన్నారు. మార్కెట్ గుత్తాధిపత్యంతో సాగే దోపిడీని ఎదిరించిందని వివరించారు. వ్యవసాయంలో విదేశీ కంపెనీల చొరబాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని చెప్పారు. వడ్డీ ప్రమాణాల మెరుగుదల కోసం, గ్రామీణ ప్రజల సాంస్కృతిక అభివృద్ధి కోసం పాటుపడుతుందని అన్నారు. సంఘం నాయకత్వాన వర్లీ ఆదివాసుల పోరాటం, తెభాగ పోరాటం, పున్నప్రావాయలార్, గణముక్తి పోరాటాలు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగాయని గుర్తు చేశారు. భూ సంస్కరణలను అమలు జరపాలంటూ సాగిన పోరాటంతో 1968లో మొదటిసారి, 1973లో రెండోసారి అవి అమలయ్యాయని చెప్పారు. ఫలితంగా 64.96 లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకుని 54.02 లక్షల ఎకరాలను దేశవ్యాప్తంగా జపంపిణీ చేశారని వివరించారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను ఢిల్లీలో రైతాంగ పోరాట ఫలితంగా కేంద్రం ఉపసంహరించుకున్నదని అన్నారు. కేంద్రం ఇచ్చిన హామీల అమలు, కనీస మద్దతు ధరల చట్టం, రుణ విమోచన చట్టం కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని రైతాంగానికి ఆయన పిలుపునిచ్చారు.

మిగిలిన రైతులకు తక్షణమే రైతుబంధు విడుదల చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం రబీలో రైతుబంధు ప్రకటించి రైతుల ఖాతాల్లో నగదును జమ చేసిందని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, ప్రధాన కార్యదర్శి టి సాగర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కానీ కొంతమంది రైతులకు సుమారు రూ.300 కోట్ల బిల్లులు ట్రెజరీ వద్ద గత 50 రోజులుగా పాస్ చేయకుండా ఆగిపోయాయని పేర్కొన్నారు. దీంతో వారు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ బిల్లులు రాని వారిలో రైతుబంధు బాధితులున్నారని పేర్కొన్నారు. ఈ కొద్ది మంది రైతులకు జమ చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధుల చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రైతులు తిరుగుతున్నారని వివరించారు. గతనెల 31వ తేదీ వరకు డబ్బులు ఖాతాల్లో వేస్తామంటూ ప్రభుత్వం ప్రకటించినా అది అమలుకు నోచుకోలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన రైతులకు ఈనెల 15వ తేదీ వరకు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే బాధిత రైతులంతా ఆందోళనకు సిద్ధమవుతారని పేర్కొన్నారు.

నేటితో పది ప్రధాన పరీక్షలు పూర్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి ప్రధాన పరీక్షలు మంగళవారం సోషల్ స్టడీస్ సబ్జెక్టుతో పూర్తి కానున్నాయి. ఈనెల మూడో తేదీ నుంచి ఈ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. మొదటి రోజే ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్ష ప్రారంభమైన ఏడు నిమిషాలకే అంటే ఉదయం 9.37 గంటలకు ప్రశ్నాపత్రం వాట్సాప్‌లో బయటకొచ్చింది. రెండోరోజు హిందీ ప్రశ్నాపత్రం కూడా వాట్సాప్ ద్వారా బయటకొచ్చింది. దీంతో పరీక్షల నిర్వహణ, ప్రభుత్వ నిర్లక్ష్యం, పాఠశాల విద్యాశాఖ అధికారుల అలసత్వంపై పెద్దఎత్తున విమర్శలు తలెత్తాయి. మొదటి రోజు ఫస్ట్ లాంగ్వేజ్ ప్రశ్నాపత్రం బయటకు వెళ్లడానికి కారణమైన బందెప్ప, సమ్మప్పను ఉద్యోగం నుంచి ప్రభుత్వం తొలగించింది. రెండోరోజు హిందీ ప్రశ్నాపత్రం బయటకెళ్లిన ఘటనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై పోలీసులు ఏ1 ముద్దాయిగా కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అనంతరం ఆయన బెయిల్‌పై విడుదల య్యారు. ఆ తర్వాత థర్డ్ లాంగ్వేజ్ (ఇంగ్లీష్) పరీక్ష నుంచి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. దీంతో విద్యాశాఖ అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. సోమవారం నిర్వహించిన సైన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 4,86,829 మంది దరఖాస్తు చేసుకుంటే, 4,84,921 (99.61 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. 1,908 (0.39 శాతం) మంది గైర్హాజరయ్యారని వివరించారు. ప్రయివేటు విద్యార్థుల్లో 4,589 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 3,778 (82.33 శాతం) మంది పరీక్ష రాశారని తెలిపారు. 811 (17.67 శాతం)మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు మంది విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని తెలిపారు.

కంటి వెలుగుకు విశేష స్పందన

- హెచ్‌యూజే ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతం
- శిబిరాన్ని సందర్శించిన డీఎం అండ్ హెచ్‌ఓ వెంకట్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (హెచ్‌యూజే - టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. సోమవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఎంహెచ్ భవన్‌లో ఎంవీఎస్ఆర్ మెమోరియల్ హాస్పిటల్‌లో కంటిపరీక్షలు నిర్వహించారు. సుమారు 150 మంది జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు టెస్టులు చేయించుకున్నారు. దగ్గరి చూపులో స్వల్ప లోపం ఉన్న జర్నలిస్టులకు అక్కడే రీడింగ్ గ్లాసెస్ అందించారు. కంటిచూపు సమస్య ఎక్కువగా ఉన్న మరికొంత మందికి మూడు వారాల్లో కండ్లద్దాలు అందజేస్తామని అధికారులు తెలిపారు.

కాగా, కంటి వెలుగు శిబిరాన్ని డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకట్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ పద్మజ, కంటి వెలుగు ప్రోగ్రామ్ ఆఫీసర్ అశ్మిత తదితరులు సందర్శించారు. పరీక్షలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రిస్కిప్షన్ గ్లాసెస్‌ను మూడు వారాల్లో అందిస్తామని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకట్ తెలిపారు. ప్రతి ఒక్కరూ కంటి వెలుగు స్కీమ్ ద్వారా పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్, జగదీశ్వర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితంగా కంటివెలుగు పరీక్షలు నిర్వహించడం, అద్దాలు అందించడం అభినందనీయమన్నారు. జర్నలిస్టులకు ప్రత్యేక కంటివెలుగు శిబిరం నిర్వహించాలని కోరిన వెంటనే, సహకరించిన డీహెచ్ శ్రీనివాస్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ రామలక్ష్మి, డాక్టర్ శ్రీధర్, హెచ్‌యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ నవీన్, ట్రెజరర్ రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగవాణి, హెచ్‌యూజే ఆఫీస్ బేరర్లు క్రాంతి, వీరేష్, ఎం.రమేష్, ప్రశాంత్, నర్సింహా, రేణయ్య, కిష్టయ్య శ్రీధర్, కుమార్, రవితేజ, నిస్సార్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, రాష్ట్ర నాయకులు పిల్లి రాంచందర్, చంద్రశేఖర్, గుడిగ రఘు, ఆనందం, మధుకర్, బండి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన జాతిని నిర్లక్ష్యం చేస్తున్న బీజేపీ

- పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపట్టిన విద్యార్థులు
- పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి సత్యవతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గిరిజన జాతిని నిర్లక్ష్యం చేస్తున్నదని ఆ శాఖా మంత్రి సత్యవతి రాథోడ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో తెలంగాణ గిరిజన విద్యార్థుల పోస్టు కార్డు ఉద్యమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులకు సంబంధించిన 10శాతం రిజర్వేషన్ల అంశంపై కేంద్రం రాజ్యాంగ సవరణ చేసి ఆమోదించకుండా నిర్లక్ష్యం చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో గిరిజన విశ్వవిద్యాలయం విషయంలో పట్టనట్టుగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఈ నేపథ్యంలో తమ భవిష్యత్ ప్రయోజనాల రీత్యా ఈ అంశాలను కేంద్ర ప్రభుత్వం తక్షణం పరిగణలోకి తీసుకోవాలని కోరుతూ విద్యార్థులు పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టడం సముచితమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని 10శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నదనీ, దీంతో విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని వివరించారు. 2014 విభజన చట్టం ప్రకారం కేటాయించిన గిరిజన విశ్వవిద్యాలయాన్ని తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారామ్ నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు జాన్సన్ రాథోడ్, ప్రొఫెసర్ రమణ నాయక్, బీఆర్‌ఎస్ గిరిజన విద్యార్థి నాయకుడు శ్రీను నాయక్, వివిధ యూనివర్సిటీల విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నర్సింగ్ ఎక్సలెన్సీ అవార్డు గ్రహీత పుష్పకు అభినందనలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రం నుంచి నర్సింగ్ ఎక్స్‌లేన్సి అవార్డును అందుకున్న ఏకైక నర్సుగా కె.పుష్పకు పలువురు అభినందనలు తెలిపారు. సమర్పణ్ దివస్ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పేద రోగుల సేవల కోసం విశిష్ట సేవలందించిన నర్సులను ఎంపిక చేసి అవార్డులను అందజేసింది. ఢిల్లీ ఐఎంఏ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి డాక్టర్ మంజుపర మహేంద్రబాయ్, ఐఎంఏ జాతీయ అధ్యక్షులు డాక్టర్ శారద కె.ఆర్.అగర్వాల్, ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ అధ్యక్షులు డాక్టర్ దిలీప్ కుమార్ చేతుల మీదుగా నిలోఫర్ ఆస్పత్రి గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషారాణి తదితరులు ఆమెను అభినందించారు. అనంతరం పుష్ప మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అవార్డుకు రెఫర్ చేసిన ట్రెన్డ్ నర్సెస్ అసోసియేషన్ (టీఎన్‌ఏ) అధ్యక్షురాలు డాక్టర్ రాజేశ్వరికి కతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషారాణి నర్సులను అన్ని విధాల ప్రోత్సహిస్తున్నారని ధన్యవాదాలు తెలిపారు.

పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపించాలి



బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- విద్యార్థులకు భరోసా ఇవ్వని ప్రధాని
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసు విచారణలో పారదర్శకత ఉండాలంటే.. హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలంటూ డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం సాంబశివరావు మాట్లాడారు.

ప్రధాని మోడీ నగర పర్యటనలో బాధిత విద్యార్థులకు ఎలాంటి భరోసా ఇవ్వలేదు కానీ.. రెండు పేపర్ల లీకేజీ కేసులో ప్రమేయమున్న బండి సంజయ్‌కు భరోసా ఇచ్చేవిధంగా చేయి కలిపారని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంతో 30లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ఆందోళనకరంగా మారిందన్నారు. 10వ తరగతి పేపర్ బయటకు వచ్చిన వ్యవహారంలో ప్రశాంత్‌కు బీజేపీ అధ్యక్షులు బండి సంజయ్ ఇద్దరి మధ్య ఎలాంటి సంబంధాలున్నాయో విచారణ జరిపించాలన్నారు. ప్రభుత్వ శాఖలో అవుట్‌సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేయాలని, పర్మినెంట్ ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో ఏఐఎస్ఎఫ్ పోరాటాలు చేయాలని.. వారికి తమ మద్దతుంటుందని భరోసా ఇచ్చారు.


బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణతోపాటు బెంగాల్, మహారాష్ట్ర, గుజరాత్‌తోపాటు ప్రతి రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని ఏఐఎస్ఎఫ్ ఆల్‌ఇండియా అధ్యక్షులు శివం బెనర్జి తెలిపారు. ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరుగుతున్నాయన్నారు. అక్రమ సంపాదన కోసమే పథకం ప్రకారం పేపర్ లీకేజీలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రతి రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, ప్రముఖ సినీనటుడు ఆర్.నారాయణమూర్తి సంఘీబావం తెలిపారు. పేపర్ లీకేజీలు చేస్తూ విద్యార్థుల జీవితాలతో చలగాటం ఆడుకుంటున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగం వస్తే జీవితంలో స్థిరపడినట్టేనని నిరుద్యోగులు, వారి తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారని గుర్తు చేశారు. ఉద్యోగాల సాధన కోసం అప్పులు చేసి కోచింగ్ తీసుకుంటారని, ఎంతో కష్టపడి పరీక్షలు రాస్తే పేపర్ లీకేజీలకు పాల్పడ్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా వదులొద్దన్నారు. ఆర్ఎస్ఎస్ కమాండ్‌తో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా అవినీతి పెరిగిపోయిందని, అందులో భాగంగానే విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ జనార్ధన్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేసి బోర్డును ప్రక్షాళన చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. 30 లక్షల మంది నిరుద్యోగులకు ముఖ్యమంత్రి కేసీఆర్ భరోసానివ్వాలన్నారు. టీఎస్‌పీఎస్సీతోపాటు పదో తరగతి పేపర్ కేసులో ఏ1గా ఉన్న బండి సంజయ్‌ను వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంపాదకీయం

అ'న్యాయ తీర్పు'

మూడున్నర దశాబ్దాల క్రితం ఉత్తరప్రదేశ్‌లోని మలియానా గ్రామంలో జరిగిన పాశవిక ఊచకోత అప్పట్లో యావత్ దేశానికి భయోత్పాతం కలిగించగా అటువంటి కేసులో నేరారోపణలెదుర్కొంటున్న 40మంది నిందితులకు స్థానిక న్యాయస్థానం క్లీన్‌చిట్ ఇవ్వడం జాతి మొత్తాన్నీ నివ్వెరపర్చింది. కోర్టుల్లో తమకు న్యాయం జరుగుతుందని 36 ఏండ్లుగా నిరీక్షించిన బాధిత కుటుంబాలకు గుండెకోత మిగిల్చింది. 1987 మే 23న మీరట్ నగర శివార్లలోని మలియానా గ్రామంపై ప్రాంతీయ సాయుధ కానిస్టేబుళ్ల బృందం అర్థరాత్రి సమయంలో అల్లరి మూకలను వెంబడేసుకొని విచక్షణా రహితంగా కాల్పులు జరపగా 72మంది ముస్లింలు మరణించారు. ఈ మారణకాండ కేసు పోలీస్ దర్యాప్తు, కోర్టు విచారణ నత్తకు నడక నేర్పింది. దాడిలో 93 మంది పాల్గొనగా దశాబ్దాలపాటు విచారణ సాగడంతో చనిపోయిన వారు చనిపోగా 40మంది నేర అభియోగం ఎదుర్కొంటున్నారు. 800తడవలు కోర్టులో విచారణానంతరం సరైన సాక్ష్యాలు లేవంటూ మధుర జిల్లాకోర్టు నిందితులను వదిలిపెట్టింది. దర్యాప్తు ఏజెన్సీలు, ప్రాసిక్యూషన్ విఫలం కావడం వలన, ఆ రెండు ప్రక్రియలూ ఆలస్యమైనందున బాధితులకు న్యాయం జరగలేదు.

కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చాక మత ఘర్షణల కేసుల్లో నిందితులకు శిక్షలు తక్కువగా పడుతున్నాయి. గడచిన ఐదేండ్లల్లో 30శాతం లోపే శిక్షలు పడ్డాయని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదిక పేర్కొంది. ఢిల్లీలో 1984లో సిక్కు వ్యతిరేక అల్లర్లుకానీ 2002లో గుజరాత్‌లో గోద్రా అనంతర మారణ హోమంకానీ కేవలం విచారణలు ఆలస్యమైతేనో, దర్యాప్తు వ్యవస్థలు విఫలమైతేనో నిందితులు తప్పించుకున్నారనడం పాక్షిక విశ్లేషణే అవుతుంది. రాజకీయ ప్రభావం, దర్యాప్తు వ్యవస్థల కుమ్మక్కు కేసులు నీరుగారడానికి, న్యాయం ఆలస్యం కావడానికి, బాధితులకు న్యాయం దక్కకపోవడానికి ప్రధాన కారణాలు. పైకోర్టులను ఆశ్రయించి న్యాయం కోసం ప్రయత్నించాలి.



మలియానా హింసాకాండ నేపథ్యాన్ని చూడాలి. వివాదాస్పద బాబ్రీ మసీదు తాళాలు తెరిచాక 1987 మే 17న మీరట్‌లో పెద్ద ఎత్తున మతఘర్షణలు చెలరేగాయి. నగరంలో కర్ఫ్యూ విధించారు. మలియానా దాడి జరగడానికి ఒక్క రోజు ముందు మే 22న మీరట్ శివార్లలోని హషింపురా నుంచి 40మంది ముస్లింలను ప్రాంతీయ సాయుధ దళం, అల్లరి మూకలతో కలిసి అపహరించి ఢిల్లీ-యూపీ బోర్డర్‌కు తరలించి కిరాతకంగా కాల్చి చంపింది. శవాలను అప్పర్‌గంగ కాల్వలో పడేశారు. ఈ కేసు ముప్పై ఏండ్లు నడవగా మొదటి ప్రయత్నంలోనే ప్రాసిక్యూషన్ కేసును రుజువు చేయడంలో వైఫల్యం చెందింది. ట్రయల్‌కోర్టులో సాయుధ దళం తన జనరల్ డైరీని చూపించలేదని తెలియ వచ్చింది. ఆ అంశమే 2018లో ఢిల్లీ హైకోర్టు నిందితులపై నేరారోపణలు చేసేందుకు అవకాశం కల్పించింది. మలియానా కేసులోనూ ఎఫ్ఐఆర్ వైఫల్యం కనిపిస్తుంది. ప్రాసిక్యూషన్ అత్యంత లోపభూయిష్టం గా పనిచేసిందని మధుర కోర్టు ఎత్తిచూపింది. ప్రాసిక్యూషన్ కోర్టుకు అందజేయాల్సిన డాక్యుమెంట్లను కనీసం క్రమపద్ధతిలో పెట్టలేదు. పోస్టుమార్టం రిపోర్టులను ఫొటోకాపీలను అందజేసింది. వాటిని కోర్టు సాక్ష్యాలుగా అంగీకరింపని విధంగా చేసింది. కొందరు నిందితులు సంఘటనకు ముందే చనిపోయారంటూ ఓటర్ల జాబితాలో వారి పేర్లను పోలీసులు మార్చే ప్రయత్నం చేశారని కోర్టు దృష్టికి వచ్చింది. దర్యాప్తు అధికారి క్రాస్ ఎగ్జామినేషన్‌ను పూర్తి చేయలేదు. ఇంత దారుణంగా ఇన్వెస్టిగేషన్, ప్రాసిక్యూషన్ వ్యవస్థలు పని చేసినందునే నేరస్తులు బయటపడ్డారు.

కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చాక మత ఘర్షణల కేసుల్లో నిందితులకు శిక్షలు తక్కువగా పడుతున్నాయి. గడచిన ఐదేండ్లల్లో 30శాతం లోపే శిక్షలు పడ్డాయని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదిక పేర్కొంది. ఢిల్లీలో 1984లో సిక్కు వ్యతిరేక అల్లర్లుకానీ 2002లో గుజరాత్‌లో గోద్రా అనంతర మారణ హోమంకానీ కేవలం విచారణలు ఆలస్యమైతేనో, దర్యాప్తు వ్యవస్థలు విఫలమైతేనో నిందితులు తప్పించుకున్నారనడం పాక్షిక విశ్లేషణే అవుతుంది. రాజకీయ ప్రభావం, దర్యాప్తు వ్యవస్థల కుమ్మక్కు కేసులు నీరుగారడానికి, న్యాయం ఆలస్యం కావడానికి, బాధితులకు న్యాయం దక్కకపోవడానికి ప్రధాన కారణాలు. పైకోర్టులను ఆశ్రయించి న్యాయం కోసం ప్రయత్నించాలి. గుజరాత్‌లో బిల్కిస్‌బానో కేసులో శిక్షలు పడ్డ నిందితులనూ వదిలిపెడుతున్న ప్రభుత్వాలు కేంద్రంలో, కొన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న వేళ, మలియానా తీర్పు ఆందోళన కలిగిస్తుంది. మత విద్వేషాలు రెచ్చ గొడుతున్న ఉన్మాదశక్తులకు ఇంకా భయం లేకుండా పోతుంది. అటువంటి కుట్రలను ప్రజలు అప్రమత్తతతో ఎదుర్కోవాలి.

రబ్బరుతోటల రైతుల ఘోష


ప్రభాత్ పట్నాయక్

రబ్బరు ధరలు కరోనా కాలంలో పడిపోయాయి. ఆ తర్వాత మళ్ళీ కొంతమేరకు పెరిగినా ప్రస్తుతం మళ్ళీ పడిపోయాయి. కేరళ రాష్ట్రంలో రబ్బరు సాగు ఎక్కువ. దేశంలోని మొత్తం రబ్బరు పంటలో 80శాతం ఒక్క కేరళలోనే సాగుచేస్తారు. ఆ రైతులంతా ఇప్పుడు దారుణంగా దెబ్బతిన్నారు. కేంద్ర ప్రభుత్వం రబ్బరు రైతులను ఆదుకోడానికి ఏ మాత్రం తటపటాయింపూ లేకుండా తిరస్కరించింది. ఆ విధంగా తిరస్కరించడానికి మోడీ ప్రభుత్వం చూపిస్తున్న సాకులు ఏ మాత్రమూ సహేతుకంగా లేవు.

సీపీఐ(ఎం)కు చెందిన పార్లమెంటు సభ్యులు కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పియూష్ గోయెల్‌ను కలిసి కేంద్ర ప్రభుత్వం రబ్బరు రైతులను ఆదుకోడానికి జోక్యం చేసుకోవాలని, రబ్బరుకు కనీస మద్దతు ధర ప్రకటించాలని కోరారు. కాని మంత్రిగారు ఆ డిమాండ్‌ను పూర్తిగా తోసిపుచ్చారు. వాణిజ్య పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించడం కేంద్ర ప్రభుత్వ విధానం కానేకాదన్నారు. దేశంలో విస్తృత ప్రాంతంలో ఎక్కువగా పండించే ప్రధాన

ఆహార భద్రత కల్పించడం అంటే అవసరాలకు తగినంత మోతాదులో వాటిని అందుబాటులో ఉంచడం, వాటి ధరలను స్థిరంగా ఉంచడం మాత్రమే కాదు. వాటి డిమాండ్‌ను కూడా భద్రంగా ఉంచాలి. అంటే ప్రజానీకపు కొనుగోలుశక్తిని తగినంత మోతాదులో ఉండేలా చూసుకోవాలి. కేవలం తగినంత పరిమాణంలో ఆహారధాన్యాలను పండించేలా చూడడం ఒక్కటే ఆహారభద్రతకు సరిపోతుంది అనుకోవడం పొరపాటు. ఆహారధాన్యాల సరఫరా సక్రమంగా ఉండడంతోబాటు వాటి పంపిణీ కూడా సక్రమంగా జరిగేలా డిమాండ్ ను కూడా సక్రమంగా ఉంచుకోవడం కూడా ఆహార భద్రతలో భాగమే.

పంటలకు, ఎక్కువమంది ప్రజానీకం వినియోగించే పంటలకు, ఎక్కువ కాలం పాటు నిల్వ ఉండే పంటలకు, ముఖ్యంగా ఆహార భద్రతకు అవసరమైన పంటలకు మాత్రమే కనీస మద్దతు ధర ప్రకటించడం ప్రభుత్వ విధానం అని పియూష్ గోయెల్ వివరించారు. వాణిజ్య పంటలు ఈ ప్రమాణాలకు అనుగుణంగా లేనందున వాటికి కనస మద్దతు ధర నిర్ణయించడం కుదరదని ఆయన చెప్పారు.

ఇది రోతపుట్టించే వాదన. అసలు కనీస మద్దతు ధర అనేది ఎందుకు ప్రవేశపెట్టవలసి వచ్చిందో బహుశా మంత్రికి తెలియదనుకుంటాను. ఒకానొక సరుకు ధర ఎక్కువకాలం పాటు స్థిరంగా కొనసాగుతూ ఉంటే దానికి కనీస మద్దతు ధర అవసరం ఉండదు. ఒకానొక పంట ధర అస్థిరంగా కిందకు, పైకి మారిపోతూ ఉంటే, దాని ధర పడిపోయినప్పుడు ఆ పంటను పండించిన ఉత్పత్తిదారులకు (రైతులకు) దుర్భర పరిస్థితి ఏర్పడుతుంది. అటువంటి పరిస్థితిని నివారించడానికే కనీస మద్దతు ధర నిర్ణయించే విధానం వచ్చింది. అంతే తప్ప ఆ పంట ఎంత ఎక్కువ భూ భాగంలో పండిస్తారన్న ప్రమాణం కాని, ఇంకొక ప్రమాణం కాని కనీస మద్దతు ధర నిర్ణయించడానికి ప్రాతిపదిక కానేకావు. పంటల ధరల ఎగుడు, దిగుడుల నుండి రైతులను రక్షించడానికి మాత్రమే మద్దతు ధర నిర్ణయించడం అవసరమైంది. వాస్తవానికి ఆహార పంటలకన్నా, వాణిజ్య పంటల ధరలే ఎక్కువగా ఎగుడు దిగుడులకు లోనవుతూ ఉంటాయి.

దీని వెనుక కారణం ఇది: ఏదైనా పంట పండిన వెంటనే, ఎక్కువ మొత్తంలో మార్కెట్‌లో అందుబాటులోకి వస్తుంది. ప్రభుత్వం గనుక కనీస మద్దతు ధర రూపంలో ఆదుకోకపోతే, ఆసమయంలో దాని ధర పడిపోతూ ఉంటుంది. దానిని కొని ఎక్కువ మొత్తంలో నిల్వ చేసుకునే హోల్‌సేల్ వ్యాపారులు ఎంత తక్కువ ధరకు దానిని కొనగలిగితే అంత తక్కువకే కొనడానికి మొగ్గు చూపుతారు. రాబోయే కాలంలో ఆ సరుకు ఏ రేటుకు అమ్ముడు పోగలదో అంత కచ్చితంగా చెప్పలేనప్పుడు దానిని ఇప్పుడు వీలైనంత తక్కువ రేటుకే కొనడానికి వాళ్ళు సిద్ధపడతారు. అదే భవిష్యత్తులో ఆ సరుకు ధరలో అంత ఎక్కువ హెచ్చుతగ్గులు ఉండబోవు అని అంచనా ఉన్నప్పుడు ఆ సరుకును ఎక్కువ మొత్తంలో కొని నిల్వ ఉంచుకోడానికి సిద్ధపడతారు. అందువలన ఆ సరుకు ప్రస్తుత ధర పడిపోకుండా నిలదొక్కుకుంటుంది.

ఎక్కువ మంది ప్రజానీకం తరచూ వినియోగించే ఆహార ధాన్యాల వంటి సరుకుల ధరలు మరీ అంత హెచ్చుతగ్గులకు గురికావు. ఎందుకంటే ఆహారధాన్యాల ధరలు మరీఎక్కువగా పెరిగిపోతే దాని పర్యవసానాలను ఏ సమాజమూ భరించలేదు. అత్యంత దుర్మార్గమైన వలసపాలన కాలంలో మాత్రమే ఆహార ధాన్యాల ధరలు విపరీతమైన ఎగుడుదిగుడులకు గురయ్యాయి. అందుచేత కనీస మద్దతు ధర ఉన్నా, లేకున్నా ఆహార ధాన్యాల ధరల్లో ఎగుడుదిగుడులు కొంతమేరకు పరిమితంగానే ఉంటాయి. కాని వాణిజ్య పంటల విషయంలో అలా కాదు. ఎగుమతుల కోసం పండించే పంటలు, లేదా దేశీయంగా అంత అవశ్యం కాని సరుకుల తయారీకి ముడిసరుకుగా వినియోగించే పంటలు ధరల విషయంలో అంత స్థిరంగా ఉండవు. ఎక్కువ ఎగుడు దిగుడులకు లోనవుతూ ఉంటాయి.



ఈ వాస్తవం రబ్బరు ధరలను పరిశీలిస్తే బాగా కనిపిస్తుంది. 2014లో ఒక కిలో ముడి రబ్బరు ధర రూ.245 నుండి రూ.77కి పడిపోయింది. అంటే దాదాపు 70శాతం పడిపోయింది. ఇది రబ్బరు రైతుల పాలిట ఆశనిపాతంగా పరిణమించింది. ఈ మధ్య కాలంలో చూసినా ఇదే ధోరణి కనిపిస్తోంది. నవంబరు 2021లో కిలో ముడి రబ్బరు రూ.200 ఉంటే అది ఇప్పుడు రూ.120కి పడిపోయింది. అంటే దాదాపు 40శాతం. ఇటువంటి విపరీతమైన పతనం నుంచి రైతులను ఆదుకోడానికే ప్రభుత్వం జోక్యం చేసుకోవడం, కనీస మద్దతు ధర ప్రకటించడం అవసరం. అప్పుడే ధరల హెచ్చు తగ్గులను కొంతమేరకు అదుపు చేయడం సాధ్యపడుతుంది.

నయా ఉదారవాద విధానాలను మన దేశంలో అమలు చేయడం మొదలు పెట్టక మునుపు, అంటే ప్రభుత్వ జోక్యం, నియంత్రణలో ఆర్థిక వ్యవస్థ నడిచిన కాలంలో, వాణిజ్య పంటలకు వివిధ బోర్డులు ఉండేవి. అవి ఆ వాణిజ్య పంటలను నిర్ణీత కనీస ధరలకు కొనుగోలు చేసేవి. ధరలు పతనం అయ్యే పరిస్థితులు ఏర్పడితే బలంగా జోక్యం చేసుకునేవి. కాని, నయా ఉదారవాద విధానాల మొదలయ్యాక, ఈ బోర్డులు ఉనికిలో కొనసాగుతున్నప్పటికీ, వాణిజ్య పంటలను కొనుగోలు చేయడం, వాటిని అమ్మడం వంటి కార్యకలాపాలను నిలిపివేశాయి. అంటే అవి మార్కెట్‌లో జోక్యం చేసుకోవడం మానేశాయి.

పియూష్ గోయెల్ ఇంకొక విషయాన్ని కూడా చెప్పారు. ఆహార భద్రత కోసం ఆహార ధాన్యాల ధరలను స్థిరంగా ఉంచడం అవసరం అని, అటువంటి స్థిరత్వాన్ని వాణిజ్య పంటల విషయంలో కల్పించనవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఇది అర్థంలేని వాదన. ఆహార ధాన్యాలకు కనీస మద్దతు ధర కల్పించడం అవసరం అన్న విషయంలో రెండోఅభిప్రాయం లేనేలేదు. కాని ఏ విధమైన మద్దతు ధర వాణిజ్య పంటల విషయంలో కూడా అవసరం. అప్పుడే డిమాండ్ ను పెంచగలుగుతాం. రబ్బరు పంటకు కనీస మద్దతు ధర లేకపోతే ఆ పంట రేట్లు మార్కెట్ లో కుప్పకూలిపోతే, అప్పుడు రబ్బరు రైతుల ఆర్థిక స్థితి ఛిన్నాభిన్నమైపోతుంది. అప్పుడు వాళ్ళు తమకు అవసరమైన వస్తువులను మార్కెట్‌లో కొనుగోలు చేయలేరు. ఆహారధాన్యాల ధరలను స్థిరంగా ఉంచినా, రబ్బరు రైతులు వాటిని కొనగలిగే స్థితిలో ఉండరు.

ఒకవేళ రబ్బరు ధరలు పడిపోయినప్పుడు కూడా ఆ రైతులు ఆహారధాన్యాలను ఇంతకు ముందులాగే కొనుగోలు చేయడం కొనసాగించగలిగారు అని మాటవరసకి అనుకుందాం. అప్పుడు వాళ్ళు వేరే ఇతర సరుకులను అంతకు ముందు కొనుగోలు చేసిన స్థాయిలో కొనలేరు. అప్పుడు ఆ ఇతర సరుకులను ఉత్పత్తి చేసేవారి కొనుగోలుశక్తి పడిపోతుంది. అప్పుడు వాళ్ళు ఆహారధాన్యాలను అంతకుముందరి స్థాయిలో కొనుగోలు చేయలేరు.

ఆహార భద్రత కల్పించడం అంటే అవసరాలకు తగినంత మోతాదులో వాటిని అందుబాటులో ఉంచడం, వాటి ధరలను స్థిరంగా ఉంచడం మాత్రమే కాదు. వాటి డిమాండ్‌ను కూడా భద్రంగా ఉంచాలి. అంటే ప్రజానీకపు కొనుగోలుశక్తిని తగినంత మోతాదులో ఉండేలా చూసుకోవాలి. కేవలం తగినంత పరిమాణంలో ఆహారధాన్యాలను పండించేలా చూడడం ఒక్కటే ఆహారభద్రతకు సరిపోతుంది అనుకోవడం పొరపాటు. ఆహారధాన్యాల సరఫరా సక్రమంగా ఉండడంతోబాటు వాటి పంపిణీ కూడా సక్రమంగా జరిగేలా డిమాండ్ ను కూడా సక్రమంగా ఉంచుకోవడం కూడా ఆహార భద్రతలో భాగమే.

మరి ఒక కేంద్ర ప్రభుత్వంలో కేబినెట్ స్థాయిలో ఉన్న వ్యక్తి ఇటువంటి అర్థంలేని వాదనలను ఎందుకు చేస్తున్నట్టు? కొద్ది కాలం క్రితం ఇదే ప్రభుత్వం అసలు కనీస మద్దతు ధరల విధానమే అనవసరం అని చెపుతూ దుర్మార్గమైన నల్ల చట్టాలను తెచ్చింది. అప్పుడు ఆహారధాన్యాలకు కూడా కనీస మద్దతు ధర అవసరం లేదు అన్న ప్రభుత్వం ఇప్పుడు వాణిజ్య పంటలకు అవసరం లేదంటున్నది. రైతులు పట్టుదలగా పోరాడడంతో దిగివచ్చి ఆ నల్ల వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుంది.

మన దేశీయ వ్యవసాయాన్ని దెబ్బతీయడానికి సిద్ధమైపోయిన కేంద్ర ప్రభుత్వ విధానానికి భిన్నంగా కేరళ రాష్ట్ర ప్రభుత్వం తన ఆర్థిక వనరుల పరిమితులు ఎన్ని ఉన్నా, రబ్బరు రైతులకు అండగా నిలబడుతోంది. 204లో రబ్బరు ధరల స్థిరీకరణ నిధిని నెలకొల్పింది. గతేడాది బడ్జెట్‌లో అందుకోసం కేటాయింపులను రూ.600కోట్లకు పెంచింది. కిలో రబ్బరుకు కనీస ధర రూ.170గా నిర్ణయించింది. అంతకన్నా తక్కువ ధరకు రబ్బరును అమ్ముకోవలసివస్తే ఆ తేడాను రాష్ట్ర ప్రభుత్వం రైతుకు భర్తీ చేస్తోంది.

కార్పొరేట్-హిందూత్వ శక్తుల కలయిక మీద ఆధారపడి నడుస్తున్న ఈ ప్రభుత్వం వ్యవసాయంలో ఎలాగైనా కార్పొరేట్ల ప్రవేశానికి తలుపులు తెరవాలన్న ప్రయత్నంలో ఉంది. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల డిమాండ్లకు అనుగుణంగా వ్యవసాయ రంగ రూపురేఖల్ని మార్చేయాలని చూస్తోంది. కార్పొరేట్లకు రైతులకు నేరుగా సంబంధం నెలకొల్పితే అప్పుడు స్వదేశీ, విదేశీ కార్పొరేట్ రాబందుల ముందు రైతులు దాసోహం అనక తప్పని పరిస్థితి వస్తుంది. ఇప్పుడు ఈ ప్రభుత్వం లక్ష్యం ఇదే. పైకి దేశం గురించి, దేశ ప్రయోజనాల గురించి ఎన్ని కబుర్లు చెపుతున్నా, వాస్తవానికి అమలు చేస్తున్నది మాత్రం ఈ నయా ఉదారవాద ఎజెండానే. వ్యవసాయం విషయంలో ప్రపంచ వాణిజ్య సంస్థ ఏం కోరుతోందో దానినే మోడీ ప్రభుత్వం అమలు చేయడానికి పూనుకుంటున్నది.

వ్యవసాయానికి ప్రభుత్వం మద్దతు ఇచ్చే విధంగా జోక్యం చేసుకోవడం అంటే ప్రపంచ వాణిజ్య సంస్థ దృష్టిలో అది మార్కెట్‌లో అనుచిత జోక్యం చేసుకోవడం అవుతుంది. అదే రైతులకు నేరుగా నగదు బదిలీ చేస్తే మాత్రం అది అనుచిత జోక్యం అనిపించుకోదు. అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు వందల కోట్ల డాలర్లు తమతమ రైతులకు నేరుగా నగదు రూపంలో అందిస్తుంటాయి. అందుకు ప్రపంచ వాణిజ్య సంస్థ ఏ అభ్యంతరమూ చెప్పదు. అదే కనీస మద్దతు ధర కల్పించే రూపంలో జోక్యం చేసుకుంటే మాత్రం అది మార్కెట్‌లో ధరలను ప్రభావితం చేస్తుంది అన్నవాదనతో దానిని వ్యతిరేకిస్తుంది. మార్కెట్ పూర్తిగా పోటీ మార్కెట్‌గానే ఉండాలని అంటుంది. అయితే వాస్తవంలో ఆ మార్కెట్ పూర్తిగా అగ్రి-బిజినెస్ కార్పొరేట్ల గుత్తాధిపత్యంలో నడుస్తుంది. కనీస మద్దతు ధర అనగానే, వాళ్ళకి అదొక ఆటంకంగా, అనుచిత జోక్యంగా అనిపిస్తుంది. ఎంత తక్కువ రేటుకు వీలైతే అంత తక్కువకే రైతులను దోచుకోవాలనుకునేవాళ్ళకి కనీస మద్దతు ధర అనే పద్ధతి ఆటంకంగానే అనిపిస్తుంది మరి.

అటువంటి శక్తులకి దాసోహం అంటూ మన దేశీయ వ్యవసాయాన్ని దెబ్బతీయడానికి సిద్ధమైపోయిన కేంద్ర ప్రభుత్వ విధానానికి భిన్నంగా కేరళ రాష్ట్ర ప్రభుత్వం తన ఆర్థిక వనరుల పరిమితులు ఎన్ని ఉన్నా, రబ్బరు రైతులకు అండగా నిలబడుతోంది. 204లో రబ్బరు ధరల స్థిరీకరణ నిధిని నెలకొల్పింది. గతేడాది బడ్జెట్‌లో అందుకోసం కేటాయింపులను రూ.600కోట్లకు పెంచింది. కిలో రబ్బరుకు కనీస ధర రూ.170గా నిర్ణయించింది. అంతకన్నా తక్కువ ధరకు రబ్బరును అమ్ముకోవలసివస్తే ఆ తేడాను రాష్ట్ర ప్రభుత్వం రైతుకు భర్తీ చేస్తోంది. (స్వేచ్ఛానుసరణ)

అలుపెరగని అరుణతార విమలా రణదివే...



'పూవు పుట్టగానే పరిమళిస్తుందన్నట్టు...' చిన్న వయస్సు నుంచే స్వాతంత్ర్యం కోసం ఉద్యమ జెండా పట్టిన వీర వనిత విమలా రణదివే. "సోదరీ సోదరులారా! మేలుకోండీ! దేశం మంటల్లో ఉంటే మనం నిద్రపోతే ఎలా? 13ఏండ్ల వయస్సులోనే 'సేవాదళ్' అనే స్వచ్ఛంద సంస్థలో చేరి ప్రభాత భేరీలు మోగించిన స్వేచ్ఛా పిపాసి విమలా రణదివే. ఆ వీర వనిత జీవిత అనుభవాలు శ్రామిక మహిళాలోకానికి స్ఫూర్తినిస్తాయనడంలో సందేహమేమీ లేదు. ఆమె పోరాట పటిమను అలవర్చుకోవాల్సిన అవసరాన్ని ప్రస్తుత పరిస్థితులు నొక్కి చెబుతున్నాయి. 'విమలా దీ' అని అందరూ ఆప్యాయంగా పిలుచుకొనే విమలా రణదివే జన్మదినం ఏప్రిల్ 10, 1915. ఆమె బతికున్నన్నాళ్లు శ్రామిక మహిళ హక్కుల కోసం నిరంతరం పోరాడారు. కార్మికవర్గ పోరాటాల్లో శ్రామిక మహిళల పాత్ర గురించి విమలా రణదివే జ్ఞాపకాల్లో ప్రస్తావించిన అనేక విషయాలు ప్రస్తుత పరిస్థితుల్లో శ్రామిక మహిళలు నిర్దేశించుకున్న లక్ష్యాలకు ఉపకరిస్తాయనటంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో విమలా రణదివే జయంతి సందర్భంగా ఈ నెల 10నుంచి 17వరకు శ్రామిక మహిళలు-పని ప్రదేశాల్లో హక్కులు అనే అంశంపై స్మారక ఉపన్యాసాలు, సదస్సులు, జనరల్ బాడీలు, సెమినార్లు నిర్వహించాలని సీఐటీయూ పిలుపునిచ్చింది.


ఎస్.వి.రమ
9490098899

కామ్రేడ్ విమల 12ఏండ్ల వయస్సులోనే ఉద్యమ ప్రస్థానం ప్రారంభించారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొని 13ఏండ్లప్పుడే ఆరునెలలు జైలుశిక్ష అనుభవించారు. విదేశీ వస్త్రాలనమ్మే దుకాణాల ముందు పికెటింగులు నిర్వహించాలనే పిలుపునందుకుని షాపు గుమ్మంలో నిలబడి విదేశీ వస్త్రాలెవరూ కొనొద్దని నినదించారు. దీంతో విదేశీ సైనికులు ఆమెను అరెస్టు చేసి, కోర్టుకి తీసుకెళ్లి జడ్జీ ముందు నిలబెట్టారు. మీరు చిన్నపిల్లలు... "మీకు రాజకీయాలు తెలియవు..." కాబట్టి 'క్షమాపణ చెబితే... మిమ్మల్ని ఇంటికి పంపిస్తాం' అని జడ్జి అన్నారు. ఆ మాటలకు సమాధానంగా విమలా రణదివే, "కుసుమ్.. మేము ఏం చేశామో, ఎందుకు చేశామో మాకు తెలుసు. కాబట్టి మేము క్షమాపణ చెప్పబోమని' తెగేసి చెప్పారు. దీంతో వారికి ఆరుమాసాలు జైలు శిక్ష, కఠిన కారాగారవాసం 'సీక్లాస్..." అని తీర్పు వెలువరించారు. విడుదలై వచ్చాక చదువు కొనసాగించారు. కుటుంబ పోషణ కోసం టీచర్‌గా ఉద్యోగం చేశారు. ఆమె పుట్టిల్లు వామపక్షభావాల నిలయం. ఆమె సోదరుడు సర్ దేశాయ్. ఆయన ప్రోత్సాహంతో ఆమె కమ్యూనిస్టు భావాలను వంట పట్టించుకున్నారు. గిర్ని కాంగార్ (మిల్లు కార్మికులు) సంఘంలో చేరి వారిని సంఘటితం చేయడం మొదలు పెట్టారు. సర్ దేశాయ్, బీటీఆర్ కుటుంబాల మధ్య స్నేహం, అనుబంధం ఏర్పడ్డానికి కారణం వామపక్షభావాలే. ఆ విధంగా బీటీఆర్ చెల్లెళ్లు అహల్య (రంగ్నేకర్), కుసుమ్‌తో విమలకు స్నేహం ఏర్పడింది. అందరూ కలిసి 'గిర్ని కాంగార్ సంఘం'లో చేరి పనిచేసేవారు. మిల్లు కార్మికుల సమ్మె సందర్భంగా అప్పటి బ్రిటిషు ప్రభుత్వం నిషేధాజ్ఞలు విధించింది. నిషేధాజ్ఞలను ధిక్కరించి మరీ ప్రదర్శన జరిగింది. ఆ ప్రదర్శనలో కమల్ ధోండీ ప్రాణాలు పోయాయి. కుసుమ్ కాళ్లల్లో తూటాలు దిగబడి గాయాలయ్యాయి. అప్పటికి ఇంకా దేశానికి స్వాతంత్ర్యం రాలేదు. రహస్య జీవితంలోనే బీటీఆర్‌తో వివాహమైంది. అరెస్టులు, జైళ్లు, రహస్య జీవి తాలు ఆమె జీవితంలో అంతర్భాగమయ్యాయి. కుటుంబ పోషణ కోసం చిన్న చిన్న ఉద్యోగాలు చేసిన కాలం మినహా, ఊపిరి ఉన్నంత వరకు ఉద్యమ జీవితాన్ని సాగించారు. స్వాతంత్ర్యానంతరం మహిళా ఉద్యమం, కార్మికోద్యమం రెండింటిలోనూ కొనసాగారు. కార్మిక సంఘం కేంద్రం కలకత్తాలో వున్న కాలంలో టీ-కాఫీ-రబ్బర్ ప్లాంటేషన్ కార్మిక సంఘంలో బాధ్యతలు తీసుకున్నారు. భాష సమస్య ఉన్నప్పటికీ కార్మికుల కష్టాలు తెలుసుకునేందుకు పట్టుదలతో బెంగాలి భాషపై పట్టు సాధించారు. 1979లో మద్రాసులో సీఐటీయూ మహాసభ సందర్భంగా మొదటి శ్రామిక మహిళా సదస్సు కూడా జరిగింది. ఆ సదస్సులో ఆమెకు కన్వీనర్ బాధ్యతను అప్పగించింది. 1989లో అంగన్‌వాడీ యూనియన్ ఏర్పడింది. ఆ సంఘం గౌరవాధ్యక్షురాలిగా ఉన్నారు. సుమారు 20ఏండ్లు 'ది వాయిస్ ఆఫ్ వర్కింగ్ ఉమెన్' పత్రికకు సంపాదకులుగా పనిచేశారు. శ్రామిక మహిళల సమస్యలపై వర్గ దృక్పథంతో అర్థం చేసుకొని పని చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో శ్రామిక మహిళల హక్కులు, అవకాశాలను కత్తిరించబడుతున్నాయి. స్కీము వర్కర్లు, విద్యా వైద్యం వంటి శాఖల్లో పని చేసే మహిళా కాంట్రాక్టు ఉద్యోగుల శ్రమశక్తిని కారుచౌకగా ఉపయోగించుకుంటోంది.

వస్తూత్పత్తి ఖర్చు తగ్గించుకుని తద్వారా మార్కెట్లో పోటీని తట్టుకొని నిలబడేందుకు తక్కువ వేతనాలకే వారిని పనిలో చేర్చుకుంటున్నారు. ఫ్యాక్టరీ పనిని ఇళ్లకు బదలాయించి స్త్రీలను 'హోమ్ బేస్డ్' వర్కర్లుగా మారుస్తున్నారు. వారి ఇళ్లనే కార్ఖానాలుగా, వస్తు తయారీ కేంద్రాలుగా మార్చి ఎంతో కొంత ఇచ్చి వారితో పని చేయిస్తున్నారు. ఈ విధంగా రకరకాల దోపిడీ పద్ధతులను అనుసరిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగ పరిశ్రమలను చావగొట్టి విదేశీ ప్రయివేటు కంపెనీలకు కారు చౌకగా కట్టబెడుతున్నది. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవటం కోసమనే పేరుతో కోట్లాది కార్మికుల జీవితాన్ని బలిపెడుతున్నది. వారి శక్తి సామర్థ్యాలను నిర్వీర్యం చేస్తున్నది. లక్షలాది మంది మహిళలు అసంఘటిత 'కార్మికులుగా, అతితక్కువ వేతనాలకు, దుర్భరమైన పని పరిస్థితుల మధ్య నిర్బంధ శ్రమ చేస్తున్నారు. ఈ విషయాలు ఏవీ చర్చకు రాకుండా భావోద్వేగాలను రెచ్చగొట్టి కాలం వెళ్లదీస్తున్న వైనాన్ని చూస్తున్నాం. ఈ నేపథ్యంలో విమలా రణదివే పోరాట స్ఫూర్తి, ఆమె జీవితానుభవం శ్రామిక మహిళా ఉద్యమాలకు ప్రేరణ కాక తప్పదు...

ఆర్. రాజేశమ్

మనువాద గులాంగిరీపై పోరాడిన మహాత్ముడు

భారతదేశంలో బ్రిటిష్‌షోడి ఆధిపత్యం రెండువందల యేళ్ల పాటు సాగింది. ఈ విశాల భారత దేశంలోని భూమిపుత్రులను బానిసలుగా మార్చి నిరంకుశ వలస పాలనను వారు కొనసాగించారు. ఈ దేశపు ప్రజలను పీడిస్తున్న మరో తరహా బానిసత్వం కుల వ్యవస్థ పేరుతో మొదలయింది. రెండువేల యేండ్ల క్రితం ప్రారంభమై నేటికీ అది కొనసాగుతున్నది. బ్రిటిష్ వాడు రుద్దిన బానిసత్వాన్ని రద్దు చేయడానికి షహీద్ భగత్‌సింగ్, గాంధీ, నెహ్రూ... అమరులెందరో ఉద్యమిస్తే... మనువాద గులాంగిరీని రద్దుచేయడానికి ఆధునిక భారత చరిత్రలో తొట్టతొలిగా ఉద్యమించిన మహనీయుడు జ్యోతిబాపూలే. ఆ స్వాతంత్ర్య ఉద్యమనేత గాంధీ మహాత్ముడైతే... ఈ స్వాతంత్ర్య ఉద్యమ నేత పూలే సైతం నిస్సందేహంగా మహాత్ముడే!

జ్యోతిరావు గోవిందరావు ఫూలే 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలో జన్మించాడు. నాటి పీష్వా రాజుల దగ్గర జ్యోతిరావు కుటుంబం పూలమాలలు కట్టి అమ్మే వృత్తిని కొనసాగించిన కారణంగా పూలే అనే పేరు వచ్చింది. వెనుకబడిన 'మాలి' కులానికి చెందిన ఆయన కుల కట్టుబాట్ల కారణంగా చిన్ననాటి నుంచే అవమానాలను ఎదుర్కొన్నాడు. యుక్త వయస్సులో ఒక బ్రాహ్మణ మిత్రుని పెండ్లికి హాజరైన జ్యోతిరావును పెళ్లికొడుకు బంధువులు కులం పేరుతో అవమానించి పెండ్లి ఊరేగింపు నుంచి గెంటివేశారు. ఆ అవమానంతో రగిలిపోయిన పూలే కులాధిపత్యాన్ని నిర్మూలించడానికి అవిశ్రాంత పోరాటం కొనసాగించాలని ప్రతినబూనాడు. శూద్రులు, అతిశూద్రులపై అగ్రవర్ణాలవారు కొనసాగిస్తున్న దురాగతాలను నిరోధించడానికి పూలే 1873 సెప్టెంబరు 24న 'సత్య శోధక్ సమాజ్'ను స్థాపించాడు. మెజారిటీగా ఉన్న నిమ్నవర్గాల ప్రజలను కులదోపిడీ నుంచి విముక్తి చేయడంతోపాటు రైతులు, కూలీలను తమ హక్కుల కోసం సంఘటితపరిచేందుకు ఈ సంస్థ ద్వారా పూలే విశేషంగా కృషి చేశాడు.

ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేని కృత్రిమ కుల వ్యవస్థను సృష్టించి, దేశంలోని మెజారిటీ వర్గాలను ఆర్థికంగా సామాజికంగా అణచివేసిన స్వార్థపర వర్గాల దోపిడీని జీవితాంతం వ్యతిరేకించి పోరాడిన మహానుభావుడు పూలే. ఆయన నడిపిన పోరాటాల స్ఫూర్తిని నేటి తరానికి అందించే ఒక మహత్తర సాధనంగా ఆయన రచన "గులాంగిరీ" నేటికీ నిలిచి ఉన్నది. ఈ దేశపు వెనుకబాటుతనానికి ప్రధాన కారణమైన కులవ్యవస్థ నికృష్ట స్వభావం గురించి తెలుసుకోవాలంటే ప్రతి ఒక్కరూ తప్పక చదవాల్సిన పుస్తకం "గులాంగిరీ". కాలాన్ని ఎదిరించి ఘనీభవించిన పూలే మూర్తి... ఆయన రాసిన గులాంగిరీ పుస్తకంలో మనకు ప్రత్యక్షమవుతుంది. నేటికాలంలో మనం చేపట్టాల్సిన సామాజిక న్యాయ పోరాటాలను ఎలా కొనసాగించాలో దగ్గర కూచోబెట్టుకుని మనకు నేర్పుతుంది.

సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యే భాషలో... ఉద్యమ సహచరుడు దోండిబా, పూలేల మధ్యన సంభాషణల రూపంలో గులాంగిరీ పుస్తకం కొనసాగుతుంది. ఈ దోండిబా ఎవరో కాదు పూలేను హత్య చేయించడానికి పూణే బ్రాహ్మణులు సుపారి ఇచ్చి కుదుర్చుకున్న కిరాయి హంతకుడు! ఓ అర్ధరాత్రి వేళ దోండిబా పూలేను చంపడానికి ఆయన ఇంట్లో దూరాడు. అలికిడికి నిద్రలేచిన పూలే దోండిబాను నిలదీసాడు. నిన్ను చంపడానికి బ్రాహ్మణులు డబ్బులు ఇచ్చారని దోండిబా తెలుపగా... "నా చావుతో నీ ఆకలి తీరుతుందనుకుంటే అలానే కానియ్యి" అని పూలే సమాధానమిచ్చాడు. "మీ నిమ్నవర్గాల పిల్లలకు మేము చదువులు చెప్పడమే బ్రాహ్మణుల కోపానికి కారణమయిందని తెలుసుకో..." అని పూలే తెలపడంతో దోండిబా తన తపనను గ్రహించి హత్యాయత్నాన్ని విరమించుకున్నాడు. క్రమక్రమంగా పూలే ఉద్యమ సహచరుడయ్యాడు.

ఆ రోజుల్లో ఒక బ్రాహ్మణ వితంతువు గర్భవతి కాగా ఆనాటి సమాజం వేధింపులు తాళలేక ఆత్మహత్యకు ఒడిగట్టిన వేళ పూలే దంపతులు ఆమెకు తమ ఇంటిలో ఆశ్రయం కల్పించారు. ఆమెకు కలుగబోయే బిడ్డను తామే పోషిస్తామని భరోసా ఇచ్చి, ఆమెకు పుట్టిన బిడ్డను పూలే దంపతులు దత్తతతీసుకొని తమ బిడ్డగా స్వీకరించి పెంచి పెద్ద చేశారు. ఆ బిడ్డ పేరే యశ్వంతరావు పూలే! ఒక శూద్ర మాలి కుటుంబానికి వారసుడైన ఒక బ్రాహ్మణ బిడ్డ! "నిఖిలలోకమెట్లు నిర్ణయించిన గాని తరుగులేని విశ్వనరుడ నేను!" అంటూ మొన్న మొన్న జాషువా కవి అన్న మాటలను ఆనాడే తన జీవితాచరణ ద్వారా నిరూపించిన మహాత్ముడు పూలే!

బ్రాహ్మణుల ఆధిపత్యానికి దారులు వేసిన పురాణాల బండారాన్ని పూలే తన గులాంగిరీ పుస్తకంలో అందరికీ అర్థమయ్యే రీతిలో విశదీకరిస్తాడు. బ్రాహ్మణులు బ్రహ్మముఖం నుండి జన్మించారనే కథనంపై వ్యాఖ్యానిస్తూ... మగ వ్యక్తి ముఖం నుండి వారు పుట్టడమే నిజమైతే... ఎవరి స్తన్యం తాగి పెరిగినట్టు? అని పూలే ప్రశ్నిస్తాడు. పూలే ప్రయోగించిన తార్కిక వాదనలతో బ్రాహ్మణులు సృష్టించిన కృత్రిమ కథనాలు దూది పింజల్లా తేలిపోతాయి.

బాధాకరమైన విషయం ఏమిటంటే ఆ మహాత్ముడికి దక్కాల్సిన గుర్తింపు, గౌరవం నేటికీ దక్కడం లేదు. తెలంగాణకు పూలేకు సంబంధమేమిటి? తెలంగాణలోని బీసీ గురుకులాల పేరులో నుంచి మహాత్మాజ్యోతిరావు పూలే పేరును తొలగించాలని ఆ మధ్య ఒక బీసీ నేత డిమాండ్ చేశారు. ఇక అగ్రవర్ణాల వారైతే పూలేను చులకన చేస్తూ, ఆయనొక బ్రాహ్మణ వ్యతిరేకి అంటూ కొట్టిపారేస్తున్నారు. పూలే జీవితం గురించి తెలిసిన వారెవరైనా ఆయన బ్రాహ్మణులనే కాదు, ఏ వర్గం వారినీ ద్వేషించలేదని అర్థం చేసుకుంటారు. ఆ రోజుల్లో ఒక బ్రాహ్మణ వితంతువు గర్భవతి కాగా ఆనాటి



సమాజం వేధింపులు తాళలేక ఆత్మహత్యకు ఒడిగట్టిన వేళ పూలే దంపతులు ఆమెకు తమ ఇంటిలో ఆశ్రయం కల్పించారు. ఆమెకు కలుగబోయే బిడ్డను తామే పోషిస్తామని భరోసా ఇచ్చి, ఆమెకు పుట్టిన బిడ్డను పూలే దంపతులు దత్తతతీసుకొని తమ బిడ్డగా స్వీకరించి పెంచి పెద్ద చేశారు. ఆ బిడ్డ పేరే యశ్వంతరావు పూలే! ఒక శూద్ర మాలి కుటుంబానికి వారసుడైన ఒక బ్రాహ్మణ బిడ్డ! "నిఖిలలోకమెట్లు నిర్ణయించిన గాని తరుగులేని విశ్వనరుడ నేను!" అంటూ మొన్న మొన్న జాషువా కవి అన్న మాటలను ఆనాడే తన జీవితాచరణ ద్వారా నిరూపించిన మహాత్ముడు పూలే! ఆయన జీవితము, సత్యశోధక సమాజ ఉద్యమం, ఆయన రచనలూ, నేటి కాలంలో మన దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు సరైన పరిష్కారాన్ని చూపుతాయి.


(నేడు మహాత్మా జ్యోతిరావుఫూలే 196వ జయంతి)

సెల్: 9440443183

"మచ్చల బట్టలు, బూట్లు, నెత్తికి టోపీ, చేతిలో తుపాకి ఉన్న వారు మాపై అఘాయిత్యానికి పాల్పడ్డారు". ఇది తప్ప మరో విషయం చెప్పలేని అమాయకులు. అడవిని నమ్ముకు జీవిస్తున్న ఆదివాసులు. ప్రకృతిని ఆరాధిస్తూ అన్యాయం చేయటం తెలియని గిరిజన బిడ్డలు. "సంతకు వెళితే ఇప్పటికీ మమ్మల్ని పోలీసులు పెళ్ళాలనే అంటున్నారు" అంటూ ఆవేదన వ్యక్తం చేసే అడవి బిడ్డలు. వారే పోలీసుల చేతిలో అత్యంత దారుణంగా లైంగిక దాడికి గురైన వాకపల్లి ఆదివాసీ మహిళలు. న్యాయం కోసం 16 ఏండ్లు పోరాడారు. మూడు రోజుల కిందట కోర్టు ఈ కేసులో తీర్పునిచ్చింది. ఇప్పటికైనా వారికి నిజంగా న్యాయం జరిగిందా..? ఇన్నేండ్లు వారు చేసిన పోరాటం ఫలించిందా..? అసలు ఈ కేసుకు సంబంధించిన వివరాలు, కోర్టు తీర్పు గురించి మహిళా సంఘాలు, అభ్యుదయ వాదులు ఏమంటున్నారో ఈరోజు మానవిలో తెలుసుకుందాం...



న్యాయం జరిగినట్టేనా...?



అది 2007 ఆగస్టు 20వ తేదీ. విశాఖ ఏజెన్సీ ప్రాంతం. వాకపల్లి గ్రామం. సరిగ్గా పొద్దు కూడా పొడవలేదు. సూర్యుడు ఉదయించనే లేదు. మగవారంతా తమ పసుపు పొలాల్లో పని కోసం వెళ్లారు. మహిళలు కొందరు ఇంట్లో వంట చేసు కుంటూ, మరి కొందరు నీళ్లు మోసుకొస్తుంటు న్నారు. అకస్మాత్తుగా 21 మంది గ్రేహౌండ్స్ పోలీసులు వచ్చి గ్రామంపై విరుచుకుపడ్డారు. "మీరు మావోయిస్టులకు సహకరిస్తున్నారు" అంటూ వచ్చి బూతులు తిడుతూ, దౌర్జన్యంగా ఇళ్లల్లో దూరి వంటగదిలో ఉన్న మహిళలపై లైంగిక దాడులకు పాల్పడ్డారు. ఒక్కరు కాదు ఇద్దరు కాదు ముగ్గురు నలుగురు పోలీసులు కలిసి ఒక్కో మహిళపై దాడికి పాల్పడ్డారు. ఈ హఠాత్పరిణామానికి భయపడి పారిపోతున్న వాళ్లను, బహిర్భూమికి వెళ్లిన వాళ్లను, వచ్చి బాలింతలని కూడా చూడకుండా సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు.

కేసు నమోదు చేయలేదు

దాడికి పాల్పడిన పోలీసులు వెళ్ళిపోయిన తర్వాత బాధిత మహిళలంతా గుంపుగా చేరి రోధి స్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ వారి వద్దకు వెళ్ళారు. ఆయన వెంటనే మహిళలను తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకుని జరిగిన విషయాన్ని చెప్పారు. కానీ పోలీసులు ఎటువంటి ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయలేదు. అసలు దీన్ని ఓ కేసుగానే పరిగణలోకి తీసుకో లేదు. దాంతో మహిళా సంఘాలు, అభ్యుదయ వాదులు, మానవ హక్కులవారు రంగంలోకి దిగారు. ఉదయం 11 గంటలు అయ్యే సరికి ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించింది. పత్రికా విలేకరులు, మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు తీవ్రంగా స్పందించి బాధితుల పక్షం నిలబడి బాధితులతో పాటు అధికారులకు ఫిర్యాదులు చేశారు.

కుమిలి కుమిలి ఏడుస్తుంటే...

వాకపల్లి ఆదివాసీలపై జరిగిన అత్యంత దారుణమైన ఈ సంఘటన విషయం టీవీల ద్వారా బయట ప్రపంచానికి తెలిసింది. తమపై ఘోరమైన దాడి జరిగి కుమిలి కుమిలి ఏడుస్తున్న మహిళల గురించి అప్పటి రాష్ట్ర డీజీపీ బాసిత్ చాలా అవమానకరంగా మాట్లాడారు. అప్పటి హోంమంత్రి జానారెడ్డి అయితే ఏకంగా అసలు అక్కడ ఏమీ జరగలేదని, ఇది అవాస్తవ మని ప్రకటించారు. అప్పటి విశాఖ జిల్లా ఎస్పీగా ఉన్న అంజనీ కుమార్ సబ్బరాల్ ఇది మావోయిస్టుల నీచ ఎత్తుగడని అభివర్ణించారు. అప్పటి పాడేరు డిఎస్పీ స్టాలిన్ మరీ దిగజారి అమాయక గిరిజన మహిళలను అడ్డుపెట్టుకొని మావోయిస్టులు తమపై అసత్య ప్రచారం చేస్తున్నారని మీడియా ద్వారా ప్రచారం చేశారు.

సరైన విచారణ చేయలేదు

నిజానికి ఈ సమాజంలో ఏ స్త్రీ తనపై లైంగిక దాడి జరిగిందని బయటకు చెప్పుకోదు. పైగా ఇలాంటి ఘటన జరిగిందని తెలిస్తే తమను తమ జాతి వెలివేస్తుందని తెలిసిన ఆదివాసీ మహిళలు అసలే చెప్పరు. అందులోనూ ఆదివాసీ సంస్కృతిలో అటువంటి ఆడదని అదని ఉండదు. అలాంటి వారికి జరిగిన అన్యాయంపై సరియైన విచారణ లేకుండా, సాక్షాధారాలు లేకుండా చేసి, గ్రేహౌండ్ పోలీసులను కాపాడే ప్రయత్నం ప్రభుత్వం జరపలేదు.

అన్యాయం జరిగింది వాస్తవం...

సంఘటన గురించి తెలుసుకున్న వెంటనే మానవ హక్కుల సంఘాలు, మహిళా సంఘాలు, అభ్యుదయ వాదులు బాధితులకు అండగా నిలిచారు. వారి అండతో 16 ఏండ్లుగా ఆ ఆదివాసీ మహిళలు అలుపెరుగక సుదీర్ఘ పోరాటం చేశారు. నిరాహార దీక్షలకు దిగారు. ఆర్థిక, రాజకీయ అండ లేకపోయినా, అక్షరం ముక్క తెలియకపోయినా తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం కోసం పోరాడుతూనే ఉన్నారు. ఈ పోరాట ఫలితంగానే విశాఖ ఆదనపు కోర్టు మూడు రోజుల కిందట సంచలన తీర్పును ప్రకటించింది. మహిళలకు అన్యాయం జరిగిన మాట వాస్తవమే. అయితే ఈ కేసులో విచారణ సరిగ్గా జరగలేదని, సరైన ఆధారాలు లభించని కారణంగా పోలీసులను విడిచి పెడుతున్నామని కోర్టు తీర్పునిచ్చింది.

ఇంతకాలానికి బాధితులు చేసిన ఫిర్యాదును కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఇది ఆహ్వానించదగిన విషయం. అయితే ఈ కేసులో మాకు తీవ్రమైన పొరపాట్లు జరిగాయి. అందులో మొదటిది ప్రభుత్వం, విచారణ అధికారులు ముందుగానే తీర్పు చెప్పేశారు. మావో యిస్టులు తప్పించుకోవడానికి గిరిజన మహిళలను ఉపయోగించుకున్నారని వారే నిర్ణయించేశారు. అసలు పోలీసులే దాడికి పాల్పడితే విచారణ కోసం తిరిగి పోలీసులనే కేటాయించడం మరో తప్పు. మరో ముఖ్యమైనది ప్రాథమిక



ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించలేదు

సాక్షాధారాలు. ఫిర్యాదు చేసిన వెంటనే దాడికి గురైన వారిని హాస్పిటల్‌కు పంపించాలి. అవసరమైన సాక్ష్యాలను అంటే వారి బట్టలను సేకరించాలి. అక్కడున్న గుర్తులను సేకరించాలి. ఇవేవీ చేయకపోగా వాటిని కావాలని నాశనం చేశారు. సాక్ష్యాలను చెరిపేసే ప్రయత్నం చేశారు. ఇలా సాక్షాలు దొరక్కుండా చేశారు అనే దానిపైన సంపూర్ణంగా విచారణ జరిపి వాళ్లకు శిక్ష పడేవిధంగా చూడాలి. బాధిత మహిళలకు న్యాయం జరగాలి. అయితే ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దు కోవడానికి వెంటనే వారికి పునరావాసం కల్పించాలి. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించలేదు. అంటే గత ప్రభుత్వాల దారిలోనే ఈ ప్రభుత్వం కూడా నడుస్తుంది. ఆ మహిళలకు అన్యాయమే చేస్తుంది.

- డి.రమాదేవి, ఐద్వా ఏపీ రాష్ట్ర కార్యదర్శి

చేసింది. కనీసం పోలీసులను చట్టబద్ధంగా అరెస్టులు చేసి విచారణ కూడా చేయలేదు. సంఘటన జరిగినా వెంటనే కలెక్టర్ గానీ, ఏ ఇతర అధికారులు గానీ, స్థానిక పోలీసులు ఎవ్వరూ కూడా వాకపల్లి వెళ్లి స్థానికంగా జరిగిన సంఘటనపై ప్రాథమిక దర్యాప్తు కూడా చేయలేదు.

"మీరు పోలీసోళ్ళ భార్యలయ్యారు, ఇంట్లోకి రావొద్దు" అంటూ బయటే కూర్చోబెట్టారు. అన్ని రోజులూ అవమాన భారాన్ని అనుభవిస్తూ గంజి తాగుతూ బతికారు. కనీసం పిల్లలకు పాలు కూడా ఇవ్వనీయలేదు. వాళ్ళ సంప్రదాయం ప్రకారం శుద్ధి చేసిన తర్వాత వారిని ఇంట్లోకి రానిచ్చారు. అలాంటి మహిళలపై అసలు దాడే జరగలేదని అధికారులు ఎలా ప్రకటించారో అర్థం కాని విషయం. తర్వాత కాలంలో ఆ పదకొండు మంది మహిళల్లో ఒకరు ఒత్తిడిని భరించలేక చనిపోయారు. మరో మహిళ పాము కాటుతో చనిపోయారు. ఇక ఈ కేసులో అసలు ఎలాంటి విచారణ జరగలేదు అని అప్పుడు అధికారులు, పోలీసులు ఇచ్చిన ప్రకటన తప్పు అని నిరూపించడానికి బాధితుల తరఫున నిలబడిన లాయర్లు ఇన్నేండ్లు ఎంతో శ్రమించారు. ఇన్నేండ్లకు అక్కడ అన్యాయం జరిగిన మాట వాస్తవమని కనీసం కోర్టు అంగీకరించే విధంగా కృషి చేసిన లాయర్లకు మహిళా సంఘాలు అభినందలు తెలియజేస్తున్నారు.

- సలీమ

దోషులపై కేసు కొట్టి వేసింది. అయితే దర్యాప్తు సరిగా చేయలని అధికారులపై చర్యలు తీసుకోవాలని, అలాగే ఆదివాసీలకు నష్టపరిహారం చెల్లించాలని తీర్పులో చెప్పింది. ఈ మొత్తం సంఘటనను గమనించినపుడు మొదటి నుండి ప్రభుత్వంలో పని చేస్తున్న గ్రేహౌండ్స్ పోలీసులను రక్షించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని స్పష్టంగా అర్థమవుతుంది.

ఇద్దరు చనిపోయారు...

లైంగిక దాడికి గురైన తర్వాత సుమారు వారం రోజుల పాటు ఆ మహిళలను భర్తలు ఇంట్లోకి రానీయలేదు.



దళిత, ఆదివాసీలకు అన్యాయం జరిగిన ప్రతి సారీ ఎలాంటి తీర్పు ఇస్తారో ఇప్పుడూ అలాంటి తీర్పే ఇచ్చారు. అది రావడానికి కూడా ఎన్నో ఏండ్లు పడుతుంది. నేరం ఉన్నప్పుడు శిక్ష ఉంటుంది. కానీ ఇక్కడ నేరం జరిగిందంటున్నారు కానీ శిక్ష మాత్రం పడలేదు. కారంచేడు నుండి చూసుకుంటే అన్ని కేసుల్లో పరిస్థితి ఇలాగే ఉంది. నష్టపరిహారం ఇస్తున్నామంటే నేరం జరిగినట్టే కదా, అప్పుడు శిక్ష ఎందుకు ఉండదు అనేది నా ప్రశ్న. విచారణ జరగాల్సిన రీతిలో జరగలేదు. చాలా మంది వాళ్ళు గుర్తుపట్టే పరిస్థితుల్లో లేరు అంటున్నారు. గుర్తు పట్టినంత మాత్రాన శిక్ష వేస్తున్నారా...?

కాఫ్ పంచాయితీలా ఉంది...

కారంచేడులో నేరం చేసిన వారిని గుర్తు పట్టారు. మరి వారికి శిక్ష పడిందా..? ఆయేషా మీరా కేసులో ఏం చేశారు. నేరం చేసిన వారు ఎవరో తెలుసు, ఆ కేసులో ఏం చేశారు. ఇక బిల్కిస్‌బానో నేరస్తులను వదిలేశారు. దీన్ని బట్టి భారతదేశంలో మహిళలపై లైంగిక దాడులు జరిగితే శిక్షలు పడే పరిస్థితులు లేవు.



- సూరేపల్లి సుజాత



కోర్టుల్లో కేసులు వేస్తేనే గానీ.. బిల్లులు పాస్ కావా?

(మొదటిపేజీ తరువాయి)

సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండలం మంగోల్‌లో నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్రం స్వయం ప్రతిపత్తి గల వ్యవస్థలను రాజకీయంగా వాడుకుంటున్నదని విమర్శించారు. అసెంబ్లీ పాస్ చేసిన బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా 7 నెలలుగా పెండింగ్‌లో పెట్టారన్నారు. దీని వెనుక రాజకీయం ఏంటనేది అందరికి తెలుసని... కోర్టులకు వెళ్లి కేసులు వేస్తే తప్ప బిల్లులు పాస్ కానీ పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సుప్రీంకోర్టులో కేసు వేస్తే ఈరోజు రెండు, మూడు బిల్లులు పాస్ చేశారని... రాష్ట్ర ప్రగతిని బీజేపీ అడ్డుకునేందుకు ఎన్ని కుట్రలు చేస్తోందో దీన్ని బట్టే అర్థమవుతోందన్నారు. దేశంలో తొలిసారిగా ఫారెస్ట్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే ఆ బిల్లును అడ్డుకుని, రాష్ట్రపతి పరిశీలనకు పంపారన్నారు. ఇది రాష్ట్ర ప్రగతిని అడ్డుకోవడం కాక ఇంకేంటని ప్రశ్నించారు. అలాగే కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఉద్యోగాలు ఇస్తామంటే.. 7 నెలలు అది ఇప్పుడు రాష్ట్రపతి పరిశీలనకు పంపడం ఏంటని ప్రశ్నించారు. ఇక్కడి పిల్లలకు చదువులు చెప్పే ప్రొఫెసర్లు వద్దా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని యూనివర్సిటీలకు కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బీహార్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో 1961 నుంచే ఉన్నదని.. ఇక్కడ మాత్రం ఇలా చేయడం సబబేనా అన్నారు. గవర్నర్ రాష్ట్ర ప్రగతికి సహకరించడం మాని మోకాలడ్డు పెట్టడం సరికాదన్నారు. తెలంగాణ ప్రజలు సరైన సమయంలో కేంద్రానికి తగిన గుణపాఠం చెబుతారని స్పష్టంచేశారు. కాగా, మూడు బిల్లులను ఆమోదించడం పట్ల గవర్నర్‌కు మంత్రులు ధన్యవాదాలు తెలిపారు.

ఫూలే ఆశయాలు, కార్యాచరణ నేటికీ స్ఫూర్తిదాయకం

(మొదటిపేజీ తరువాయి)

బహుజన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఫూలే 200 ఏండ్ల క్రితమే కార్యాచరణ చేపట్టారని సీఎం గుర్తుచేశారు. ఆయన అనుసరించిన సామాజిక సమానత్వ పంథా, నాటి భారతీయ సమాజంలో కొనసాగుతున్న సాంప్రదాయ సామాజిక విలువలను, వ్యవస్థను సమూలంగా మార్చివేసేందుకు బాటలు వేసిందని తెలిపారు. గుణాత్మక మార్పు దిశగా దేశంలో స్త్రీలు, దళిత బహుజనులు ఉద్యమించేలా ఫూలే కార్యాచరణ పురికొల్పిందని పేర్కొన్నారు. ఫూలేను డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్వయంగా తన గురువుగా ప్రకటించుకున్నారని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చేదిశగా తెలంగాణ ప్రభుత్వం తన ప్రాధాన్యతాక్రమాన్ని రూపొందించుకుని అభివృద్ధి, సంక్షేమ కార్యాచరణను అమలు చేస్తున్నదని తెలిపారు. జ్యోతిబాఫూలే అందించిన స్ఫూర్తితో 'వికాసమే వివక్షకు విరుగుడు' అనే విధానాన్ని అనుసరిస్తూ తమ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికోసం పాటుపడుతున్నదని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో నేడు తెలంగాణలోని మహిళా, దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా, విద్యాపరంగా మెరుగైన ఫలితాలు సాధించి సామాజిక సమానత్వ దిశగా పురోగమించాయని పేర్కొన్నారు. అణగారిన వర్గాలు, బహుజనుల సమగ్ర వికాసానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు వారి సామాజిక, ఆర్థిక ఆత్మగౌరవాన్ని ద్విగుణీకరణం చేస్తున్నాయని వివరించారు. తమ ప్రభుత్వం చేస్తున్న ఈ కృషి వెనుక మహాత్మాఫూలే ఆదర్శాలు, ఆశయ సాధన లక్ష్యాలు ఇమిడి ఉన్నాయని తెలిపారు.

సీఎం సారూ.. పర్మినెంట్ చేయండి..

(మొదటిపేజీ తరువాయి)

మీదేసుకుని పనిచేస్తున్నారు. అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు ప్రొబేషనరీ కాలం రెండేండ్లు మాత్రమే. వీరికి మాత్రం రాష్ట్ర సర్కారు మూడేండ్లు అని నిర్ణయం చేసింది. ఇది సంఘాలతో పెద్దఎత్తున విమర్శలొచ్చినా రాష్ట్ర సర్కారు వెనక్కి తగ్గలేదు. దాన్ని రెండేండ్లకు కుదించి తమను పీఎస్‌లో వర్తింపజేయాలని అధికారుల వద్ద జేపీఎస్‌లు ప్రాధేయపడ్డా కనికరించలేదు. ఈ గోడు ఇలా ఉండగానే పుండుమీద కారం చల్లినట్టుగా వారి ప్రొబేషనరీ కాలాన్ని నాలుగేండ్లకు పెంచుతూ సీఎం కేసీఆర్ బాంబు పేల్చారు. జేపీఎస్‌లలో అసంతృప్తి పెరిగిపోతుండటం, ఓవైపు వీఆర్వో, వీఆర్‌ఏల గొడవ నడుస్తుండటంతో సీఎం కాస్త ఆలోచించి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులతో సమానంగా ఇస్తామని ఊరటని చ్చారు. కానీ, అమలు చేయలేదు. గతంలో ఇస్తున్న 15 వేల వేతనాన్ని రూ.28,719కి పెంచి ఊరటని చ్చింది. వాస్తవానికి రెగ్యులర్ అయితే వారికి మరింత వేతనం పెరగడంతో పాటు పీఎఫ్, ఇతర ఉద్యోగులకు లభించినట్టుగానే అన్ని సౌకర్యాలు వర్తిస్తాయి. కానీ, రాష్ట్ర సర్కార్ ఆలా చేయలేదు.

ఔట్‌సోర్సింగ్ జేపీఎస్‌ల పరిస్థితి మరీ దారుణం

పంచాయతీ కార్యదర్శుల రిక్రూట్ అయినా, పంచాయతీరాజ్ జూనియర్ కార్యదర్శులు వివిధ కారణాలతో ఉద్యోగాలు మానేసినా 2019 నోటిఫికేషన్ మెరిట్ లిస్టులో ఉన్నవారిని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్నది. మొదటి మూడు మెరిట్ లిస్టుల ద్వారా ఎంపిక చేసిన వారికి వేతనం రూ. 28,719 అందుతున్నది. ఆ తర్వాత మెరిట్ లిస్టు ద్వారా ఎంపికైన వారిని మాత్రం ఏజెన్సీల ద్వారా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియమిస్తున్నారు. ఇలా పనిచేస్తున్నవారు రాష్ట్రంలో 1500 మంది వరకు ఉన్నారు. వీరికి మాత్రం ఒక్కో జిల్లాల్లో ఒక్కో విధంగా వేతనం అందుతున్నది. గరిష్టంగా రూ.15వేలు అందుతుండగా...కొన్ని జిల్లాల్లో అయితే రూ.11 వేలు మాత్రమే ఇస్తున్న దుస్థితి నెలకొంది. ఒకే ఎంట్రెన్స్ ద్వారా అర్హత సాధించిన వారికి వేర్వేరుగా వేతనాలు ఇవ్వడంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

'పెండింగ్‌'లో వేతనాలు...అడుకునేవాళ్లు లేరు..

రాష్ట్ర సర్కారు జేపీఎస్‌లకు వేతనాలను కూడా సకాలంలో ఇవ్వడంలేదు. ఫిబ్రవరి, మార్చి నెల వేతనాలు ఇప్పటిదాకా జేపీఎస్‌ల చేతికి అందలేదు. 'మాకు, నాలుగు నెలలకోసారి వేతనాలు ఇస్తే ఎలా బతికేది?' పొద్దుగాల ఏడు గంటలలోపే పంచాయతీలోని పని ప్రదేశం నుంచి ఫొటో తీసి ఉన్నతాధికారులకు ఫొటో పెట్టాలి. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా పొద్దుగాల ఏడుగంటలకు వచ్చి సాయంత్రం ఆరేడు గంటల దాకా పనిచేస్తున్నారా?'గొడ్డుచాకిరీ చేస్తున్నాం' అని నల్లగొండ జిల్లాకు చెందిన ఓ జేపీఎస్ తన ఆవేదనను వ్యక్తపరిచారు. కొంతమంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అధిక పని భారాన్ని భరించలేక తమ ఉద్యోగాలకు రాజీనామా చేసిపోతున్నారు. మరికొంతమంది విధి నిర్వహణలో తమ ప్రాణాలను కోల్పోతున్నారు. గుండెపోటు, గ్రామ పంచాయతీ నుంచి మండల కేంద్రాలకు, ఇండ్లకు వెళ్తే క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇప్పటిదాకా దాదాపు 30 మంది జేపీఎస్‌లు చనిపోయారు. 50 మందిదాకా గాయపడ్డారు. వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం సహకారం పెద్దగా లభించడంలేదు. జేపీఎస్‌లే తమ జీతాల్లోంచి లేదా వెయ్యి, రెండు వేల రూపాయలు ఇచ్చి బాధిత కుటుంబాలకు కొంత ఆసరాగా నిలుస్తున్నారు.

జేపీఎస్‌లను క్రమబద్ధీకరించాలి

గొరిటెల రాజేశ్వర్‌రావు, తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు

గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాం. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా చూస్తున్నాం. హరితహారం, కానిటేషన్, జనన, మరణ ధ్రువీకరణలు, భవన నిర్మాణ అనుమతులు, ఆస్తి మార్పిడి పనులు, లైసెన్స్ అనుమతులు, ఉపాధి హామీ పనులు, కోవిడ్ సర్వేలు, డ్రై డేల నిర్వహణ, కంటి వెలుగు కార్యక్రమాలు, పోడు భూముల సర్వేలు, విపత్తు నిర్వహణ సంబంధించిన మొదలగు అనేక రకాల పనులను చేస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సర్వేలు కూడా చేస్తున్నాం. జాతీయస్థాయిలో పంచాయతీరాజ్ శాఖ నుంచి తెలంగాణకు ఉత్తమ అవార్డులు రావడంలో కీలకపాత్ర పోషిస్తున్నాం. మూడేండ్లకు పర్మినెంట్ అన్నారు. ఆ తర్వాత నాలుగేండ్లకు పెంచారు. నాలుగేండ్లపుడున్న పర్మినెంట్ ఊసేలేదు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రొబేషనరీ పీరియడ్‌ను సర్వీస్ పీరియడ్‌గా మార్చాలని వేడుకుంటున్నాం. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకున్న జేపీఎస్‌లను కూడా పర్మినెంట్ చేయాలి.

అడవి అదృశ్యం...

(మొదటిపేజీ తరువాయి)

మైనింగ్ కార్యకలాపాలకోసం అడవులను కార్పొరేట్లకు అప్పనంగా అప్పగించేస్తున్నారు. ఇప్పటి వరకు ఉన్న నివేదిక ప్రకారం, 18,847 హెక్టార్ల అటవీ భూమిని మైనింగ్ కార్యకలాపాలకు ఉపయోగించుకోవడానికి అనుమతించింది ఈ కేంద్ర ప్రభుత్వం.మరోవైపు జల ప్రాజెక్టులకోసం మంత్రా..మరో 13,344 హెక్టార్ల అటవీ భూమిని వినియోగించారు. వీటితో పాటు 9,469 హెక్టార్ల అటవీ భూమిని విద్యుత్ ప్రాజెక్టుల కోసం కేటాయించారు. విద్యుత్ టవర్లు , వైర్లు వేయడం కోసం మళ్లించారు.

సాయుధ బలగాల కోసమంటూ...

సాయుధ బలగాల వినియోగానికి కూడా పెద్ద ఎత్తున అటవీ భూమిని కేటాయించారు. అడవుల్లో మావోయిస్టులను ఎదిరించేందుకు కేంద్రప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిపెట్టిందని స్పష్టమవుతోంది. అందువల్ల, వివిధ రక్షణ ప్రాజెక్టుల కోసం గత ఐదేండ్లలో 7,630 హెక్టార్ల అటవీ భూమి ఉపయోగించబడింది.

అడవుల నిర్వచనం ఏమిటంటే..

దేశంలో ఒక హెక్టారు కంటే ఎక్కువ విస్తీర్ణం (భూమి)లో పందిరి కవచం 10 శాతం కంటే ఎక్కువ ఉంటే, దానిని అడవి అంటారు. అప్పుడు అది నిజంగా అడవి అయినా లేదా ఎవరిదో పొలం అయినా లేదా తోట అయినా లేదా ఎవరి వ్యక్తిగత ఆస్తి అయినా..అలాగే గుర్తిస్తారు. అయితే వాస్తవానికి నమోదైన అటవీప్రాంతం కాకుండా, ఐదేండ్లలో భారతదేశం 668,400 హెక్టార్ల అడవులు కోల్పోయింది.

గ్లోబల్ తర్వాత భారత్

అటవీ విధ్వంసం విషయంలో బ్రెజిల్ తర్వాత భారతదేశం రెండవ స్థానంలో ఉంది. అయినప్పటికీ, 13 జనవరి 2022న ప్రచురించబడిన "ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్ 2021" (ఐఎస్ఎఫ్ఆర్ 2021)లో విడుదల చేసిన డేటాను పరిశీలిస్తే, 2019 , 2021 మధ్యకాలంలో అటవీ విస్తీర్ణంలో 1.6 లక్షల హెక్టార్ల (0.2 శాతం) స్వల్ప పెరుగుదల కనిపించింది. కానీ ఇక్కడ గమనించదగ్గ విషయం ఏమిటంటే, ఇవి ఎప్పుడూ ఫారెస్ట్ రికార్డ్ ఫారెస్ట్ (రాష్ట్ర ప్రభుత్వం అటవీ శాఖ పరిధిలోని అటవీ భూమి) వెలుపల పెరుగుతున్నాయి. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్‌ఈ) చేసిన విశ్లేషణ ప్రకారం, 25.9 మిలియన్ హెక్టార్లలో విస్తరించి ఉన్న అడవులు, దాదాపు భారతదేశంలోని ఉత్తరప్రదేశ్ పరిమాణంలో లేవు. విశ్లేషణ ప్రకారం, ఇంత భారీ వ్యత్యాసానికి (ఐఎస్ఎఫ్ఆర్)2021లో ఎలాంటి వివరణ లేదు. ఈ రికార్డ్ చేయబడిన అడవిలో అటవీ విస్తీర్ణం లేకుండా పోయిందనేది మాత్రమే చూసినట్టయితే, ఈ తప్పిపోయిన అటవీ ప్రాంతం అంత లేకుండా పోయిందని విస్మరించలేం. కానీ సుమారు 26 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణాన్ని విస్మరించడం సాధ్యం కాదు.



భారతదేశం 1990 , 2000 మధ్యకాలంలో 384,000 హెక్టార్లలో అడవులను కోల్పోయింది. అదే సమయంలో, 2015, 2020 మధ్య ఇది 668,400 హెక్టార్లకు పెరిగింది. అంటే ఈ రెండు కాలాలలో, భారతదేశం అటవీ విధ్వంసంలో 284,400 హెక్టార్ల పెరుగుదలను చూసింది, ఇది ప్రపంచంలోనే అత్యధికం.కార్పొరేట్ల లాభాల కోసం అడవులను వేగంగా నరికివేస్తున్నారు.

ఇలాగే అడవుల హననం కొనసాగితే శ్వాస పీల్చుకునేకి ఆక్సిజన్ స్తంభాలను భుజాలపై పెట్టుకునే రోజులు ఎంతో దూరంలో లేవని పర్యావరణ వేత్తలు అంటున్నారు.

ఓటేయొద్దు..

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. మండల కేంద్రంలో త్వరలోనే రైల్వే స్టేషన్ అందుబాటులోకి వస్తుందని చెబుతూ.. 'ఎంపీ సక్కుబోడు లేడుగనీ... వినోద్‌కుమార్ లాంటి ఎంపీ ఉంటే ఈపాటికే రైలు కూడా వస్తుండే' అన్నారు. ఎంపీకి 'తెల్లారిలేస్తే లొల్లి.. ఒకటే మతం పంచాయితీ, మసీదులు తవ్వుదాం'.. ఏద పేపర్ లీకేజీ చేద్దామా.. ఈ లొల్లి తప్ప అసలు లొల్లేలు లేవని' ఆరోపించారు. కాబట్టి ఈ సారైనా ఆలోచించి ఎంపీగా వినోద్‌కుమార్ లాంటి మంచోడినే ఓటేసి గెలిపించుకోవాలని కోరారు. గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలను హైస్కూల్‌గా అప్ గ్రేడ్ చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేస్తానని చెప్పారు. పరిహారం రాని నిర్వాసితులు ఎవరైనా ఉంటే బాధపడొద్దని, అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

స్ట్రాంగ్ రూం కీ మాయం

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

జగిత్యాల జిల్లా ధర్మపురి అసెంబ్లీ ఫలితాల వివాదం మలుపు తిరిగింది. ఎన్నికల ఫలితాలకు సంబంధించిన ఈవీఎంలు, ఇతర డ్యాక్యుమెంట్లు, సీసీ పుటేజీల వివరాలు సమర్పించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ మేరకు సోమవారం కలెక్టర్ యాస్మిన్‌బాషా స్ట్రాంగ్‌రూమ్ గదుల తాళాలు తెరిచేందుకు ప్రయత్నించగా సంబంధిత 'కీ' లేకపోవడంతో గందరగోళం నెలకొంది. సగదు గదుల తాళం చెవులు (కీ లు) తమ వద్ద లేవని, ఏదే విషయం కోర్టుకు చెబుతామని కలెక్టర్ చెప్పడంతో కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. స్ట్రాంగ్ రూం తాళాల కీలు మాయం కావడం ఏంటని ప్రశ్నించారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే... సుప్రీం కోర్టు కమీషనర్ తారదాదుల కోసం సమాచార ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ కుట్ర చేశారని, ఆయనపై ఓటమిపాలై ఫలితాల రీకౌంటింగ్‌పై కొట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

'అడ్లూరి' పిటిషన్‌పై కోర్టు ఉత్తర్వులు..

2019 సాధారణ ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం నుంచి గెలిచిన బీఆర్‌ఎస్ అభ్యర్థి, ప్రస్తుత మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎన్నిక అక్రమమని, ఫలితాలు తారుమారు చేశారని ఆరోపిస్తూ సమీప అభ్యర్థి.. కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోర్టులో పిటిషన్ వేశారు. గతంలోనే ఈవీఎంలోని ఓట్ల రీ కౌంటింగ్ చేయాలని పలుమార్లు కోర్టు మెట్లెక్కారు. ఈ మేరకు విచారణ చేపట్టిన హైకోర్టు వారం కింద కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల ఫలితాలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ను తెరవాలని ఆదేశించింది. అప్పటి ఎన్నికకు సంబంధించిన 17ఏ, 17సీ డ్యాక్యుమెంట్లు, సీసీ పుటేజీలు, ఎలక్షన్ ప్రొసీడింగ్‌ను ఈనెల11న (నేడు) సమర్పించాలని ఆ సమయంలో ఉన్న రిటర్నింగ్ అధికారి భిక్షపతికి నోటీసులు ఇచ్చింది. దీంతో సోమవారం కలెక్టర్, ఇతర అధికారగణమంతా జిల్లా కేంద్రంలోని వీఆర్‌కే ఇంజినీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్‌రూమ్‌ను తెరిచేందుకు వెళ్లారు. ఆ గదుల తాళాలు తెరిచే ప్రయత్నం చేయగా ఈవీఎంలు ఉన్న గది మాత్రమే తెరుచుకుంది. కోర్టు అడిగిన డ్యాక్యుమెంట్లు ఉన్న గదుల తాళాలు తెరుచుకోలేదు. సదరు తాళాల 'కీ'లు కూడా అధికారుల దగ్గర లేవు. దీంతో కలెక్టర్ తాళం చెవులు(కీ లు) లేవన్న విషయాన్ని కోర్టుకు చెబుతామని తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్ గదుల తాళాలు పగలగొట్టి అయినా డాక్యుమెంట్లు, సీసీ పుటేజీలు బయటకు తీయాలని కాంగ్రెస్ శ్రేణులు పట్టుబట్టగా.. కోర్టు అనుమతి ఇవ్వకుండా పగలగొట్టలేమని కలెక్టర్ స్పష్టం చేశారు.

అధికారుల దగ్గర ఉండాల్సిన తాళం చెవులు ఏమయ్యాయి?

ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి- ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్

కలెక్టర్ లేదా అడిషనల్ కలెక్టర్ దగ్గర ఉండాల్సిన స్ట్రాంగ్‌రూమ్ తాళాల కీలు ఏమయ్యాయి... కోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చిన ఆరు రోజులు గడిచినా తాళం చెవులు ఎవరి దగ్గర ఉన్నాయో తెలియకపోవడం ఏంటి? అని పిటిషనర్‌దారుడు, కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రశ్నించారు. అధికారుల వద్ద ఉండాల్సిన స్ట్రాంగ్ రూమ్ తాళాలు వారి దగ్గర లేకపోవడంలో గల కారణాన్ని చెప్పాలని, దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ కుట్ర చేశారని ఆరోపించారు. ఎన్నికల ఫలితాలు తారుమారు అయ్యాయని నాలుగేండ్లుగా తాను పోరాడుతుంటే ఇప్పుడు కోర్టు ఉత్తర్వులు వచ్చాయని చెప్పారు.

'వర్షాకాలంలోపు రోడ్ల పునర్నిర్మాణం చేయాలి'



నవతెలంగాణ-హయత్ నగర్

డివిజన్‌లోని పద్మావతి కాలనీలో కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు అధికారులతో కలిసి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పద్మావతి కాలనీ లో లెవెల్స్ సరి చూసుకోకుండా రోడ్ల నిర్మాణం చేపట్టారన్నారు. దాంతో చిన్న పాటి వర్షానికే రోడ్ల పై నీరు నిలిచి కాలనీ వాసులకు ఇబ్బందిగా మారిందని అధికారులకు వివరించారు. కావున రానున్నది వర్షాకాలం కనుక వీలైనంత త్వరలో పద్మావతి కాలనీలో రోడ్ల పునర్నిర్మాణం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ దామోదర్ రావు, ఏఈ నరేంద్ర తేజ, పద్మావతి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు భోజనం ప్యాకెట్లు అందజేత



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపాల్టీ శివారెడ్డి గూడ, శ్రీ దండ్ల గడ్డ ప్రసన్న వీరాంజనేయ, మల్లికార్జున స్వామి దేవాలయం ఆవరణలో సోమవారం దివంగత కొంతం బాల్ రెడ్డి 3వ వర్ధంతి సందర్భంగా దంపతులు కొంతం సుగుణ రాంరెడ్డి.. అంగన్వాడి పాఠశాల పిల్లలకు భోజనం ప్యాకెట్లు , భిక్షాటన చేసే పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మండల రైతుబంధు అధ్యక్షులు కొంతం అంజి రెడ్డి , కొంతం నర్సింహ్మా రెడ్డి , బద్దం కృష్ణారెడ్డి , తాళ్ళం కోటేశ్వరరావు , కొంతం ఓంకార్ రెడ్డి , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతలో స్కిల్ డెవలప్‌మెంట్ వృద్ధికి 'లైట్ హౌజ్' కృషి

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- చందానగర్‌లో నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

సమాజంలో ఎదిగే అవకాశాలకు నోచుకోని యువతలో స్కిల్ డెవలప్‌మెంట్‌ను వృద్ధి చేసి ఉద్యోగ అవకాశాలు, సొంత వ్యాపారం చేసుకునే అవకాశాలు పెంచడానికి, వారికి సాధికారతను తెచ్చేందుకు లైట్ హౌస్ కమ్యూనిటీ ఫౌండేషన్ కృషి చేస్తుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. సోమవారం చందానగర్‌లోని మోడల్ మార్కెట్ భవనంలో జీహెచ్ఎంసీ, లైట్ హౌస్ కమ్యూనిటీ ఫౌండేషన్ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని యువత వాళ్ల కాళ్ల మీద వాళ్ళు నిలబడి సంపాదనను మెరుగుపరచుకొని జీవన శైలిని అభివృద్ధి చేసుకునేందుకు జీహెచ్ఎంసీ లైట్ హౌస్ కమ్యూనిటీ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకొని చందానగర్ హుడా కాలనీలో ఒక మార్కెట్ భవనాన్ని ఏర్పాటు చేసి తెలంగాణలో మొట్టమొదటి లైట్ హౌస్ కార్యక్రమానికి నాంది పలికిందన్నారు. ఈ సంస్థకు కార్పొరేట్ సంస్థాపర ఆర్థిక సహాయంలో భాగస్వామ్యం "ప్రిన్సిపల్ గ్లోబల్ సర్వీసెస్" వారి సహాయంతో ఆ మోడల్ మార్కెట్ భవనానికి అవసరమైన సదుపాయాల ఏర్పాటును ప్రారంభించామన్నారు. మహిళలు ఎక్కువ సంఖ్యలో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సంస్థ ద్వారా టైలరింగ్, బ్యూటీషియన్, రిటైల్ రంగాల్లో, పర్సనాలిటీ డెవలప్ మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్ 18 నుండి 35 సంవత్సరాలలోపు యువతీ, యువకులకు అందిస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ ప్రిన్సిపల్ గ్లోబల్ సర్వీస్ నెహా దోస్తలె అందిస్తున్న సహాయ సహకారాలను నగర వ్యాప్తంగా అందించడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ లైట్ హౌస్ చేపడుతున్న కార్యక్రమం గొప్పదని, ప్రతి ఒక్కరు స్వశక్తితో ఎదగాలన్నారు. ఈ సంస్థ ద్వారా యువతీ, యువకులు వ్యాపారంలోని మెలకువలు, పర్సనాలిటీ డెవలప్ మెంట్, డిజిటల్ హబ్ పై విస్తతంగా అవగాహన కల్పిస్తామన్నారు. లైట్ హౌస్ సి.ఇ.ఓ రుచి మాట్లాడుతూ... లైట్ హౌస్ ద్వారా యువతకు భయాన్ని పోగొట్టి మంచి కేరియర్ ఎంపికలో ప్రోత్సాహం, శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ సంస్థ ద్వారా దేశవ్యాప్తంగా 1.3 లక్షల మంది యువత లబ్ది పొందారన్నారు. లైట్ హౌస్ పార్ట్నర్ ప్రిన్సిపల్ గ్లోబల్ సర్వీసెస్ నేహ దోస్తలే మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా యువతకు క్రమశిక్షణతో పాటు స్కిల్ డెవలప్ మెంట్‌కు ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం మేయర్ లైట్ హౌస్ సి.ఇ.ఓ రుచి, ప్రిన్సిపల్ గ్లోబల్ సర్వీసెసెస్ నెహా దొస్తలే లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పూజిత జగదీశ్వర్, మంజుల రఘునాథ్, ఉప్పలపాటి శ్రీకాంత్, యు.సి.డి ప్రాజెక్ట్ డైరెక్టర్ సౌజన్య, జోనల్ కమిషనర్ శంకరయ్య, యు.సి.డి జాయింట్ కమిషనర్ వెంకట్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ వెంకన్న, ఇ.ఇ శ్రీకాంత్, స్కిల్ మేనేజర్ శ్రీధర్, డి.పి.ఓ లు మాధవి తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించడం పట్ల కాలనీ ప్రజలు హర్షం

- కార్పొరేటర్ లిక్కి మమత కృష్ణారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మిధాని డిపో అధికారులు పలు కాలనీల ప్రజల సౌకర్యం కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించటం పట్ల కాలనీల ప్రజలు హర్షం వ్యక్తం చేశారని 22వ డివిజన్ కార్పొరేటర్ లిక్కి మమత కృష్ణారెడ్డి తెలిపారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శివ నారాయణపురం కాలనీ నుంచి పటాన్‌చెరు వరకు ప్రతీ రోజు ఉదయం 7 - 30 నిమిషాలకు మిధాని డిపో బస్సు సౌకర్యం కోసం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కోరగా.. మంత్రి ఆదేశాలతో మిధాని డిపో అధికారులు బస్సు సౌకర్యం కల్పించి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మిధానీ డిపో అధికారులు బస్సు సౌకర్యం కల్పించడం వల్ల చుట్టుపక్కల కాలనీ వారితోపాటు శివ నారాయణపురం, సాయి టౌన్‌షిప్ ,సాయి ప్రభు కాలనీల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కాలనీవాసులు ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారన్నారు. ఇంతకు ముందు బస్సు సౌకర్యం లేకపోవటం వల్ల ఇతర ప్రాంతాలకు ఉద్యోగ,వ్యాపార,ఇతర అవసరాల కోసం వెళ్లటానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారని చెప్పారు. కాలనీల ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని బస్సు సౌకర్యం కల్పించిన మంత్రి సబితా ఇంద్రారెడ్డికి, స్థానిక కార్పొరేటర్ లిక్కీ మమతా కృష్ణారెడ్డికి ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మిధాని డిపో మేనేజర్ జే.అంజ నేయులు, ఇన్‌చార్జి స్వామి గౌడ్, మిధాని డిపో సిబ్బందితో పాటు కాలనీవాసులు నరహరి , లక్ష్మణ్ నాయక్, రామ్ గంగాధర్ రెడ్డి, నర్సింగరావు, బి.కృష్ణారెడ్డితో, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరం

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ - మీర్‌పేట్

పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరం లాంటిదని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్ 36వ డివిజన్ పరిధిలో నివాసం ఉంటున్న వెంకటేష్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దాంతో బీఆర్ఎస్ మీర్ పేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్ అతని ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించారు. ఈ మేరకు వెంకటేష్‌కు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును మంత్రి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఇంద్రావత్ రవి నాయక్, బీఆర్ఎస్ నాయకులు విజయ్, అశోక్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడి

నవతెలంగాణ-ఘట్కేసర్

కాంగ్రెస్ తెలంగాణ యువజన అధ్యక్షుడు శివసేనరెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు అధికార పార్టీ ఎమ్మెల్యేల క్యాంప్ ఆఫీస్ ముట్టడిలో భాగంగా ఘట్కేసర్ వద్ద మంత్రి మల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ను యువజన కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ అధ్యక్షుడు కొత్త సుశాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ముట్టడించారు. పేపర్ లీకేజీ కేసులకు సంబంధించి అధికార పార్టీ ఎమ్మెల్యేలు అంటిముట్టనట్టుగా ఉంటున్నారని వారు ఆరోపించారు. దాంతో ఘట్కేసర్ పోలీసులు వారిని అరెస్టు చేశారు. తెలంగాణ యువజన కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి రుకువర్ధన్ రెడ్డి, యువజన కాంగ్రెస్ ఘట్కేసర్ మున్సిపాల్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, యువజన కాంగ్రెస్ దమ్మైగూడ అధ్యక్షుడు సుమేష్, జవహర్ నగర్ మున్సిపల్ అధ్యక్షుడు వినయ్, పోచారం మున్సిపాల్టీ అధ్యక్షుడు యుగేందర్, మేడ్చల్ మండల అధ్యక్షుడు వెంకటేష్, బోడుప్పల్ నాయకులు బీరప్ప, ఇతర యువజన కాంగ్రెస్ నాయకులు సాయిరాం రెడ్డి, మహేష్, సాయి చరణ్, సాయికుమార్, సాయి, కష్ణ, శ్రవణ్ నాయక్, గణేష్ నాయక్, మధు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సర్వే నిర్వహించి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వండి..

- అంబేద్కర్ యువజన సంఘం నాయకులు



నవతెలంగాణ-మీర్‌పేట్

ఎన్నో ఏండ్లుగా సాగు చేసుకున్న భూమిలో సర్వే నిర్వహించి దళిత కుటుంబాలకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని మీర్‌పేట్ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మీర్‌పేట్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు దాసరి బాబు ఆధ్వర్యంలో బాలాపూర్ మండల తహసీల్దార్, మీర్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దాసరి బాబు మాట్లాడుతూ మీర్‌పేట్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 61లో ఎన్నో ఏండ్లుగా దళితులం సాగుచేసుకున్నామని తెలిపారు. అదే భూమిలో 2ఎకరాల్లో పార్కు నిర్మాణం చేసి మిగతా భూమిని సర్వే నిర్వహించి తమకు(దళితులకు) కేటాయింపు చేస్తామని స్థానిక మంత్రి, అధికారులు హామీ ఇచ్చారని చెప్పారు. అయితే సర్వే చేయ కుండా ఉన్న మొత్తం భూమిలో పార్కు(క్రీడా ప్రాంగణం) నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. ఎన్నో ఏండ్లుగా భూమి మీద ఆధారపడి దాదాపు 100 కుటుంబాలు జీవిస్తున్నాయని.. కావున తమకు తమ భూమిలో నివాసం యోగ్యత కోసం పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని అధికా రులను, మంత్రిని కోరుతున్నాట్టు తెలిపారు. ఈ కార్యక్ర మంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు భాస్కర్, సుధాకర్, నవీన్, కళావతి, జంగయ్య పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల



నవతెలంగాణ-సంతోష్‌నగర్

దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయని ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను లబ్దిదారులకు సోమవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలో ఫారత్ నగర్, కట్టలగూడ, హరిలాల్ బగార్ బాగ్, కాలాదేరా కాలనీ చంచలగూడా, అజాంపూరా, మండల లబ్దిదారులకు రూ. 69,08004 విలువ గల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మతాల వారికి ఈ పథకాల ద్వారా లబ్ది చేకూరుతుందన్నారు బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల కోసం, వత్తుల వారీగా అనేక పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు దేశంలో ఎక్కడా లేని విధంగా తమ ప్రభుత్వం సంక్షేమ అభివద్ధి పథకాలను రూపకల్పన చేసి విజయవంతంగా అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యక ర్తలు, అభిమానులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు

అంబేద్కర్, పూలే జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాత్రి వెంకటేష్



నవతెలంగాణ-ఘట్కేసర్

అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు 104వ వారం నిత్య పూలమాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాత్రి వెంకటేష్ హాజరై ఘట్కేసర్ మున్సిపాల్టీలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం పెంపొందించటానికి అంబెద్కర్. ఎంతో కషి చేశారన్నారు. అంబేద్కర్ దేశంలో ఉన్న సబండ వర్గాలకోసం ఆలోచించిన వ్యక్తి అన్నారు. వడ్డెర్ల కులస్థులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనకబాటుతో ఉన్నారని కావున వడ్డెర్లను ఎస్టీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ కోసం చేసే ప్రతీ కార్యక్రమం లో తమ సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. అంబేద్కర్, పూలే జయంతి ఉత్సవాలు గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ విధమైన కార్యక్రమాలతో ప్రజలని చైతన్య పరుస్తున్న ఎం. అరుణ్ కుమార్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేకల దాస్(అంబేద్కర్ సంఘం), తోక బాలయ్య, ఇరిటం శ్రీనివాస్(ప్రధాన కార్యదర్శి, అంబెద్కర్ యువజన సంఘం), చిలుగురి ఆనంద్(వార్డ్ మెంబెర్, మర్పల్లిగూడ), జె.సతీష్, శంబ, కుంచం మల్లేష్, మల్లికార్జున్, ఎం.గురు మూర్తి, పి.రంజిత్, ఎం.మైసమ్మ ఎం.మహేష్, ఎం.సుద ర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలోని సమస్యలను పరిష్కరిస్తా : కార్పొరేటర్ లచ్చిరెడ్డి



నవతెలంగాణ- వనస్థలిపురం

బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎస్‌కేడీ నగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్‌కు కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలోని పార్క్ అభివద్ధి, రోడ్లు, వీధి దీపాలు, డ్రయినేజీ సమస్యలు త్వరలోనే పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ వేసవికాలంలో ఆడుకునేందుకు వీలుగా క్యారమ్ బోర్డు సెట్‌ను కాలనీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహారెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు శ్రీధర్ రావు, కాలనీ గౌరవ అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, ట్రెజరర్ శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, కష్ణారావు, తులసి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



'ఎన్టీ రామా' శతక ఆవిష్కరణ

నవతెలంగాణ-వనస్థలిపురం

ఎన్టీఆర్ మీద అమిత అభిమానంతో "ఎన్టీ రామా" అనే మకుటంతో శతకం రాసి తన అభిమానాన్ని చాటుకున్నారు ఆక్కిరాజు అని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి అన్నారు. ప్రముఖ సంస్థ ఆకృతి ఆధ్వర్యంలో ప్రముఖ రంగస్థల, సినీ నటుడు, పద్య కవి అక్కిరాజు సుందర రామకష్ణ రచించిన 'ఎన్టీ రామా' శతక ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం వనస్థలిపురం హిల్ కాలనీలో నిర్వహించారు.. ఈ సందర్భంగా మధుసూదనాచారి పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రంగస్థల నటుడుగా ఎంతో ఘనంగా రాణించిన సుందర రామ కృష్ణ పద్య కవిగా తన ప్రతిభను కనబరిచారంటూ ప్రశంసించారు. సులభమైన శైలిలో ఈ శతకం అందరికీ అర్థం అవుతుందన్నారు. కవి సుందర రామ కృష్ణ ప్రతిస్పందిస్తూ.. చిన్నతనం నుంచే ఎన్టీ రామారావు అభిమానిగా ఆయనను సినిమాలలో చూస్తూ పెరిగానని చెప్పారు. శ్రీ కృష్ణ రాయ బారం నాటకం డిల్లీలో ఆయన, పి. వి.ముందు ప్రదర్శించి వారి ప్రశంసలను అందుకోవటం ఎప్పటికీ మర్చిపోలేని అనుభవం అన్నారు. అలాగే జమునతో కలిసి 1983 నుంచి 93 దాకా రంగస్థలం పై కలిసి నటించానని వివరించారు. శతకంలోని పద్యాలన్నీ ఆలపించి వీనుల విందు చేశారు. ఆకృతి సుధాకర్ అధ్యక్షత వహించారు. గాయని ప్రసన్న, విశ్వకర్మ సంఘ నాయకులు మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలు ప్రజల మధ్య సోదర భావాన్ని నింపుతాయి

- చైర్మెన్ షేక్ అబ్దుల్లా ఖాదీర్



నవతెలంగాణ-సరూర్‌నగర్

పండగలు ప్రజల మధ్య సోదర భావాన్ని నింపుతాయని స్కై, ఐఎంఎఫ్ లిమిటెడ్ చైర్మెన్ షేక్ అబ్దుల్ ఖాదర్, ఎండీ డాక్టర్ సాజిదా అన్నారు. వారి సంయుక్త ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. రోజా అనేది ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. పండుగలు మానవ జీవనములో భాగమైన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేందుకు దోహదపడతాయన్నారు. రంజాన్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు జరుపుకుంటారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు పండుగలు కలిసిమెలిసి జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అయోషా ఖాదర్, డాక్టర్ రవి, సరస్వతి, షరీఫ్, బాలరాజ్, మజీద తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు-క్రిష్ణ మార్ట్ ప్రారంభోత్సవం



నవతెలంగాణ -వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్‌లోని కమలనగ ర్‌లో నూతనం గా ఏర్పాటు చేసిన చిరుధాన్యాలు -క్రిష్ణ మార్ట్ ప్రారంభో త్సవంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. నిర్వాహకులు క్రిష్ణ కుమారి, రాధాకు శుభాకాంక్షలు తెలిపారు. మార్ట్‌లో కేవలం మిలెట్లు, మిలెట్ల బై ప్రొడక్ట్స్‌తో పాటుగా గానుగ నూనెలు డ్రై ఫ్రూట్స్, రకరకాల ఆరోగ్యాదయాక వస్తువులతో మొదలైన వి ఉంటాయన్నారు. కాలనీ వాసులకు చేరువలో ఈ షాప్‌ను ఏర్పాటు చేసిన నిర్వాహకులను వారు అభినందిస్తూ, చౌక ధరలో కాలనీ వాసులకు నాణ్యమైన వస్తువులను అందించాలని సూచించారు. బీజేపీ నాయకులు పాండల శ్రీను, గంగాని శ్రీను, కమల నగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే ప్రోగ్రాం రాష్ట్ర కన్వీనర్ గా శివ యాదవ్



నవతెలంగాణ-హయత్ నగర్

రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న బాబు జ్యోతిరావు పూలే 197వ జయంతి ప్రోగ్రాం రాష్ట్ర కన్వీనర్‌గా దూదిమెట్ల శివ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్యే దేవి రెడ్డి సుదీర్ రెడ్డిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం పొందారు. ఆయన వెంట విజయ భాస్కర్ రెడ్డి, కిరణ్, చలపతి ఉన్నారు.

వాసవి హాస్టల్ ట్రస్ట్ కమిటీ ఏకగ్రీవం



నవతెలంగాణ-నాగోల్

ముషీరాబాద్‌లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి రాజమౌళి గుప్త, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తల అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ముషీరాబాద్ వాసవి హాస్టల్ ట్రస్ట్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ సభ్యులు ఐదు సంవత్సరాల పాటు కొనసాగుతారు. ట్రస్ట్ చైర్మెన్‌గా గంజి రాజమౌళి గుప్త, జనరల్ సెక్రటరీగా బొగ్గారపు దయానంద్, ఆర్గనైజింగ్ ఉప్పల శ్రీనివాస్ గుప్తను ఎన్నుకున్నారు. అలాగే ట్రెజరర్‌గా గెల్లి ప్రభాకర్, వైస్ చైర్మెన్‌గా సుబ్బారాయుడు, వైస్ ప్రెసిడెంట్‌గా వాసు, రాఘవేంద్రన్, అడ్వైసర్‌గా గౌరు శ్రీనివాస్, గెల్లి రమేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ కమిటీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యులను సన్మానించారు.

ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-సంతోష్‌నగర్

ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలు అని అంతర్జాతీయ మానవ హక్కులు, సామాజిక న్యాయం సంస్థ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ బషారత్ ఉల్లాహ్ పేర్కొన్నారు. సోమవారం జలాల్‌పూర్ ఏరియా మెయిన్ ఏక్ మస్జిద్ వద్ద ఇఫ్తార్ పార్టీ నిర్వహించారు. అధ్యక్షులు మాట్లాడుతూ... రంజాన్ పండుగ సంక్షేమ ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు అందించి దేశంలోనే రాష్ట్రం ఆదర్శంగా నిలవాలని అన్నారు. పండుగలన్నీ సంతోషంగా నిర్వహించాలన్నారు. అంతర్జాతీయ మానవ హక్కులు, సామాజిక న్యాయ సంస్థ వ్యవస్థాపకుడు నీరజ్ సింగ్‌కు ధన్యవాదాలు తెలిపారు.నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించబోతున్న కేసీఆర్

- ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్



నవతెలంగాణ-హైదరాబాద్

దేశ రాజకీయాల్లో సీఎం కేసీఆర్ కీలక పాత్ర పోషించబోతున్నారని ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. సోమవారం రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని చిలుకానగర్‌లోని మజీద్ ఏ నూర్ ఏ మదీనా, మస్జిద్ ఏ అక్సలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వారు తోఫాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం సోదర సోదరీమణులు అందరూ పవిత్ర రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కషి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. రాష్ట్ర అభివద్ధిని చూసి మిగతా రాష్ట్రాల వారు కూడా కేసీఆర్ లాంటి సీఎం తమ రాష్ట్రానికి ఉండాలని కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎదుల కొండల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పల్లె నర్సింగ్ రావు, కార్యదర్శి కోకొండ జగన్, మైనారిటీ అధ్యక్షులు అబ్బు భాయ్, పార్శంది నర్సింగ్ రావు, మహమూద్, గారికే సుధాకర్, రవీందర్ రెడ్డి, రామానుజన్, అశోక్ చారి, అబ్బాలేందర్,రఘుపతి రెడ్డి,ముద్దం శ్రీనివాస్, ఫోటో బాలు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- ఇఫ్తార్ విందుల్లో పాల్గొన్న మంత్రి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

ముస్లిం,మైనార్టీ సోదరులు మత సామరస్యానికి ప్రతీకగానే ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం జరుగుతుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. రంజాన్ మాసంలో ముస్లిం సోదర సోదరీమణులు ఉపవాసాలు ఉండి సమాజంలోని పేదలకు దాన ధర్మాలు చేయటం ఎంతో గొప్ప విషయం అని పేర్కొన్నారు. జల్ పల్లి మున్సిపాల్టీ పరిధిలోని పహడి షరీఫ్ లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంత్రి పాల్గొన్నారు. అంతకుముందు ముస్లిం మహిళలతో మంత్రి ఉపవాస దీక్షల విరమణలో పాల్గొని, వారికి పవిత్ర రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అన్ని మతాలకు,కులాలకు సమాన ప్రాతినిధ్యం ఇస్తున్నారని, బతుకమ్మ పండుగ సందర్భంగా చీరల పంపిణీ, క్రిస్మస్ సందర్భంగా కానుకలు,రంజాన్ కు తోఫా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 12న రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముస్లింలకు ఎల్ బి స్టేడియంలో దవాత్ ఏ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.అనంతరం ఈద్ ప్రత్యేక ప్రార్థనలు జరిగే ఈద్గాను పరిశీలించి, పలు అభివృద్ధి పనులు చేయాలని,ఈద్ కోసం ఈద్గాను సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.ఈద్గా వద్ద ఉన్న శ్మశాన వాటికను కోటి రూపాయలతో అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ సందర్భంగా ముస్లింలు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ యూసుఫ్ పటేల్,కౌన్సిలర్ల దస్తగిర్,కొండల్ యాదవ్, మున్సిపల్ మహిళా అధ్యక్షురాలు యాస్మిన్ బేగం, మహామద్ హాసన్ బాబా, మాజీ ఎంపీటీసీ అబ్దుల్లా,మాజీ సర్పంచ్ మెరాజ్ ఖాన్, ప్రజా ప్రతినిధులు,ముస్లిం,మైనార్టీ సోదరులు తదితరులు ఉన్నారు.

రాయల్ కాలనీ ఇఫ్తార్ విందు

జల్ పల్లి మున్సిపాల్టీ రాయల్ కాలనీ వార్డ్ నెంబర్ 3 లోని బాలా గార్డెన్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఇఫ్తార్ పార్టీలో మంత్రి సబితా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో కుల మతాలకు అతీతంగా అభివృద్ధికి బాటలు వేస్తున్నామని తెలిపారు. రంజాన్ మాసంలో ప్రతీ ముస్లిం, మైనార్టీ సోదరులు తన సంపాదనలో కొంత భాగం పేదలకు సహాయం చేయాలని ఖురాన్ గ్రంథంలో ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖైసర్ బాం, జల్ పల్లి మున్సిపల్ వైస్ చైర్మెన్ యూసుఫ్ పటేల్, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రమ్ శేఖర్, జల్ పల్లి మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, నియోజక వర్గం ఉపాధ్యక్షులు నిమ్మల నరేందర్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ యాతం పవన్ యాదవ్, ముస్లిం, మైనార్టీ సోదరులు, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



'గుర్రపు డెక్క తొలగించి దోమలను నివారించండి'



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

బండ చెరువులో పెరుగుతున్న గుర్రపు డెక్కను తొలగించి పెరుగుతున్న దోమల బెడదను నివారించాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని వినాయకనగర్ డివిజన్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి కోరారు. సోమవారం జీహెచ్ఎంసి కార్యాలయంలో మేయర్‌ను, కమిషనర్ లోకేష్ కుమార్‌ను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. దోమల నివారణకు సరైన కంట్రోల్ మెషర్స్ తీసుకోవడం లేదని, బండ చెరువుని పూర్తిగా ప్రక్షాళన చేయాలని కోరారు. అలాగే ఎస్‌టీపీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని, డ్రయినేజీ సివరేజ్‌ని డైవర్ట్ చేయాలని వినతి పత్రంలో కోరారు. ఈ విషయమై కమిషనర్, మేయర్ స్పందించి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

క్రిశాంక్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-కంటోన్మెంట్

తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మన్నె క్రిశాంక్ సోమవారం రాత్రి ముస్లిం సోదరుల కోసం గన్ బజార్‌లోని కంటోన్మెంట్ కమ్యూనిటీ హాల్‌లో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముస్లిం సోదరులు దాదాపు 1200 మంది ఈ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి క్రిశాంక్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫహీమ్, నాజర్, వహాబ్, ఫాసి, యూనస్, రఘు, మోని తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



- మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు.. అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి , జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌లకు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వివిధ అంశాలపై 89 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన వాటికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి సమస్యలు పరిష్కరించి సంబంధిత వెబ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. తమ పరిధిలో లేని వాటిపై ఫిర్యాదుదారులకు తగు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాప్ ను కేటాయించండి..

నాగారం మున్సిపాలిటీలోని 5,15,16,17 వార్డులకు కొత్తగా రేషన్ షాపును కేటాయించాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి కోరారు. ఈ మేరకు ప్రజావాణిలో వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగారం మున్సి పాలిటీ కాలనీల పరంగా విస్తరిస్తునందున రేషన్ షాప్‌ను ప్రజల కోసం ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డిని కోరారు. బీఆర్ఎస్ నాయకులు అన్నం రాజు శ్రీనివాస్, దయాకర్ రావు పాల్గొన్నారు.





ముగిసిన తై బజార్ వేలం పాట

నవతెలంగాణ-జవహర్‌నగర్

మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామ లింగం అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో 2023-24 సంవత్సరమునకు సంబంధించిన తై బజార్ వేలం పాట సోమవారం నిర్వహించారు. ఈ వేలం పాట నందు కె. శ్రీకాంత్, యు. సంతోష్ పాల్గొన్నారు. ఈ మేరకు సంతోష్ 9.70 లక్షలకు పాట పాడగా నందు కె. శ్రీకాంత్ రూ. 9.80 లక్షలు పాడారు. దాంతో శ్రీకాంత్ దక్కించుకున్నారని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మున్సిపల్ ఆర్ఓ ప్రభాకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామలింగం మాట్లాడుతూ.. ఇంటి పన్నులు చెల్లించి అభివద్ధికి సహకరించాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరమునకు సంబంధించిన ఆస్తి పన్ను చెల్లింపు దారులు 30.04.2023 తేదీ వరకు ఆస్తి పన్ను చెల్లించాలని.. మీరు చెల్లించవలసిన పన్ను పైన 5 శాతం మినహాయింపు (శాతము) ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున జవహర్‌నగర్ ప్రజలు సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయానికి నటుడు నాగచైతన్య



నవతెలంగాణ- సిటీబ్యూరో

టాలీవుడ్ యువ నటుడు అక్కినేని నాగచైతన్య ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టీఏ అధికారులు ఆయనకు స్వాగతం పలికా రు. హీరో నాగచైతన్య ఇటీవల జూబ్లీహిల్స్ లో కొత్త ఇంటికి మారడంతో ఆ కొత్త ఇంటి అడ్రస్‌కు తన లైసెన్సు, రెండు టూ వీలర్ ఆర్సీల ను మార్చుకునేందుకు రావడంతో ఆర్టీవో ఎల్. రామచందర్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేయ గా.. దీనికోసం ఆయన అక్కడి నిర్దేశిత ఫార్మాట్లో దరఖాస్తు నింపి అధికారులకు అందజేశారు. అనంతరం లైసెన్సు, ఆర్సిలపై ప్రస్తుత కొత్త ఇంటి అడ్రస్ కు మార్చి అందించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వెంకటరమణ , తదితరులు పాల్గొన్నారు.

'బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు'



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు చేసినట్లు కౌన్సిలర్ కౌకుట్ల మమతా కష్ణారెడ్డి అన్నారు. సోమవారం నాగారం మున్సిపల్ 8 వ వార్డు పరిధిలో ఎస్‌వీ నగర్ మెయిన్ రోడ్ (హెచ్‌పీపెట్రోల్ పంప్ దగ్గర) చలివేంద్రాన్ని కౌన్సిలర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ మండు వేసవిలో ప్రజలందరూ ముఖ్యంగా పెద్దలు, పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అందరూ ఐకమత్యంగా పనిచేయాలి



- బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-కంటోన్మెంట్

అందరూ కలిసి ఐకమత్యంగా పనిచేసి బీఆర్ఎస్ అభివృద్ధికి పాటుపడాలని బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఇన్ చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆయన సోమవారం కార్పొరేషన్ చైర్మెన్‌లు, పార్టీ నియోజకవర్గ సీనియర్ కార్యకర్తలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో అందరూ కలిసి పనిచేయాలని, రానున్న ఎన్నికలలో నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలవాలని చెప్పారు. అధిష్టానం ఇచ్చే ప్రతీ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో నాయకులు, చైర్మెన్‌లు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పని చేయాలని తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు పరిధి లోని సమస్యల పరిష్కారం కోసం కూడా పార్టీ పనిచేస్తుం దని, ప్రస్తుతం బోర్డ్‌లో బ్రోకర్ నామినేటెడ్ సభ్యుడుగా ఉన్నాడని విమర్శించారు. అంతకుముందు కార్పొరేషన్ చైర్మెన్‌లు క్రిశాంక్, గజ్జల నగేష్, ఎర్రోళ్ల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాజశేఖర్ రెడ్డికు పార్టీ అధిష్టాన వర్గం అదనపు బాధ్యతలు అప్పజెప్పటం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ధన్యవాదాలు చెప్పారు. ఈ సందర్భంగా సమావేశానికి ముందు కార్పొరేషన్ చైర్మెన్‌లు, బోర్డు మాజీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో వచ్చి మరి రాజశేఖర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. సమావేశానికి దివంగత ఎమ్మెల్యే సాయన కుమార్తెలు లాస్య నందిత, నివేదితలు, నాయకులు శ్రీ గణేష్, మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన జ్యోతి కళాశాలలో అవగాహన సదస్సు



నవతెలంగాణ-కంటోన్మెంట్

వెస్ట్ మారేడ్పల్లిలోని విజ్ఞానజ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సోమవారం లాభాపేక్ష లేని అంతర్జాతీయ సంస్థకి చెందిన భారతదేశ విభాగం, భారత్ శోకా గక్కాయ్, ఐక్యరాజ్యసమితి గుర్తించిన సహనీయ అభివద్ధి లక్ష్యాల గురించి అవగాహనా కార్యక్రమాల సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రధానాధ్యాయురాలు ఆచార్య డా. ఎన్. అరుణ, సంచాలకులు ఆచార్య డా.డి. విజయ ప్రసాద్, వీఎస్ఆర్ విజ్ఞానజ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ.. సంస్థకు చెందిన ఆచార్య డా. జయశ్రీలతో సహా భారత్ శోకా గక్కాయ్ ప్రతినిధి మౌనిక జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. మౌనిక మాట్లాడుతూ "నేర్చు, శ్రద్ధతో ఆలోచించు, సాధికారత కల్పించు" అన్నది తమ సంస్థ ఆదర్శమని, యువతలో స్వతస్సి ద్ధమైన మార్పు ద్వారానే ఈ ఆదర్శం సుసాధ్య మవుతుందని, ఇటువంటి కళాశాలలు స్వయంగా పూనుకుని చేపడుతున్న కార్యక్రమాల ద్వారా. స్పృహ మెరుగవుతతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ కళాశాల కార్యక్రమాలను అభినందించారు. సామాజిక కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డా. ఎన్. అరుణ మాట్లాడుతూ తమ కళాశాలలో మొదటి సంవత్సరం నుంచే ఇంటర్ డిసిప్లీనరీ ప్రాజెక్టుల ద్వారా సహనీయ అభివృద్ధి లక్ష్యాల గురించి అవగాహన కలిగిస్తున్నామని వివరించారు. కళాశాల సంచాలకులు ఆచార్య డా. విజయ ప్రసాద్ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి ప్రతిపాదించిన ఈ లక్ష్యాలు ప్రపంచం మొత్తానికి సమస్త మానవాళికి సంబంధించినవని, మనలో ప్రతి ఒక్కరూ వీటిని వ్యక్తిగత బాధ్యతగా భావిస్తే ఈ లక్ష్యాలను సాధించగలమని అభిప్రాయపడ్డారు. ఆచార్య డా. జయశ్రీ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఆదర్శవంతమైనదని, సామాజిక శ్రేయస్సు కోసం ఇటువంటి ఉద్దేశాలను ముందుకు తీసుకుపోవాలని సూచించారు.

IN THE HONOURABLE COURT OF THE IX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT : HYDERABAD

O.S No. 1179 OF 2020

Between :
UNION BANK OF INDIA ...Plaintif
Mehdipatnam Branch, Hyderabad.
AND
Vidthya Vijaya, W/o. V. Laxman, Aged about 28 Years, Occ. Business, R/o H. No. 16-11-16/P/51, Sri Sri Banjara Nagar, Saleem Nagar, Hyderabad Telangana - 500036.

Please take Notice that the above OS No. 1179 OF 2020 is stand posted to 11.04.2023 at 10.30 AM for your appearance. You are here by direzcted by the Hon'ble court to appear before the said court on the date and time mentioned above.If you fail to appear, then the matter will be heard in your absence.

By Order of the Court
Mohd. Rafiq
Advocate

IN THE COURT OF THE HON'BLE CHIEF JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD
S.SR No. 29705 of 2022
Against
S No.327 of 2018

Between:-
Naini Kamal Rao .....Appellant
AND
Smt.Chettla Balamani & others .....Respondents

To
1. Smt.Chettla Balamani W/o. Late C. Shiva Raju, Aged about 75 years, Occ: House Wife,
2. C. Yadagiri S/o. Late C. Shivaraj, Aged about 42 years, Occ: Pvt Employee,
Both are Resident of : R/o.H.No.18-6-379, Outside Gowlipura, and also R/o.H.No.18-6-271, Outside Gowlipura, Hyderabad – 500 053.

It is hereby informed that, Our client, Mr. Naini Kamal Rao, son of Late N. Kistaiah, has filed an appeal against Smt. Chettla Balamani and others under ASSR No. 29705 of 2022 before the Hon'ble Chief Judge Court, City Civil Court, Hyderabad. The court has instructed our client to serve notice to Respondent No. 1 to 3, and the notice to Respondent No. 3 has already been served, and Set ex-parte, As per the courts orders dated 21/03/2023, steps by way of publication for Respondent Nos. 1 & 2 have been ordered. Therefore, the Respondent Nos. 1 & 2 are hereby informed to appear in person or through a pleader before the said Hon'ble Court on 20/04/2023. In case of non- appearance, the matter will be decided ex-parte.

(BY ORDER OF THE COURT)
M/s.R.Swarnalatha @ Brahmadandi Swarnalatha
Matla Venu, Vadthya Shiva
V.Bhaskar, M.Raj Kumar,
Advocates
off: 3-4-472, Narayanguda, Hyderabad - 500 027,
Cell No: 9866990564 / 8520052024

ఆయుష్మాన్ భారత్ యోజనపై కార్పొరేటర్ అవగాహన



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఆయుష్మాన్ భారత్ యోజనపై కార్పొరేటర్ దీపిక సోమవారం డివిజన్‌లోని సాంబమూర్తి నగర్‌లో స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ పథకంతో రూ. ఐదు లక్షల ఉచిత ఆరోగ్య బీమా, ఆయు ష్మాన్ భారత్ యోజన వస్తాయని వివరించారు. దీనికి తెల్ల రేషన్ కార్డు ఉన్నవాళ్లు అందరూ అర్హులని.. దీనికి ఆధార కార్డు మన ఫోన్ కి లింక్ అయి ఉండాలన్నారు. ఈ పథకం ద్వారా పెద్ద ప్రయివేటు ఆస్పత్రుల్లో ప్రతీ సంవత్సరం రూ. ఐదు లక్షల వరకు ఉచిత వైద్యం పొందొచ్చు అన్నారు. ఒక కౌంటర్ ప్రత్యేకించి ఆధార్ లింకింగ్ కోసం పెట్టడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని బస్తీ వాసులందరూ సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ కోరారు. ఈ వారం రోజులు పాటు రోజూ రెండు బస్తీల్లో ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయాన్ని సందర్శించిన ఈటల, విజయశాంతి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అల్వాల్‌లోని ముత్యాలమ్మ అమ్మవారిని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, మాజీ ఎంపీ విజయశాంతి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు తదితరులు సోమవారం దర్శించుకున్నారు. బీజేపీ తెలంగాణ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు డి.వెంకటేష్ ఆహ్వానం మేరకు ముత్యాలమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, రవి యాదవ్, మంగేష్ పాల్గొన్నారు.

ఎంఎన్‌జే ఆస్పత్రిలో ముజీబ్ అన్నదానం



నవతెలంగాణ- సిటీబ్యూరో

టి.యన్.జి.ఓస్.యూనియన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డా. ఎస్.ఎం. హుస్సేని (ముజీబ్) ఆధ్వర్యంలో సోమవారం ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో 600 రోగుల బంధువులకు అన్నదాన చేశారు. ఈ కార్యక్రమంలో సహాధ్యక్షులు కే.ఆర్.రాజ్ కుమార్, కుర్రాడి శ్రీనివాస్, వైదిక్ శాస్త్ర, బి.శంకర్, ముఖీం ఖురేషి, క్యాన్సర్ ఆస్పత్రి అధ్యక్షురాలు అరుణ్ జ్యోతి, కార్యదర్శి బి.శివకుమార్, కోశాధికారి చంద్రశేఖర్, ముహమ్మద్ వహీద్, ఉస్మానియా మెడికల్ కాలేజ్ కార్యదర్శి జగన్ కుమార్, రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులు సోహెల్, మిత్రులు ఉస్మాన్ అలీ ఉస్మాని , రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల పేరు మీద రంజాన్ మాసంలో ఆస్పత్రి ఆవరణలో అన్నదానం చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ఉద్యోగ మిత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

LOST OF PASSPORT

I, MOHAMMED MUDABBIR ALI KHAN S/o FARKHUNDA ALI KHAN, age 39, Occ: Advocate, R/o B-294, Hill Colony, Vanasthalipuram, Hyd, T.S.-500070. I had travelled on my Activa bike no. TS07 HJ9020 from my Residence to NGOs Colony for Xerox purpose on 02.04.2023, at 11.30 AM. I lost my Original Indian Passport No. **W 2972589** issued on 29/06/2022 Exp. Date 28/06/2032 RPO Hyd. If anyone found, please contact **9133944666.**

నాటక రంగ విశిష్ట కళాకారుడు వై.కె.నాగేశ్వరరావు



నవతెలంగాణ-కల్చరల్

యువ కళా వాహిని సాంస్కృతిక సంస్థను స్థాపించి కళాకారులకు, సాహితీ వేత్తలకు వేదిక కల్పించిన వై.కె.నాగేశ్వరరావు నాటక రంగంలో విశిష్ట కళాకారుడు అని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే..వీ. రమణ నివాళ్లర్పించారు. రవీంద్రభారతి ప్రధాన వేదిక పై యువ కళా వాహిని సాంస్కృతిక సంస్థ నిర్వహణలో కళా పోషకుడు సారి పల్లి కొండలరావు సారథ్యంలో వై.కె.నాగేశ్వరరావు ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని రంగ స్థల ప్రముఖులకు పురస్కార ప్రదానోత్సవం సభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని మాట్లాడుతూ చరిత్ర ప్రసిద్ధులైన నేతాజీ, రాణా ప్రతాప్ వంటి చరిత్రాత్మక నాటకాలలో ప్రధాన పాత్ర పోషించి నాగేశ్వర రావు చివరి వరకూ కళా రంగానికే అంకితమైనారని వివరించారు. అధ్యక్షత వహించిన కళా పోషకుడు సారిపల్లి కొండలరావు మాట్లాడుతూ సాంస్కృతిక రంగంలో నాగేశ్వరరావు లేని లోటు తీర్చలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు. సాహితీ వేత్తలు వోలెటి పార్వతీశం, డాక్టర్ కే.వీ. కృష్ణ కుమారిలు నాగేశ్వరరావుతో తమకున్న అనుబంధం గుర్తుకుతెచ్చుకున్నారు. అనంతరం గుమ్మడి గోపాలకృష్ణ, డీ.ఎస్.ఎన్మూర్తి, అక్కిరాజు సుందర రామ కృష్ణ, కాళిదాసు,కల్యాణి, మంచాల రమేష్, సుబ్బరాజులకు అతిథులు పురస్కారాలు బహు కరించారు. నటుడు సుబ్బ రాయ శర్మ, జర్నలిస్ట్ ఎస్వీ రామా రావులు పాల్గొన్న సభకు సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ స్వాగతం పలుకుతూ నాగేశ్వరరావు నిర్వహణ దక్షతను కొని యాడుతూ ఆయన స్థానంలో తాను అధ్యక్షునిగా బాధ్యత తీసుకోన్నానని బాధా తప్త హృదయం చెప్పారు. భాగి శాస్త్రి, రాజ్ కుమార్ నిర్వహణ లో దీపికా ప్రసాద్ రచించి దర్శకత్వం వహించిన కాళ హస్తీశ్వరసాయుజ్యం పద్య నాటకం ప్రదర్శించారు

మహారాజశ్రీ గౌరవ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు ఖమ్మం
S.O.P No. 3 OF 2020

బిట్వీన్:
ఏదునూతల రామకృష్ణ నేతాజీ. .....పిటీషనర్
మరియు
బ్రాంచ్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆంధ్రా బ్యాంక్BSE) బ్రాంచ్, ఖమ్మం మరియు ఇతరులు. .....రెస్పాండెంట్

To
1) ఏదునూతల విజయ్‌కుమార్, తండ్రి: పురుషోత్తమరావు, ఇంటి నెం.3-6-542/B హిమాయత్‌నగర్, హైదరాబాద్. రెస్పాండెంట్ నెం 3
2) యన్.విజయలక్ష్మి, భర్త: NSబాబుషా, వయస్సు: 64 సం.లు, ఇంటి నెం 5-4-10, వనస్థలిపురం, హైదరాబాద్. రెస్పాండెంట్ నెం 4.
.....రెస్పాండెంట్స్

NOTICE

పైన తెలిపిన పిటీషనర్ గారి మరియు మీ తల్లి గారైన శ్రీలక్ష్మి గారి పేరిట ఆంధ్రా బ్యాంకు ఖమ్మం బ్రాంచ్ లో ఉన్న రూ 7,46,588/- గురించి తన వాటాకు రావలసిన నగదు గురించి తమ కుటుంబ సభ్యులు కాపటం వలన "వారసత్వం" దావా యస్.ఓపి నెం 3/2020 పై కోర్టు నందు పిటిషనర్ పిటిషన్ దాఖలు చేసియున్నారు. అట్టి దావాలో మీ ఇద్దరి హాజరు కొరకు ది: 24-4-2023న వాయిదా కలదు. ఆ రోజు మీరు స్వయముగా కాని లేక మీ న్యాయవాది గారి ద్వారా కాని జవాబు తెలియజేయుటకు పైన తెలిపిన న్యాయస్థానం యందు ఉ.10.30 ని.ల.కు హాజరు కాగలరు. లేని ఎడల మీ పరోక్షములో తీర్పు ఇవ్వబడును అని తెలియజేయటమైనది.

//కోర్టు వారి అనుమతితో//
కాట్లూరి లక్ష్మీ నరసింహారావు
న్యాయవాది
ఖమ్మం ఖమ్మం
తేది:10-04-2023 సెల్ నెం. 9030937710

IN THE COURT OF THE HON'BLE 1st ADDITIONAL DISTRICT JUDGE: AT BHONGIR
O.S.No. 81 OF 2015

Between:
Bejagam Nagaraju and others .....Plaintiffs
AND
Smt Artham Venkata Laxmi and others. ....Defendants

To
D46. Tipparaboina Naresh Kumar, S/o. T. Parvathalu, Age 33 years, Occ: Pvt Employee, R/o. Opp: Bombay Tailors, Pedda Thokatta, New Bowenpally, Secunderabad, Hyderabad 500 011.

NOTICE

That the above suit is filed by the plaintiffs against the defendants for Cancellation of Registered Sale Deed Doc No.551/2004, dated 25-03-2004 of SRO -Yadagirigutta and also for Partition and Recovery of Possession of their 2/6th share out of the suit schedule property situated at Gundla pally Village, Yadagirigutta Mandal, Yadadri-Bhongir District. The above said suit is coming for your appearance and the matter is posted on 21-04-2023. If you fail to appear on 21-04-2023 at 10.30AM before the above said Hon'ble Court either in person or through your advocate, thematter will be decided exparte as per law.

(BY ORDER OF THE HON'BLE COURT)
S.SREEKANTH
G HARIKRISHNA GOUD
ADVOCATE: BHONGIR
Cell: 9391099207, 8499947666

IN THE COURT OF HON'BLE VII SENIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 389 of 2022

Between:
1. Smt. Gampa Meera Bai, & another ....PLAINTIFFS
AND
1. Pandarinath Gampa & others ....DEFENDANTS

To ,
1. Pandarinath Gampa S/o Sri Hari Gampa Aged about 55 years Occ: Business R/o H. No.4-5-584/ G3, Kutibiguda, Hyderabad 500027. .....Defendant No. 1

NOTICE

This is to inform that by order of the Hon'ble VII Senior Civil Judge, City Civil Court at Hyderabad this notice is published that the Plaintiff above named has filed Suit for declaration as the legal heir in respect of Suit Schedule Property the above case is posted to 07.06.2023 for appearance of any person having objection for the Grant of the legal heir infavour for the Plaintiff they can do so by appearing before this Honble court on the date **07.06.2023** mentioned in person or through Counsel.

Kishore Deshpande
Advocate
Law Chambers,
4-3-324/1, IIIrd Floor
Bank Street, Kothi.
Hyderabad.500095
Mobile No. 9246582236

IN THE COURT OF THE HON'BLE 1st ADDITIONAL DISTRICT JUDGE: AT BHONGIR
O.S.No. 81 OF 2015

Between:
Bejagam Nagaraju and others. ....Plaintiffs
AND
Smt Artham Venkata Laxmi and others. ....Defendants

To
38. N.Deepika, W/o. Narega Rakesh Kumar Yadav, Age 26 yeasr, Occ: House Wife, R/o.H.No.5-54, Old Malkajgiri, Near Hanuman Temple, Malkajgiri, Medchal Malkagiri District.

NOTICE

That the above suit is filed by the plaintiffs against the defendants for Cancellation of Registered Sale Deed Doc No.551/2004, dated 25-03-2004 of SRO for Part and Recovery of Possession of their 2/6th share out of the suit schedule property situated at Gundlapally Village, Yadagirigutta Mandal, Yadadri-Bhongir District. The above said suit is coming for your appearance. and the matter is posted on 21-04-2023. If you fail to appear on 21-04-2023 at 10.30AM before the above said Hon'ble Court either in person or through your advocate, the matter will be decided exparte as per law.

(BY ORDER OF THE HON'BLE COURT)
S.SREEKANTH
G HARIKRISHNA GOUD
ADVOCATE: BHONGIR
Cell: 9391099207, 8499947666

IN THE COURT OF THE HON'BLE 1st ADDITIONAL DISTRICT JUDGE: AT BHONGIR
O.S.No. 81 OF 2015

Between:
Bejagam Nagaraju and others .....Plaintiffs
AND
Smt Artham Venkata Laxmi and others .....Defendants

To
D44. Saraji Narsing Rao, S/o. Late Srisailam, Age 47 years, Occ: Business, R/o.H.No.1-125/1, 8-553, Shanthi Nagar, Near Firing Range, Jawahar Nagar, JJ Nagar Colony, Shamirpet, KV Ranga Reddy 500 087.
D50. Kannemena Narsimhulu, S/o. K. Narsaiah, Age 37 years, Occ: Business, R/o. H.No.6-2, Ex-Serviceman Colony, Balaji Nagar, Near Holly Join School, Balaji Nagar, Jawaharnagar, JJ Nagar Colony, K.V. Ranga Reddy District, TS
D51. Naregey Anusha, W/o. Naregey Ramesh Kumar Yadav, Age 25 years, Occ: House Wife, R/o. H.No.5-54, Old Malkajgiri near Mankali Temple, Malkajgiri, Ranga Reddy District.
D52. Bakka Sai Kumar, S/o. Bakka Yellaiah, Age 32 years, Occ: Business, R/o. H.No.4-87/9, East Gandhi Nagar Colony, Nagaram, KV Ranga Reddy District.
D53. Manthri Goverdhan, S/o. M. Laxminarayana, Age 45 years, Occ: Business, R/o. H.No.12-97/2/1, Shivaji Nagar, Old Grama Panchayath Lane, Balajinagar, Shamirpet Mandal, Jawahar nagar, JJ Nagar Colony, KV Ranga Reddy District.
D54. Silmarth Laxmamma, W/o. S. Venkataiah, Age 37 years, Occ: House Wife, R/o. H.No.15-70/41, Vigneshwara Colony, Balaji Nagar, Bikshapathi Thota, Shameerpet, Ranga Reddy District.
D55. B.S. Vamshi, S/o. Boyini Satyana rayana, Age 18 years, Occ: Student, R/o. H.No.2-16, Sriram Nagar Colony, Main Road, Balaji Nagar, Shamirpet, Ranga Reddy District.
D56.V. Ashok, S/o. V. Pentaiah, Age 30 years, Occ: Business, R/o. H.No.24-168/1, Nalla Pochamma Temple Street, Near GC CRPF, Arundathi nagar, Jawaharnagar, Ranga Reddy District - 500 087.
D57. Makthala Pandu, S/o. M. Venkataiah, Age 35 years, Occ: Business, R/o. H.No. 3-10-1/409, Nehru Nagar, Mallapur, Kapra, Ranga Reddy District.

NOTICE

That the above suit is filed by the plaintiffs against the defendants for Cancellation of Registered Sale Deed Doc No.551/2004, dated 25-03-2004 of SRO-Yadagirigutta and also for Partition and Recovery of Possession of their 2/6th share out of the suit schedule property situated at Gundla pally Village, Yadagirigutta Mandal, Yada dri-Bhongir District. The above said suit is coming for your appearance and the ma tter is posted on 21-04-2023. If you fail to appear on 21-04-2023 at 10.30AM before the above said Hon'ble Court either in person or through your advocate, thema tter will be decided exparte as per law.

(BY ORDER OF THE HON'BLE COURT)
S.SREEKANTH
G HARIKRISHNA GOUD
ADVOCATE: BHONGIR
Cell: 9391099207, 8499947666

PUBLIC NOTICE
IN THE COURT OF HON'BLE II ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD
E.A.No. 8O OF 2022
IN
E.A. No.84 OF 2010 2010
IN
E.P.No. 15 OF 2003

BETWEEN:
Om Prakash .....Petitioner/Claim Petitioner
AND
Govardhan Das Tapadiya& others. ....Respondents/Respondents

To,
13. Gayatri, W/o Vinit Kumar, Aged about: 52 yrs, Oc: Nil, R/o Flat No.102, Sri Matha Residency, Tejaswani Nagar Colony, Attapur, Rambagh, Hyderabad.

14. Seema, W/o. Sunil Agarwal, Aged about: 50 Yrs, Occ: Nil, R/o. Flat No. 102, Sri Matha Residency, Tejaswani Nagar Colony, Attapur, Rambagh, Hyderabad.
(Proposed Respondents No. 13 & 14)

Take notice that the petitioner has filed an application under Order XXII Rule 4 R/w Section 151 of CPC in EP No. 15 of 2003 on the file of Hon'ble II Additional Chief Judge City Civil Court, at Hyderabad and the said application is numbered as I.A. No 80 of 2022 and the same is posted on **26-04-2023 at 10:30 A.M.** for your appearance and counter, if any. Hence, you are required to appear either in person or through your counsel, failing which the matter may be decided in your absence.

//BY THE ORDER OF HON'BLE II ADDITIONAL CHIEF JUDGE CITY CIVIL COURT, AT: HYDERABAD//
Sd/-
M/S. SHARAD SANGHI & ASSOCIATES
Advocate (#91-9848050544)

IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD
O.S.NO. 1849 OF 2023

Between:-
1. Abhilash Poyyil Veettil,
2. Master Aaryan Stalin Nambiar, ...Petitioners/Plaintiffs
AND
1. The Thasildar, Saidabad Mandal, Saidabad, Hyderabad.
2 To All Concerned.. ....Respondents/Defendants

NOTICE

Please take notice that the above said Plaintiffs have filed the above Suit for Declaration of Legal Heir of deceased late Smt. Monica Nambiar in respect of 1/2 share in the Flat No. 405, Landmark Residency, Municipal No. 16-11-16/B/3/1, Theegalaguda, Malakpet, Hyderabad, admeasuring 1235 Sq. feet including common area and car parking along with undivided share of land admeasuring 35.60 Sq yards out of 1228 sq. yards and the said case is posted on 28-06-2023 for Objections of any person.
Therefore if any person or persons have got any objections for granting the Declaration Decree in respect of the above said property of late Smt. Monica Nambiar can appear before the said Hon'ble Court on **28-06-2023 at 10.30 A.M.,** either in person or through an Advocate, failing which necessary orders will be passed as per law.

(BY ORDER OF THE COURT)
M/S P.VIDYASAGAR REDDY,
V.UDAYA SIMHA,
J.VEERABRAHMA CHARY
Smt. LAKSHMI LAVANYA
Advocates
COUNSEL FOR PLAINTIFF.
Flat No.G1, 1st floor, Kranti Towers, Barkatpura, Hyderabad.

IN THE COURT OF THE HON BLE I ADDL, DIST JUDGE AT SANGAREDDY
I.A.N.O. OF 2023
IN
MVOP. NO. 156 OF 2019

Between:
Golla Venkanna. ...Petitioner / climate
AND
M. Suresh & others. ...Respondents/Respondents

NOTICE

To,
1. M. Suresh S/o Chilvanth, Age: major, Occ:Owner of the car, R/o. Zoom Car India Pvt. Ltd., Plot No. 197, A Z elite, Guttala Begumpet Village, Kavuri Hills, Madhapur, Hyderabad.
2. J. Rajiv Reddy S/o.J. Venkat Reddy Age: Major, Occ: Driver, R/o. H.No: 4-39-298, Deenabandhu Colony, Jagathgirigutta, Balanagar, Medchal District.

To take notice that my client Golla Venkanna filed the above OP for the injuries sustained by him in motor vehicle accident Claim against you (R1 & R3) before the said Hon'ble court. The case is posted on 19-04-2023 for your appearance before the said court on the said date at 10:30 AM., If you fail to appear on the said date and time before the said court the case will be decided as per law

//BY ORDER OF THE COURT//
G. Anjaiah
ADVOCATE
SANGAREDDY

చలివేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-అంబర్‌పేట

నల్లకుంట డివిజన్‌లోని చే నెంబర్ చౌరస్తా బస్టాప్ సమీపంలో బీజేపీ నాయకుడు అచ్చిని మహేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య కిషన్ రెడ్డి ప్రారంభించారు.. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు డాక్టర్ ఎన్ .గౌతమ్ రావు, బీజేపీ నాయకులు వెంకటరెడ్డి, కార్పొరేటర్లు పద్మ వెంకట్ రెడ్డి, కన్నె ఉమా రమేష్ యాదవ్, నల్లకుంట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రమణ నాయుడు, భీమ్ రాజ్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ హెూమియోపతి దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఓయూ



హెూమియో పితామహుడు డా.సామ్యూల్ హనీమాన్ జయంతి (ప్రపంచ హెూమియోపతి దినోత్సవం) వేడుకలను రామంతాపూర్ ప్రభుత్వ హెూమియోపతి కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అతిథిలుగా ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ ఛైర్మన్ వేణుగోపాల చారి, కార్పొరేటర్ కక్కిరేణి చేతన, రాష్ట్ర ఆయూష్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ యం.ప్రశాంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు.

సర్కిళ్ల వారిగా సహాయ పరికరాలు

- నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- వికలాంగులు, సీనియర్ సిటిజన్లకు సహాయక పరికరాలు పంపిణీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ పరిధిలోని వికలాంగులు, సీనియర్ సిటిజన్లకు ఉపకరణాలు, సహాయక పరికరాలు అర్హులైన వారికి సర్కిళ్ల వారీగా అందజేస్తామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో యూ.సీ.డీ. విభాగం ద్వారా ఏర్పాటు చేసిన వికలాంగులకు, సీనియర్ సిటిజన్లకు ఉపకరణాలు, సహాయక పరికరాలు, కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డితో కలిసి మేయర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ అలిమ్ కో-సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన గుర్తింపు శిబిరాలలో 4,456 లబ్ధిదారుల



కుగాను రూ.3 కోట్ల 86 లక్షల 80 వేల 286 విలువ గల 9250 పరికరాలు కొనుగోలుకు ప్రతిపాదించామని తెలిపారు. ఆ సందర్భంలో అన్ని ధ్రువీకరణ పత్రాలతో క్యాంపులకు హాజరైన 3619 మంది అర్హులైన లబ్ధిదారులకు రూ.3 కోట్ల 15 లక్షల 281 విలువగల 7576 కృత్రిమ అవయవాలు, పరికరాలు, సహాయ పరికరాలు జీహెచ్ఎంసీ సొంత నిధులతో ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. ఇంకా మిగిలిన వారికి తర్వాత పంపిణీ చేస్తామని తెలిపారు. సోమవారం ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో అర్హులైన వికలాంగులకు ట్రై సైకిల్ చేతి కర్రలు, వీల్ ఛైర్స్‌లను 47 మందికి డిప్యూటీ మేయర్‌తో కలిసి మేయర్ పంపిణీ చేశారు. డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ వివిధ ప్రతిభావంతులకు (వికలాంగులు, సీనియర్ సిటిజన్లకు) సహాయక పరికరాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిగిలిపోయిన వారికి కూడా సరియైన ధ్రువీకరణ పత్రాలు అందజేసిన పక్షంలో అందజేస్తామనీ, ఆందోళన చెందవద్దని ఆమె తెలిపారు. కార్యక్రమంలో యూ.సీ.డీ. ప్రాజెక్ట్ డైరెక్టర్ సౌజన్య, జాయింట్ కమిషనర్ వెంకట్ రెడ్డి, అలిమ్ కో- సంస్థ ప్రతినిధి రాజేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ జీ.శంకర్ రాజు అన్నారు. బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో సోమవారం చాపల్ రోడ్డులోని సుజాత స్కూల్ లో విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, అతివేగంతో ర్యాష్ డ్రైవింగ్ చేయడం సరికాదని సూచించారు. మైనర్ డ్రైవింగ్, స్టాప్ లైన్, రాంగ్ రూట్, ట్రిబుల్ రైడింగ్, ఫోన్ డ్రైవింగ్, జీబ్రా క్రాసింగ్ వాటిపై సూచనలను సూచించారు. కళాశాల విద్యార్థులు సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనల పై పూర్తి అవగాహన కల్పించారు. చిన్న వయసు నుంచే క్రమ శిక్షణ, ఏకాగ్రత, సమయం వృధా కాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జ్యోతి,. చైర్మన్ జై.ప్రకాష్ సింగ్. కరెస్పాండెంట్ అరుణ సింగ్, అడ్వైజర్ మధు, ప్రిన్సిపాల్ అపర్ణ, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనలో కేంద్ర దర్యాప్తు సంస్థలు విఫలం



- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ

నవతెలంగాణ-అడిక్‌మెట్

రాష్ట్ర అధికార పార్టీ కొన్ని వేల కోట్లు ఎన్నికలపై ఖర్చు అనేది దేశమంతటా చర్చ జరుగుతున్నా కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈ అవినీతినీ నిర్మూలించే చర్యలలో విఫలమయ్యాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ ఆరోపించారు. సోమవారం విద్యానగర్ బీసీ భవన్‌లో బీసీ నాయకుల సమావేశం జరిగింది ఈ సమావేశంలో ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో కుటుంబ పాలన, అవినీతిపై పోరాటానికి ప్రజా సహకారం కావాలనే ప్రధాని నరేంద్ర మోడీ ఇందుకు అవసరమైన తక్షణ కార్యాచరణ దీనిపై చర్యలు తీసుకోకుండా కేవలం రాజకీయ లాభాల కై మాత్రమే వినియోగించుకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. గత ప్రస్తుత భవిష్యత్తు ఎన్నికలలో రాష్ట్ర అధికార పార్టీ కొన్ని వేల కోట్లు ఎన్నికలపై ఖర్చు చేస్తున్నారు అనేది దేశమంతటా చర్చ జరుగుతున్నా కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈ అవినీతినీ నిర్మూలించే చర్యలలో విఫలమయ్యాయని తెలిపారు. సీఎం కేసీఆర్ తనను నాయకుడిగా చేస్తే 540 పార్లమెంటు అభ్యర్థుల ఖర్చును భరిస్తాననే అంశం బయట పెటడం ద్వారా ప్రాథమిక సాక్ష్యాధారాలు దొరికినా చర్యలు ఏవీ అని ప్రశ్నించారు. ప్రజాలను తాగుబోతులను చేసి, విద్యాధిక నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వకుండా, ప్రభుత్వ ఆస్తులను యదేచ్ఛగా అమ్ముకుంటూ రాష్ట్రాని, ప్రజలను రూ.5 లక్షల కోట్లు అప్పులపాలు చేసి సంపూర్ణ ఆర్థిక నియంత్రణను తన గుప్పెట్లో పెట్టుకుని ప్రశ్నించే గొంతులను అణచి వేస్తూ సంపాదించిన లక్షల కోట్లు దేశానికి విదేశాలకు హవాలా మార్గం ద్వారా తరలిస్తుంటే కేంద్ర దరావు సంస్థలు ఏం చేస్తున్నాయన్ని ఆయన ప్రశ్నించారు. కేంద్ర గతానుభావాలు చూస్తే నేరానికి శిక్ష అనేది కాకుండా నేరంతో రాజీ లాభం అనే వైఖారితో మాత్రమే గడిపాయని తెలిపారు. ఈ సమావేశంలో పి.సుధాకర్ ముది రాజ్, నందగోపాల్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓయూ ఒప్పందాలు

నవతెలంగాణ-ఓయూ

వ్యవసాయం, అక్వాకల్చర్ వాటి అనుబంధ రంగాల్లో అత్యున్నత ప్రమాణాలతో పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని ఓయూ వీసీ ప్రొ.రవిందర్ యాదవ్ ఆకాంక్షించారు. అప్పడే అయా రంగాల్లో నాణ్యమైన దిగుబడులు, ఆవిష్కరణలకు అవకాశం ఏర్పడుతుందని వ్యాఖ్యానించారు. వ్యవసాయం, ఆక్వా, న్యూట్రాస్యూటికల్స్, బయోస్టిమ్యులేంట్, సూక్ష్మ జీవుల ఉత్పత్తుల అభివృద్ధి పరిశోధనలో జాతీయ గుర్తింపు గల శ్రీ బయో అస్తెటిక్స్, సుల్తాన్ పూర్ ఓయూ మైక్రోబయాలజీ విభాగంతో పరస్పర అవగాహనా ఒప్పందం చేసుకుంది. ఈ అవగాహనా ఒప్పందం ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, స్కాలర్‌షిప్‌లు, నైపుణ్యాభివృద్ధికి శిక్షణ, సామర్థ్య పెంపుదలలో ఉపాధిని పెంపొందించడానికి సహాయపడనుంది. ఓయూలోని మైక్రో బయాలజీ విభాగంలో పరిశోధన, అభివృద్ధి కోసం నిధులతో పాటు లాజిస్టిక్స్ అందించేందుకు తాము మద్దతుగా నిలుస్తామని ఎంఒయూపై సంతకం సందర్భంగా బయో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.ఆర్.కె. రెడ్డి, డైరెక్టర్ కె.శ్రీవర్షిత అన్నారు. 1974లో స్థాపించబడిన ఓయూలోని మైక్రోబయాలజీ విభాగం ఈ రంగంలో ప్రముఖ విభాగాల్లో ఒకటి. లైఫ్ సైన్స్ పరిశోధనలతో పాటు విద్య, జాతీయ నిధుల ఏజెన్సీలు, పారిశ్రామిక సహకారాల నుంచి అదనపు గ్రాంట్లు అందుకుంటోంది. సూక్ష్మజీవుల ఉత్పత్తులకు చెల్లుబాటు అయ్యే ప్రోటోటైప్‌లను డిపార్ట్‌మెంట్‌లోని ఫ్యాకల్టీ అభివృద్ధి చేశారు. సాంకేతికత బదిలీ కోసం పేటెంట్లు, అనువాద పరిశోధన కోసం అకాడెమియా-ఇండస్ట్రీ ఔట్‌లుక్‌తో పని చేస్తున్నారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొ.పి.లక్ష్మీనారాయణ, ఎంఓయూ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ జి.బి రెడ్డి, ప్రజాసంబంధాల అధికారి ప్రొఫెసర్ ప్యాట్రిక్, మైక్రోబయాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ సందీప్త బూర్గుల, బీఓఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ హమీదా, డిప్యూటీ రిజిస్ట్రార్ యం వి. శారద పాల్గొన్నారు.

జార్జిరెడ్డి ఇంటర్నేషనల్ స్థాయి ఏమినెంట్ రీసెర్చ్ స్కాలర్



నవతెలంగాణ-ఓయూ

విద్యార్థి నేత జార్జిరెడ్డి ఇంటర్నేషనల్ స్థాయి ఏమినెంట్ రీసెర్చ్ స్కాలర్ అని ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) ఓయూ కమిటీ ఆధ్వర్యంలో జార్జిరెడ్డి 51వ వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ స్పోర్ట్స్ లీగ్ 2023ని ప్రారంభిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజ్ రూమ్ నంబర్ 57 లో పీడీఎస్‌యూ ఓయూ అధ్యక్షులు ఎస్.సుమంత్ అధ్యక్షతన ఇనాగరల్ సెషన్ (సదస్సు) నిర్వహించారు. తొలుత జార్జ్ రెడ్డి చిత్రపటానికి పూలతో నివాళులు అర్పించారు. అనంతరం జార్జి రెడ్డి జీవితం - ప్రాసంగికత అనే అంశం పై ఉపన్యాస పోటీలను జార్జి రెడ్డి జీవితం సమకాలీన ఆవశ్యకత అనే అంశం పై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల సందర్భంగా జడ్జిమెంట్ ప్యానల్ గా ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొ.చింతా గణేష్, అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొండా నాగేశ్వర రావు, ఓయూ బిజినెస్ మేనేజ్మెంట్ ప్రొఫెసర్ సమున్నత, ఓయూ జువాలజీ ప్రొ.ఆమంచి నాగేశ్వర రావు వ్యవహరించి మాట్లాడారు. జార్జిరెడ్డి ఆదర్శనీయమైన ఉద్యమకారుడు మాత్రమే కాక ఏమినేంట్ రీసెర్చ్ స్కాలర్ అని కొనియాడారు. జార్జిరెడ్డి నాడు సాగించిన పోరాట వారసత్వాన్ని నేటి విద్యార్థులు కొనసాగిస్తుండటం అభినందనీయమన్నారు. జార్జిరెడ్డి జీవించి ఉంటే నోబుల్ పురస్కారం పొందేవారని చెప్పారు. జార్జిరెడ్డి తార్కిక జ్ఞానం ముందు నిలవలేని ఆధిపత్య శక్తులు జార్జిరెడ్డిని భౌతిక నిర్మూలన చేయాలనే కుట్ర పన్నారన్నారు. పీడీఎస్‌యూ జాతీయ నేత ఎస్.నాగేశ్వర రావు, రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ, ఓయూ ప్రధాన కార్యదర్శి కె.స్వాతి, పీవైఎల్ జిల్లా నాయకులు రవి మాట్లాడుతూ జార్జిరెడ్డి పోరాట స్ఫూర్తితో దేశంలో పెరిగిపోతున్న మతోన్మాద భావజాలంపై సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నాటి ఛాందసవాద ప్రతినిధులే నేడు దేశంలో అధికారం చెలాయిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఓయూ నాయకులు రుక్మత్ పాషా, కోరి, ప్రశాంత్, అంజి, రాము, భువన, శ్రీవాణి, భవాని, సాయికుమార్, అంజి, చందు, అశోక్, వినీల్, మారుతి, రాము, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బంది వేతనాలు పెంచాలి



నవతెలంగాణ-అడిక్‌మెట్

మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బంది వేతనాలు పెంచి సకాలంలో చెల్లించాలి అని ఐఎఫ్‌టీయూ ప్రొగ్రెసివ్ మోడల్ స్కూల్ హాస్టల్ ఎప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎల్ పద్మ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్రంలో కొనసాగుతున్న 175 మోడల్ స్కూల్ ఆంగ్ల మాధ్యమంతో నడుస్తున్న పాఠశాలలు, వీటి అనుబంధ హాస్టల్ సిబ్బంది సమస్యలపై విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎస్-ఎల్ మాట్లాడుతూ మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బందికి వేతనాలను ప్రతినెలా 5వ తేదీ లోపు చెల్లించాలనీ, బేసిక్‌లోకి తీసుకువచ్చి వేతనాలు పెంచాలనీ, గుర్తింపు కార్డు ఇవ్వాలనీ, మెడికల్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలనీ, ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయాలనీ, వీక్లీ ఆఫ్స్ అమలు చేయాలనీ, తగినన్ని వంట పాత్రలను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బంది పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందనీ, హాస్టల్ విద్యార్థినులకు ఆసుపత్రి అవసరాలు ఏర్పడితే రవాణా సౌకర్యం లేదనీ, అందుకు ఆటోని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 1000 మంది పని చేస్తున్న సిబ్బందికి పని భారం పెరిగి, వేతనాలు సకాలంలో రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేజీబీవీ ఉద్యోగులతో సమానంగా జాబ్ చార్టు ప్రకటించాలనీ, 24 గంటల పని దినాన్ని మార్పు చేసి 8 గంటలు అమలు చేయాలనీ, మెటర్నిటీ లీవ్ కొనసాగించాలని కోరారు. తమ డిమాండల సాధన కోసం 24న కలెక్టర్‌లకు వినతి పత్రం అందజేసి అనంతరం చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో సుల్తానా, లలిత, అరుణ, సునీత, భాగ్యమ్మ, మాధవి, లలితా రాణి, రేనమ్మ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



ఉస్మానియా విశ్వవిద్యాలయం సీఎఫ్ఆర్‌డీ నూతన డైరెక్టర్ ప్రొ.సందీప్త బూర్గుల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెంటర్ ఔనత్యాన్ని పెంపొందించనున్నట్లు ఆమె చెప్పారు. పలువురు సందీప్తకు శుభాకాంక్షలు తెలిపారు. నవతెలంగాణ-ఓయూ



'రైఫిల్, పిస్టల్ స్లింగ్‌షాట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులకు పతకాలు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

8వ జాతీయ రైఫిల్, పిస్టల్ స్లింగ్‌షాట్ ఛాంపియన్‌షిప్-2023, ఎయిర్‌గన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, స్లింగ్‌షాట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ లవ్ కుమార్ రూదవ్, మదన్ బాదోర్, రాజేష్ చౌహాన్ ఆధ్వర్యంలో ఈ ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు.ఎయిర్‌గన్ నేషనల్-2023లో జాతీయ పోటీల్లో 15 రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు. వీటిలో కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, పాండిచ్చేరి, పూణే, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ నుంచి చాలా మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్ 14, 10, 16, 18, 20, 25 సెకండ్ 25 పైన ఓపెన్ కేటగిరీలుగానూ అందులో వ్యక్తిగత, డబుల్, మిక్స్ గా డివైడ్ చేశారు. పీసీపీ ఎయిర్ రైఫిల్, పీసీపీ ఎయిర్ పిస్టల్, బ్రేక్ బ్యారల్ గన్, స్లింగ్ షాట్ కేటగిరీలు నిర్వహించారు. ఇందులో తెలంగాణ సైతం ఒక్కటి అవడం విశేషం. తెలంగాణ నుంచి ఎయిర్ గన్ షూటర్లు క్రీడాకారులు అండర్ 10- రజత పతకం, 12-వెండి పతకం, అండర్ 14-బంగారు పతకం, 16-బంగారు పతకం, 18 -వెండి పతకం, 25-వెండి పతకం, కాంస్య పతకం, స్లింగ్ షాట్ షూటర్లు క్రీడాకారులు 25-బంగారు, 25 పైన ఓపెన్ -రజత పతకాలు గెలుపొందారు.ఈ సందర్భంగా తెలంగాణ ఎయిర్‌గన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ భువనేశ్వరి మాట్లాడుతూ తమ క్రీడాకారులు ఇన్ని పతకాలు గెలవడం గర్వంగా ఉందన్నారు. పోటీ గట్టిగా ఉన్నప్పటికి క్రీడాకారులు చాలా ప్రశాంతంగా అడి పతకాలు గెలిచారని తెలిపారు. తెలంగాణ క్రీడాకారులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని కోరారు. సాయి హన్సిక చక్రత్ 8వ జాతీయ రైఫిల్ పిస్టల్, స్లింగ్‌షాట్ ఛాంపియన్‌షిప్-2023లో ఎయిర్‌గన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ విభాగంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని, అండర్ 15, పిసిపి ఎయిర్‌రైఫిల్-ఇండివిజువల్‌లో గోల్డ్ మెడల్ సాధించినట్టు తెలిపారు. చైల్డ్ ఆర్టిస్ట్ సాయి హన్సిక సినిమాల్లో నటించడం, సినిమా మోడల్‌గా ఇంటర్నేషనల్ స్టేజ్ పై ర్యాంప్ వాక్ చేయడం, సేవా కార్యక్రమాలు చేయడమే కాకుండా క్రీడా రంగంలో తన సత్తా చాటి ఒలింపిక్ గేమ్స్‌లో సైతం స్థానం సంపాదించడం అభినందనీయమన్నారు. హన్సిక కోచ్ గుగ్లావత్ సురేందర్ మాట్లాడుతూ ఈ పోటీల్లో బంగారు పతకం గెలవడం చాలా గర్వంగా ఉందన్నారు.

125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు దేశ చరిత్రలో మైలురాయి



నవతెలంగాణ-బంజారాహిల్స్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహ ఏర్పాటు దేశ చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిపోతుందని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం అన్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని ఓ హెూటల్ లో భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందాం ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, విద్యార్థి ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. భారతదేశ సామాజిక ఆర్థిక అసమానతలపై తీవ్రంగా అధ్యయనం చేసిన అంబేద్కర్ ఈ గడ్డపై జన్మించిన ప్రతి ఒక్కరూ సమాన హక్కులతో జీవించాలని లక్ష్యంతో రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. అంతటి ప్రాముఖ్యత ఉన్న రాజ్యాంగాన్ని దేశాన్ని పాలిస్తున్న ప్రధాని గౌరవించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయానికి అంబేద్కర్ పేరును నామకరణం చేయడంతోపాటు దేశంలోనే ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనందం అన్నారు. అవినీతిపై ప్రశ్నిస్తున్న వారిపై ప్రధాని నరేంద్ర మోడీ రాజ్యాంగ బద్ధ సంస్థలైన ఈడీ, సీబీఐ, ఐటీలను ఉసిగొలుకుతున్నారన్నారు. గుజరాతీయులకు దేశ సంపదను దోచిపెడుతున్నారని మండిపడ్డారు. అమిత్ షా బినామీ అదానీ అని దేశ సంపదను దోచుకుంటున్నట్టు చెప్పారు. అదానీ తన సంపదలో బీజేపీకి 30శాతం ఇస్తున్నారని చెప్పారు. జాతీయస్థాయిలో బీజేపీ చేస్తున్న అరాచకాలపై మాట్లాడినందుకు రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడం సరికాదన్నారు. నరేంద్ర మోడీ దేశానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి దేశాన్ని దోచుకుంటున్నది గుజరాత్ పెట్టుబడుదారులే అని విమర్శించారు. నిత్యం హిందువులు, హిందూయిజం గురించి మాట్లాడే బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వం నాయకులు తిరుమల తిరుపతి దేవస్థానం హుండీ ఆదాయంపై ఐటీ నోటిఫికేషన్ పంపించిన ఘనత ప్రధాని మోదీదని అన్నారు. ఈ కార్యక్రమంలో భారత్ ప్రయివేటు ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు గంధం రాములు, ఎంబీసీ సంచార జాతుల రాష్ట్ర అధ్యక్షులు కోలా శ్రీనివాస్, తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి సురేందర్ సన్నీ, డాక్టర్ బానోతు సంజీవ్ నాయక్, డాక్టర్ రవీందర్ నాయక్, జగ్జివన్, అంబేద్కర్ జయంతోత్సవాల వైస్ చైర్మన్ రాజలింగం, అఖిల భారత ఒడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎత్తారి మారయ్య రామకృష్ణ, తెలంగాణ ఉప్పెర సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు అప్పెర శేఖర్ సాగర్, ఇంటర్ నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కట్ట రవికుమార్ గుప్తా, పద్మశాలి మహిళా సంఘం అధ్యక్షులు చింతకింది అనురాధ, తదితరులు పాల్గొన్నారు..

16న పెట్టుబడిదారుల సదస్సు-2023



నవతెలంగాణ-సిటీబ్యూరో

నైమిషా బిజినెస్ క్లబ్ ఆధ్వర్యంలో తొలిసారిగా ఈ నెల 16వ తేదీన ఎగ్జిబిషన్ సెంటర్‌లో వ్యాపార సదస్సు 2023 నిర్వహించనున్నారు. దేశంలోనే తొలిసారిగా ఈ తరహా సదస్సును ఇక్కడ నిర్వహిస్తున్నారు. అంకుర సంస్థల నిర్వాహకులకు అవసరమైన నిధుల సేకరణ, పెట్టుబడులతోపాటు, ప్రముఖులైన మార్గదర్శకుల నేతృత్వంలోని అన్ని విధాలుగా ఉపయోగపడే రీతిలో ఈ సదస్సును ఏర్పాటు చేస్తున్నారు. ఈ సదస్సులో అక్కడికక్కడే ఒప్పందాలు సైతం జరిగే అవకాశాలను కల్పిస్తున్నారు. సదస్సులో అంకుర సంస్థల వ్యవస్థాపకులకు, పెట్టుబడిదారులతో ఒకరితో ఒకరు సమావేశాలు నిర్వహించుకోవడానికి, విజయవంతమైన స్టార్టప్‌ల వ్యవస్థాపకుల కృషిని, వారు పడిన కష్టాలను వినడానికి అవకాశం కల్పిస్తుంది. ప్రమోటర్లు, వ్యాపార నాయకులు, యువ పారిశ్రామికవేత్తలు, మహిళా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారుల కోసం అవసరమైన ముందస్తు పెట్టుబడి సమాచారం, వ్యాపార ప్రణాళికలను ఇక్కడ రూపొందిస్తారు. ఈ సందర్భంగా నైమిషా బిజినెస్ క్లబ్ మేనేజింగ్ డైరెక్టర్ కెవిఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ "మార్కెట్ డిమాండ్, వ్యాపారస్థుల కోసం 30శాతం పైన లాభాల ఉన్న వాటిపై అవగాహన కలిపిస్తాం "భారత ప్రభుత్వం కూడా భారీ రాయితీని అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనిత్, సుధాకర్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. రిజిస్ట్రేషన్‌ల కోసం బిజినెస్ క్లబ్ వెబ్‌సైట్ www.nimishabusinessclub.comని సందర్శించండి అని తెలిపారు. మిగతా వివరాల కోసం 8121218888, 7036466161, 9666985599, 08836661333 ఈ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

30లోపు ఆస్తి పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ



నవతెలంగాణ-అడిక్‌మెట్

ఆస్తి పన్ను ముందస్తుగా ఈ నెల 30వ తేదీ లోపు చెల్లిస్తే ఎర్లీ బర్డ్ కింద ఐదు శాతం రాయితీ కల్పిస్తామని జీహెచ్ఎంసీ ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని రామ్‌నగర్, అడిక్‌మెట్‌లో ఆస్తి పన్ను చెల్లింపుపై ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య మాట్లాడుతూ ముందుగా ఆస్తి పన్నును వసూలు చేసేందుకు గాను జీహెచ్ఎంసీ ప్రవేశ పెట్టిన ఎర్లీ బర్డ్ పథకం ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎర్లీ బర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఐదు శాతం రాయితీతో పన్ను చెల్లించుకోండి అని కోరారు. 2021 22 మధ్య ముషీరాబాద్ ఆస్తి పన్ను చెల్లింపు రూ.38 కోట్ల 41 లక్షల టార్గెట్ ఉండగా రూ.29 కోట్ల 56 లక్షలు వసూలైనట్టు తెలిపారు. 2022 23 మధ్య రూ.42 కోట్ల టార్గెట్ ఉండగా రూ.39 కోట్ల 32 లక్షలు వసూలు చేశామని తెలిపారు. గత వార్షిక సంవత్సరంతో పోలిస్తే ఈ సారి రూ.10 కోట్లు ఎక్కువగా వసూలు చేశామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించి జీహెచ్ఎంసీకి సహకరించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ రాము, తదితరులు పాల్గొన్నారు.

2023 క్యూ1లో పోకో ఇండియా బెస్ట్ సెల్లింగ్ బ్రాండ్

నవతెలంగాణ-హైదరాబాద్

పోకో ఇండియాలో అగ్రస్థానంలో ఉన్న వినియోగదారు సాంకేతిక బ్రాండ్లో ఒకటి. ది 2023 మొదటి త్రైమాసికానికి ఫ్లిప్కార్ట్ పైన అధికంగా-విక్రయం కలిగిన స్మార్ట్ఫోన్ బ్రాండ్గా వచ్చిందని ప్రకటించింది. ఈసందర్భంగా పోకో ఇండియా కంట్రీ హెడ్ హిమాన్షు టాండన్ మాట్లాడుతూ... ఈ అనుకూలమైన ప్రతిస్పందనతో తాము చాలా ఆనందంగా ఉన్నామన్నారు. క్యూ1 2023లో ఫ్లిప్కార్ట్ పైన అధిక-అమ్మకాలు కలిగిన స్మార్ట్ఫోన్ బ్రాండ్గా అగ్రస్థానం పొందినందుకు చాలా ఉత్సాహంగా ఉన్నామన్నారు. తాము వివిధ ధరల బకెట్స్ వద్ద అధిక-నాణ్యత ఉన్న స్మార్ట్ఫోన్స్ అందించడాన్ని కొనసాగిస్తుండగా ఈ విజయం తమ ఉత్పత్తులపైన వినియోగదారులకు ఉన్న నమ్మకానికి, విశ్వాసానికి ఒక టెస్టిమెంట్. వీగిపోని వారి మద్దతుకు తాము తమ వినియోగదారులకు తమ కృతజ్ఞతను అందిస్తున్నామని తెలిపారు.

ఈర్ల చెరువును సందర్శించిన మేయర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

శేరిలింగంపల్లి జోన్ హఫీజ్ పేట్ డివిజన్‌లోని ఈర్ల చెరువును సోమవారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సందర్శించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి పాల్గొన్నారు. 2022లో ఈర్ల చెరువును నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దత్తత తీసుకున్న విషయం విదితమే. నగర మేయర్ ఆదేశాల మేరకు చందానగర్ ఈఈ ఆధ్వర్యంలో ఈర్ల చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పార్కు డెవలప్‌మెంట్ పూర్తి స్థాయిలో చేపట్టారు. అంతే కాకుండా చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించారు. చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామని మేయర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో హఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజిత, మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్, ఈఈ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

లోన్ చెల్లింపులను పటిష్టం చేసిన అమేజాన్ పే

నవతెలంగాణ - హైదరాబాద్

కస్టమర్ అనుభవం మరియు భద్రతను పెంచడానికి తమ నిరంతర ప్రయత్నాలలో భాగంగా, అమేజాన్ పే భారత్ బిల్ పే సహకారంతో తమ లోన్ చెల్లింపు శ్రేణిని మరింత శక్తివంతం చేసింది. లోన్ చెల్లింపు శ్రేణి అనేది విద్యుచ్ఛక్తి మరియు మున్సిపల్ పన్ను వంటి ఇతర ఆప్షన్స్ లో బిల్లు చెల్లింపులో ప్రముఖ శ్రేణిలలో ఒకటిగా ఉంది. ఈ శ్రేణి బ్యాంక్స్, మైక్రో ఫైనాన్స్ సంస్థలు, ఎన్ బీఎఫ్‌సీలు ద్వారా తమ లోన్స్ ను పొంది మరియు తమ ఈఎంఐలను సకాలంలో చెల్లించడానికి సౌకర్యవంతమైన చెల్లింపు ఎంపిక అవసరమైన కస్టమర్స్ కోసం లోన్ చెల్లింపు ఆప్షన్‌ను సమన్వయం చేస్తుంది. ఇంకా, ఈఎంఐ తీసివేతలకు అదనంగా తమ లోన్స్‌ను ముందస్తుగా చెల్లించడానికి కస్టమర్స్ తోడ్పాటు అందించగలరు. ఈ శ్రేణి బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్, చోళ మండలం ఇన్వెస్ట్ మెంట్ - ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, హెచ్ డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, హెూమ్ క్రెడిట్, మరియు ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ సహా, 200+కి పైగా రుణదాతలతో అనుసంధానం చెందింది. దీనిని పొందడానికి, కస్టమర్స్ అమేజన్‌పే విభాగాన్ని సందర్శించవచ్చు మరియు లోన్ రీపేమెంట్ ఆప్షన్ పై క్లిక్ చేయవచ్చు. ప్రత్యామ్నాయంగా, వారు 'అమేజన్ పే' హెూమ్ స్క్రీన్ పై లభించే 'పే బిల్స్' ఆప్షన్ పై సులభంగా క్లిక్ చేయవచ్చు మరియు తదుపరి నిరంతరంగా తమ ఈఎంఐలను చెల్లించడానికి లోన్ రీపేమెంట్ ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు.

ఆటో యూనియన్ కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పకు చెందిన 50 మంది ఆటో యూనియన్ కార్మికులకు సోమవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తన నివాసం వద్ద గట్టు అశోక్ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎత్తారి మారయ్య, రాజు నాయక్, బుజేందర్, అనిల్ కొమురయ్య యాదవ్, యాదగిరి, రాజేష్, శ్రీను కరీం తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం శ్మశాన వాటికను అభివృద్ధి చేస్తా

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



సుభాష్‌నగర్ 130 డివిజన్, సూరారం 60 గజాల్లోని ముస్లిం శ్మశాన వాటికకు నిధులు మంజూరైన సందర్భంగా సోమవారం శ్మశాన వాటికను సందర్శించి, మరమ్మతులను పరిశీలించి, చేయాల్సిన పనులను అతి త్వరలో చేపిస్తానని, సుభాష్‌నగర్ 130 డివిజన్ మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి ముస్లిం సోదరులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ సురేందర్ నాయక్, ముస్లిం మత పెద్దలు, సోదరులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బీజేపీకి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



బీజేపీకి బుద్ధి చెప్పే రోజులు దగ్గరల్లోనే ఉన్నాయని రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా సోమవారం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వైఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో స్థానిక కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన డివిజన్ కార్యకర్తల సమావేశానికి ఆయనతోపాటు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం కోసం అడ్డదారులు తొక్కుతూ అసత్య ప్రచారం చేస్తున్న బీజేపీకి ప్రజలే తగిన గుణపాఠం నేర్పుతారన్నారు. రాష్ట్ర పర్యటనలో ప్రధాని మోదీ పచ్చి అబద్ధాలు చెప్పారన్నారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దూసుకెళ్తుంటే.. బీజేపీ నేతలు అక్కసుతో మాట్లాడుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారనే అక్కసుతో బీజేపీ అనేక కుట్రలకు దారి తీస్తుందనీ, అలాంటి ప్రయత్నాలను ఎక్కడికక్కడ ఎండగట్టాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన ఇన్నేండ్లలో పేపర్ లీక్ ఎన్నడూ జరగలేదనీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పేపర్ లీక్‌లో అడ్డంగా దొరికి నిందను ప్రభుత్వంపై తోయాలని చూస్తున్నాడన్నారు. బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే దమ్ము లేక పేపర్ లీక్‌లు చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌తో పోటీ పడాలంటే తెలంగాణ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయాలన్నారు. దేశ సంపదను అదానీకి అంటగడుతున్న వారు బీజేపీ నేతలు అన్నారు. దేశ రాజకీయాలను మలుపుతిప్పే సత్తా గులాబీ జెండాకే ఉన్నదన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. రాబోయే రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, ప్రధాన కార్యదర్శి జి.సుధాకర్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పేదలు జీవో 58,59ను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-మేడ్చల్

పేద ప్రజలు జీవో 58,59ను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం మేడ్చల్ ఎంపీడీవో కార్యాలయంలో 58,59 జీవో కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంత్రి పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేడ్చల్ మండలానికి చెందిన 134, మున్సిపాలిటీకి చెందిన 21మంది లబ్ధిదారులకు పట్టా సర్టిఫికేట్లను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ పేద ప్రజలకు ఇండ్ల పట్టాలు అందజేయాలనే ఉద్దేశంతోనే జీవో 58,58ను తీసుకువచ్చారన్నారు. ఈ జీవోను మరో నెల రోజుల గడువు సీఎం కేసీఆర్ పెంచారనీ, ఈ అవకాశాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 60 నుంచి 120 గజాలు ఉన్న వారికి గృహలక్ష్మీ పథకం ద్వారా రూ.3లక్షలు ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జడ్పీటీసీ శైలజ విజయానందా రెడ్డి, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు నందారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మర్రి దీపికా నర్సింహా రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేష్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దయానంద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాల ఏర్పాటుకు కృషి చేయాలి



నవతెలంగాణ-మేడ్చల్

స్వచ్ఛ గ్రామాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని స్వచ్ఛ భారత్ మిషన్ అధికారి శ్రవణ్ కుమార్ అన్నారు. సోమవారం మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడమే లక్ష్యంగా స్వచ్ఛ భారత్ మిషన్ ఫేజ్-2 కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. శిక్షణలో భాగంగా గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధం, తడి చెత్త, పొడి చెత్త, మురుగునీరు, భూగర్భజలాల నిర్వహణ వంటి పలు అంశాలపైన శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వీర్లపల్లి రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ విజయానందరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీఓ ఉమాదేవి, సర్పంచ్‌లు, ఉప సర్పంచులు, ఏపీఎం, పంచాయతీ కార్యదర్శులు, ఎస్బీఎం ఎమ్ఐఎస్ రాంనారాయణ, ఎన్ఆర్ జీఎస్ ఈసీ సూర్య, జయంత్, వీవోఏలు, తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా గోవర్ధన్ రెడ్డి గెలుపు



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలను శనివారం నిర్వహించారు. హెూరా హెూరీగా జరిగిన ఈ ఎన్నికల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా గోవర్ధన్ రెడ్డి తన సమీప ప్రత్యర్థి నవనీతరావుపై 34 ఓట్ల తో గెలుపొందారు. గోవర్ధన్ రెడ్డికి 155 ఓట్లు పోలు కాగా నవనీత్ రావుకు 121 ఓట్లు వచ్చాయి. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ సభ్యుల అభ్యున్నతికి పాటుపడుతూ ఇచ్చిన హామీలను అమలు పరిచేలా కృషి చేస్తానన్నారు. కైతలాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న కోర్టు భవన నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా మల్లేష్, జనరల్ సెక్రెటరీగా టి.రమేష్, జాయింట్ సెక్రెటరీగా హరిశంకర్ రెడ్డి, ట్రెజరర్‌గా రాజు, లైబ్రరీ సెక్రెటరీగా హర్షవర్ధన్ రెడ్డి, స్పోర్ట్స్, కల్చర్ సెక్రెటరీగా మధుసూదన్ ఎంపికైనట్టు ఎలక్షన్ అధికారులు వెల్లడించారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు ఏడాది పాటు వారి పదవుల్లో కొనసాగనున్నట్టు వెల్లడించారు.

అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం మూసాపేట్‌లోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పనులు ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మూసాపేట డివిజన్‌లో వందల కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. ఎంపీగా గెలిచిన రేవంత్ రెడ్డి ఎటు వెళ్ళాడో అనీ, గెలిపిస్తే అన్నీ ఉచితంగా ఇస్తా అన్న బీజేపీ ఏమైందిని ప్రశ్నించారు. దళితబంధును పార్టీలకు అతీతంగా అందించామని గుర్తు చేశారు. అంబేద్కర్ పేరును పార్లమెంట్ కూడా పెట్టాలని డిమాండ్ చేశారు. మూసాపేట్‌లో రోడ్లు, డ్రయినేజీ నాళాల అభివృద్ధి వందల కోట్లతో జరిగిందనీ, దీనంతటినీ ప్రజలు గమనించాలన్నారు. జరుగుతున్న అభివృద్ధిని ప్రతి ఒక్కరికీ తెలిసేలా చేయాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అత్యధికంగా మూసాపేట్ డివిజన్‌లో ఆసరా పింఛన్లు అందించినట్టు తెలిపారు. ప్రాంతం ఏదైనా సరే అందరూ మన బిడ్డల్లాగే చూసుకుంటున్నామన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా నివసించే శ్రీకాకుళం, ఒరిస్సా ప్రాంతవాసులకు అన్ని సౌకర్యాలు కల్పించామనీ, ఏదైనా ఇబ్బంది ఉంటే సమస్యను పరిష్కరించి వారికి అండగా ఉంటామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఐడీపీఎల్ స్థలం కేటాయిస్తే ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూమ్ కేటాయించే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్, పగుడాల బాబురావు, నరేంద్ర చారి, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, ప్రభాకర్ గౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పాఠ్యాంశాలుగా మార్చాలని వినతి

నవతెలంగాణ-దుండిగల్



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని విద్యార్థులకు బోధించేందుకు పాఠ్యాంశాలకు మార్చాలని జై భీమ్ మహాసేన మానవ హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు ఎం.అంజన్న కోరారు. సోమవారం జై భీమ్ మహాసేన మానవ హక్కుల పరిరక్షణ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లి పరిధిలోని ఇందిరమ్మ కాలనీ నుంచి పాదయాత్రగా డప్పు చప్పులతో బహదూర్ పల్లి చౌరస్తా మీదుగా గండి మైసమ్మ పరిధిలోని దుండిగల్ మండల కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ పి.పద్మప్రియ, డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జై భీమ్ మహాసేన మానవ హక్కుల పరిరక్షణ నాయకులు మాట్లాడుతూ మన రాజ్యాంగం మన దేశంలోనే కాకుండా దేశ విదేశాల్లో సైతం కీర్తి ప్రఖ్యాతలు పొందిందనీ, ఆ రాజ్యాంగంను మనదేశంలో విద్యార్థులకు పాఠ్యాంశాల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు మార్చాలని కోరారు. ఇలా చేస్తే యువతీ యువకులకు రాజ్యాంగ స్ఫూర్తి మరింత దోహద పడుతుందని తెలిపారు. భావిభారత పౌరులకు మరింత స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జెఎంఎంపీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు (డాన్ శ్రీను) సహాయక కార్యదర్శి కె.ఈశ్వర్, సలహాదారుడు వై.ప్రభుదాస్, మహిళ మహిళా విభాగం జి.లలిత, ఉపాధ్యక్షులు మోహన్ రావు, కోశాధికారి వి.శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు జ్యోతి జాన్సన్, సరోజన, మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింల పక్షపాతి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింల పక్షపాతి అని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. రంజాన్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం నిరుపేదలకు అందజేస్తున్న దుస్తులను జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి రాజీవ్ గృహకల్ప కాలనీలో నిరుపేద ముస్లింలకు ఆయన సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు ముస్లింలను పట్టించుకోలేదనీ, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లింల కండ్లల్లో ఎంతో సంతోషం కనబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సయ్యిద్ రషీద్, రాజీవ్ గృహకల్ప కాలనీ మాజీ అధ్యక్షులు గంగా సంతోష్ కుమార్, ప్రభాకర్, స్థానిక నాయకులు హమ్మద్ రంజాన్, అబ్దుల్ షహీద్, మజీద్, మోయిన్, లతీఫ్, నర్సింహారెడ్డి, నాని, డివిజన్ యువజన విభాగం అధ్యక్షులు రాయి, విఘ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ రికార్డ్ హెూల్డర్ తో కాలేజ్ దేఖో అడుగులు

నవతెలంగాణ - హైదరాబాద్

భారతదేశంలోనే అతిపెద్ద ఉన్నత విద్యా మార్గదర్శకత్వం, బలమైన సంస్థగా ఎదిగిన కాలేజ్ దేఖో స్థిరమైన సామర్థ్యం గురించి అవగాహన కల్పించే డ్రైవ్‌కు మద్దతు ఇస్తుంది. విద్యార్థులకు మంచి భవిష్యత్తును ఇవ్వాలనే ఈ ప్రయత్నంలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హెూల్డర్ సుశీల్ రెడ్డికి కాలేజ్ దేఖో మద్దతు ఇస్తోంది. ఎలక్ట్రిక్ వాహనంపై కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 5000 కిలోమీటర్లు ప్రయాణం సాగిస్తున్నారు. ఈ ప్రయాణంలో దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులతో ఆయన మాట్లాడుతున్నారు. అలాగే సుశీల్ రెడ్డి కొందరు ప్రముఖులను కలుసుకున్నారు. హైదరాబాద్‌లోని ఐఐటీ-హైదరాబాద్, బిట్స్-పిలానీ, ఐఐటీ, ఐఐహెచ్ఎం వంటి కళాశాలల్లో ఆయన సెమినార్లు నిర్వహించారు. తన అనుభవాన్ని పంచుకోవడం, ఈ-మొబిలిటీ యొక్క ప్రాముఖ్యత, స్థిరమైనదానిని ఎంచుకోవడంపై ఆయన మాట్లాడారు. ఈ క్రమంలో కాలేజ్ దేఖో, సుశీల్ రెడ్డికి పూర్తి సపోర్ట్ అందిస్తుంది.

వైద్యం వికటించి యువకుడు మృతి

మేడ్చల్ పట్టణంలోని ప్రజ్ఞా హాస్పిటల్‌లో ఘటన



నవతెలంగాణ-మేడ్చల్

వైద్యం వికటించి యువకుడు మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువుల వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలోని కింది బస్తీకి చెందిన నవీన్ (30) నాలుగురోజుల క్రితం కడుపులో నొప్పి వస్తుందని చికిత్స నిమిత్తం మేడ్చల్ పట్టణంలోని ప్రజ్ఞ హాస్పిటల్‌లో చేరాడు. సోమవారం సాయంత్రం వైద్యం వికటించి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల, బంధువుల ఆర్తనాదాలతో హాస్పిటల్ అవరణం మిన్నంటింది. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు హాస్పిటల్ ప్రాంగణం వద్దకు పెద్ద ఎత్తున చేరుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మేడ్చల్‌లోని ప్రజ్ఞ ఆస్పత్రిపై ఉన్నత వైద్యాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

సియాఓమి ఇండియా భారీ ఆఫర్లు

నవతెలంగాణ - హైదరాబాద్

సియాఓమి ఇండియా, దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న స్మార్ట్‌ఫోన్ మరియు స్మార్ట్ టివి బ్రాండ్. నేడు "సియాఓమి అభిమాన పండుగ 2023"ని ప్రకటించింది. 6 ఏప్రిల్ మొదలుకొని 11 ఏప్రిల్ 2023 వరకు ఎంఐ.కం అంతటా ఉండే వార్షిక విక్రయం ప్రారంభమౌతుంది. ఈ ఆరు-రోజుల షాపింగ్ బొనాంజా సమయంలో, వినియోగదారులు ఆకర్షనీయమైన తగ్గింపులు, మార్పిడి మరియు బ్యాంక్ ఆఫర్స్, మరియు వారి పాత పరికరాలకి మంచి మార్పిడి విలువని పొందవచ్చు. స్మార్ట్‌ఫోన్స్, స్మార్ట్ టెలివిషన్స్, స్మార్ట్ హెూమ్, మరియు ఏ టూ టీ పర్యావరణ వర్గాలంతటా ఉన్న సియోఓమి, రెడ్‌మి ఉత్పత్తులన్నింటి మీద ఆఫర్స్ అందుబాటులో ఉన్నాయి.

బీఆర్ఎస్‌లోకి నిమ్మల కిరణ్ గౌడ్



నవతెలంగాణ-బాలానగర్

ఉద్యమ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమనీ, మరోసారి సీఎం కేసీఆర్ సారథ్యంలో నిరూపితమైందని నిమ్మల కిరణ్ గౌడ్ అన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్, ఫతేనగర్ జంట డివిజన్ల స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఫతేనగర్ డివిజన్ పరిధిలోని తెలంగాణ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలానగర్‌లో బీజేపీలో ఉన్న నిమ్మల కిరణ్ గౌడ్ తన అనుచరులతో కలిసి కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా నిర్మల కిరణ్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులు, విధివిధానాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేసే విధంగా ఎల్లవేళలా తన వంతు కృషి చేస్తానన్నారు.

క్రికెట్ చరిత్రలోనే ఇలాంటి అద్భుతం చూడలేదు



కోల్‌కతా కోచ్

న్యూఢిల్లీ : గుజరాత్ టైటన్స్‌పై ఆఖరి ఐదు బంతుల్లో ఐదు సిక్స్‌లు కొట్టిన రింకూ సింగ్‌పై ప్రశంసలు కురుస్తోంది. ఇదే క్రమంలో ఆ జట్టు కోచ్ చంద్రకాంత్ పండిత్ మాట్లాడుతూ.. తన 43 ఏళ్ల కెరీర్‌లో ఇలాంటి అద్భుతం ఏనాడూ చూడలేదని అన్నాడు. దాదాపు ఓటమి ఖాయం అనుకున్న దశలో ఈ లెఫ్ట్ హ్యాండర్ బ్యాటర్ ఒంటి చేత్తో కోల్‌కతాను గెలిపించాడని పేర్కొన్నాడు. మ్యాచ్ అనంతరం చంద్రకాంత్ పండిత్ ఈ వ్యాఖ్యలు చేశాడు. 'ఇదొక అద్భుతం. అందులో సందేహం లేదు. రింకూ అలా చెలరేగడం ఒక మిరాకిల్. అయితే.. మేము ఆటగాళ్ల నమ్మకాన్ని, రింకూ ఆత్మవిశ్వాసాన్ని ఎన్నడూ తక్కువ అంచనా వేయలేదు. నేను ఎల్లప్పుడూ రింకూతో నువ్వు నా బెస్ట్ ప్లేయర్ అని అంటుంటాను. ఇప్పుడు కూడా అదే మాట చెప్తాను. నిజం చెప్తున్నా.. ఏడు వికెట్లు కోల్పోయిన దశలో తమ జట్టు గెలుస్తుందని ఏ కోచ్ కూడా చెప్పడు. కానీ, టీ20లో ఏ క్షణంలో ఏమైనా జరగొచ్చని మాకు తెలుసు. అందుకని నమ్మకం కోల్పోలేదు. ముఖ్యంగా రింకూ లాంటి ప్లేయర్ క్రీజులో ఉన్నప్పుడు ఓడిపోతామని ఎలా అనుకుంటాం. మూడో సిక్సర్. కవర్స్ దిశగా రింకూ కొట్టిన ఆ సిక్స్ చాలా నచ్చింది. ఫుల్ టాస్ బంతిని రింకూ అద్భుతంగా స్టాండ్స్‌లోకి పంపాడు. మ్యాచ్ సమయంలో మా సీఈఓ వెంకీ మైసూర్ స్టేడియంలోనే ఉన్నాడు. అతను చాలా సంతోషించాడు. ఫ్రాంచైజీ యజమానులు జై మెహతా, జూహీ చావ్లా కిందికి వచ్చి టీమ్ మొత్తాన్ని అభినందించారు. వాళ్ల కళ్లలో ఎంతో సంతోషం కనిపించింది.అని చంద్రకాంత్ తెలిపాడు.

యశ్ దయాల్‌కు నిద్రలేని రాత్రి

గుజరాత్ టైటాన్స్ బౌలర్ యశ్ దయాల్‌కు అరణ్య రోదనే మిగిలింది. కేకేఆర్ బ్యాటర్ రింకూ సింగ్ నిప్పులు చెరిగే బ్యాటింగ్ చేస్తూ వరుసగా సిక్సర్లు కొడుతుంటే.. యశ్‌కు ఏమి చేయాలో పాలు పోలేదు. యశ్ వేసిన చివరి ఓవర్‌లో కేకేఆర్ బ్యాటర్ రింకూ వరుసగా అయిదు సిక్సర్లు కొట్టి సంచలన విజయాన్ని నమోదు చేశాడు. గుడ్‌లెన్త్ బౌల్స్ వేసిన యశ్ దయాల్‌ను నిర్దాక్షిణ్యంగా బాదేశాడు రింకూ. కేకేఆర్ బ్యాటర్ జోరుకు.. దయాల్‌కు అవమానమే మిగిలింది.

ఆర్మగెడాన్ ప్రపంచ చెస్ ఛాంప్ గుకేశ్

బెర్లిన్(రష్యా): ఆసియా, ఓషేనియానియా ఈవెంట్‌లో ఆర్మగెడాన్ ప్రపంచ ఛెస్ ఛాంపియన్‌గా భారత యువ గ్రాండ్‌మాస్టర్ డి గుకేశ్ నిలిచాడు. ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్లో గుకేశ్ ఉజ్బెకిస్తాన్‌కు చెందిన మాజీ ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్ నోడిర్‌బెక్ అబ్దుసత్తోరోవ్‌పై సంచలన విజయం సాధించాడు. గేమ్-లో గుకేశ్ కొంత వెనుకబడ్డా.. ఆ తర్వాత పుంజుకొని తదుపరి గేమ్‌లో విజయం సాధించాడు.

ఇరువురి మధ్య జరిగిన ఆ తర్వాత మ్యాచ్ డ్రా అయ్యింది. నాల్గో గేమ్‌లో గుకేశ్ ప్రత్యర్థిని ఓడించి ఛాంపియన్‌గా నిలిచాడు. వీరిద్దరూ గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన అర్హత పోటీల్లో గెలిచి ప్రధాన టోర్నమెంట్‌కు అర్హత సాధించారు. ఫైనల్ పోటీల్లో 16ఏళ్ల గుకేశ్‌తోపాటు మాజీ ప్రపంచ క్లాసికల్ ఛాంపియన్ వ్లాదిమిర్ క్రామ్నిక్, డానియేల్ దుబోవ్, యాంఇ యు(చైనా) విదిత్ గుజరాతీ, కార్తికేయ మురళీ, పరమ్ మగ్సూద్లూ(ఇరాన్)లో తమ తమ బోర్డులలో గెలిచినా.. విజేతగా గుకేశ్ నిలిచాడు. ఆర్మగెడాన్ గేమ్‌లో తెలుపు పావులతో ఆడే ప్లేయర్‌కు ఐదు నిమిషాలు, నలుపు పావులతో ఆడే ప్లేయర్‌కు నాలుగు నిమిషాలు కేటాయిస్తారు. నలుపు పావులతో ఆడిన గుకేశ్.. ఉజ్బెకిస్తాన్ ప్లేయర్‌ను ఓడించడం విశేషం.



నేటి నుంచి ధాన్యం కొనుగోళ్ళు

సరిహద్దులలో చెక్ పోస్టులు

- రెండు సీజన్లో ధాన్యం కొంటున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
- సీఎంఆర్ లో జాప్యం జరిగితే ఉపేక్షించేది లేదు
- 30లోగా అప్పగించాల్సిందే
- పాత బియ్యం ఇస్తేనే కొత్త ధాన్యం ఇస్తాం
- రాష్ట్రంలో ప్రతి రైస్ మిల్లును సీఎంఆర్ లో భాగాస్వామ్యం చేస్తాం
- తొమ్మిదేండ్లలో ఆరు రేట్లు పెరిగిన ధాన్యం కొనుగోళ్ళ
- మంత్రులు హరీశ్ రావు, గంగుల కమలాకర్, నిరంజన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మంగళవారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని మంత్రులు టి.హరీష్ రావు, గంగుల కమలాకర్, ఎస్.నిరంజన్ రెడ్డిలు ఆదేశించారు. ఇందుకు సంబంధించి జిల్లా స్థాయిలో కలెక్టర్లు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకుని కొనుగోళ్లకు సిద్ధం కావాలని సూచించారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలనీ, ఇందు కోసం 7,100 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వారు తెలిపారు. ఈ క్రమంలో ధాన్యం దిగుబడికి అనుగుణంగా కేంద్రాలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. యాసంగి ధాన్యం కొనుగోలు, సీఎంఆర్ సేకరణపై జిల్లాల అదనపు కలెక్టర్లు, జిల్లా పౌర సరఫరాల అధికారులు, డీఎంలు, ఎఫ్‌సీఐ అధికారులతో సోమవారం బి.ఆర్.కె భవన్‌లో వారు ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్ సింగ్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, పౌర సరఫరాల కమీషనర్ అనీల్ కుమార్, రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగేందర్‌లతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల అడిషనల్ కలెక్టర్లు, జిల్లా పౌర సరఫరాల అధికారులు, డీ.ఎంలు, ఎఫ్.సి.ఐ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ 'దాన్యం కొనుగోళ్లకు కావాల్సిన ఏర్పాట్లను కలెక్టర్లు సిద్ధం చేసుకోవాలి. వచ్చే వారంలో ఈ అంశంపై సమీక్ష నిర్వహిస్తాం. యాసంగి సీజన్ సీఎంఆర్‌ను ఈ నెల 30వ తేదిలోగా మిల్లర్లు నుంచి సేకరించాలి. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. ఇక నుంచి సీఎంఆర్ అప్పగించే విషయంలో ఏ మాత్రం ఆలస్యం జరిగిన ఉపేక్షించబోం. ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న సీఎంఆర్ ని అప్పగించి ఈ సీజన్ సంబంధించి ధాన్యాన్ని తీసుకోవాలి. ఇప్పటి వరకు ఆ ప్రక్రియలో పాల్గొనని మిల్లర్లను కూడా ఈ యాసంగి సీజన్ నుంచి భాగాస్వామ్యం చేస్తాం....' అనిమంత్రులు ప్రకటించారు.

దేశంలో ఆయా రాష్ట్రాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో రెండు సీజన్లలో కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఒక్క తెలంగాణా మాత్రమే అని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. మంగళవారం నుంచి అదనపు కలెక్టర్లు జిల్లా స్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకుని ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని చేయాలని ఆదేశించారు. ధాన్యం నిల్వలకు ఇంటర్మీడియట్ గోడౌన్లను గుర్తించి తగు ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించాలని వారు సూచించారు. ఆరబెట్టిన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకోచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని వారు పేర్కొన్నారు. రాష్ట్రంలో రోజు రోజుకు ధాన్యం దిగుబడి, కొనుగోళ్లు గణనీయంగా పెరుగుతున్నదనీ, 2014-15 లో రూ.3392 కోట్లతో ధాన్యం సేకరిస్తే 2020-21 నాటికి రూ.26,600 కోట్లు అందుకోసం వెచ్చించామని తెలిపారు. తొమ్మిదేండ్లలో ఆరు రెట్లు ధాన్యం కొనుగోళ్లు పెరగ్గా... మిల్లింగ్ సామర్థ్యం రెండు రెట్లు మాత్రమే పెరిగిందని వివరించారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని మిల్లర్ల నుంచి సి.యం.ఆర్ సేకరణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలనీ, ప్రస్తుతం ఉన్న చెక్ పోస్టులను బలోపేతం చేయాలని మంత్రులు ఆదేశించారు. రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా ధాన్యం కొనుగోలు వివరాలను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గిరిజన సంక్షేమ పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లలో క్యాటరింగ్ విధానం రద్దు చేయాలి

జీవో నెంబర్ 60 అమలు చేయాలి
గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్‌కు సీఐటీయూ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన సంక్షేమ పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో క్యాటరింగ్ విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఐటీయూ డిమాండ్ చేసింది. జీవో నెంబర్ 60 అమలు చేసి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రూ.15,600 వేతనం ఇవ్వాలని కోరింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డికి తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్, డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర కార్యదర్శి బి.మధు, రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్, రాష్ట్ర నాయకులు కె.బ్రహ్మచారి, లక్ష్మణ్ నాయక్, జలంధర్, అనురాధ, స్వరూప, లక్ష్మి, జయ, బాలరాజు వినతిపత్రం అందజేశారు. జీవో నెంబర్ 527 అమలు ద్వారా ప్రస్తుతం ఇస్తున్న రూ.12 వేల వేతనం నుంచి రూ.2వేల నుంచి రూ.4 వేల వరకు జీతాలు తగ్గుతాయని ఏడీ దృష్టికి తీసుకెళ్లారు. జీవో నెంబర్ 60 అమలు చేసి రూ.15,600 వేతనం ఇప్పించాలని కోరారు. ఉన్న వేతనాలను తగ్గించాలనే ప్రభుత్వ ఆలోచన కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తుందని వాపోయారు. పెండింగ్‌లోని 21 నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాలో డైలీవేజ్ కార్మికులకు బ్యాంకు అకౌంటు ద్వారా వేతనాలు చెల్లించకుండా వార్డెన్లు, హెచ్ఎంలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనీ, 11 నెలలుగా వేతనాలు చెల్లించటం లేదని ఏడీ దృష్టికి తీసుకెళ్లారు. బ్యాంకు అకౌంట్లో ద్వారా కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించేలా చూడాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పీఎఫ్ జమ చేయకుండా సంబంధిత కాంట్రాక్టర్ అక్రమాలకు పాల్పడుతున్నారనీ, ఏజెన్సీలు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఏడీకి విన్నవించారు. సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు.



ఈ రైడర్స్ ఎవరు?

ప్రభాస్ నటిస్తున్న ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'ప్రాజెక్ట్‌కె'. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రమిది. ప్రస్తుతం సినిమా నిర్మాణ దశలో ఉంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం యూనిక్ ప్రమోషనల్ కాంపెయిన్ ప్రారంభించింది. అందులో భాగంగా ఫ్రమ్ స్క్రాచ్ పేరుతో ప్రీ ప్రొడక్షన్ పనుల వీడియోను విడుదల చేస్తున్నారు.ఎపిసోడ్ వన్- ప్రత్యేకంగా రూపొందించిన చక్రం తయారీని చూపించింది. లేటెస్ట్‌గా సోమవారం ఎపిసోడ్ 2- అసెంబ్లింగ్ ది రైడర్స్‌ని విడుదల చేసారు. రైడర్స్ ఎవరు?, చర్చల తరువాత అది విలన్ ఆర్మీ యూనిఫాం సైన్ అని రివీల్ అవుతుంది. ఇది సినిమాలో అత్యంత ఖరీదైన భాగమని నిర్మాత తెలియజేశారు. ఈ వీడియోతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. దర్శకుడు నాగ్ అశ్విన్ స్క్రిప్ట్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రపంచ స్థాయి నిర్మాణ ప్రమాణాలతో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. టెక్నికల్‌గా ఈ సినిమా మరో లెవల్‌గా ఉండబోతోంది. 50 మెమరబుల్స్ ఇయర్స్ జరుపుకుంటున్న టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ ఈ గోల్డెన్ జూబ్లీ ప్రాజెక్ట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. అశ్విని దత్ నిర్మాత. బాలీవుడ్ నటి దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తుండగా, బిగ్ బి అమితాబ్ బచ్చన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రభాస్ దీంతోపాటు ప్రశాంత్ నీల్‌తో 'సలార్', మారుతి దర్శకత్వంలో ఓ సినిమా, ఓం రౌత్ దర్శకత్వంలో 'ఆదిపురుష్'లోనూ నటిస్తూ బిజీగా ఉన్నారు.

ప్రభాస్

డబుల్ సర్‌ప్రైజ్



పవన్ కళ్యాణ్

పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'వకీల్ సాబ్'. కోర్టు రూమ్ డ్రామా నేపథ్యంలో సాగే కథతో తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 9తో విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా అభిమానులు ట్విట్టర్‌లో చిట్‌చాట్ సెషన్ నిర్వహించారు. ఈ సెషన్‌లో డైరెక్టర్ వేణుశ్రీరామ్ కూడా పాల్గొని, 'వకీల్‌సాబ్' తప్పకుండా రీరిలీజ్ అవుతుందని, అలాగే 'వకీల్‌సాబ్'కి సీక్వెల్‌గా 'వకీల్ సాబ్ 2' కూడా ఉండబోతుందని చెప్పి అందర్నీ సర్‌ప్రైజ్ చేశాడు. ప్రస్తుతం 'వకీల్‌సాబ్ 2' స్క్రిప్ట్ వర్క్ కొనసాగుతుందని తెలిపారు. ఈ డబుల్ ధమాకాలాంటి అప్‌డేట్ తెలుసుకున్న పవర్‌స్టార్ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.

వేణుశ్రీరామ్ దర్శకత్వం వహించిన 'వకీల్‌సాబ్'లో శృతిహాసన్ పవన్‌కళ్యాణ్‌కి జోడీగా నటించగా, అంజలి, నివేదా థామస్, అనన్య నాగళ్ల కీలక పాత్రల్లో నటించారు. ఈ ముగ్గురి చుట్టూ తిరిగే కథాంశంతో చివరి వరకు రక్తికట్టించేలా సాగే వకీల్‌సాబ్‌కు తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. పవన్ కల్యాణ్ ప్రస్తుతం క్రిష్ దర్శకత్వంలో హరిహరవీరమల్లు, సుజిత్ దర్శకత్వంలో ఓజీ, సముద్రఖని డైరెక్షన్‌లో వినోదయ సీతమ్ రీమేక్, హరీష్ శంకర్ డైరెక్షన్‌లో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాల్లో సినిమాల్లో నటిస్తున్నారు.

నవచిత్రం

దుబాయ్‌లో నంది అవార్డులు

తెలంగాణ ప్రభుత్వం సహకారంతో తెలంగాణ ఫిలిం ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో 'టీఎఫ్‌సీసీ నంది అవార్డ్స్ సౌత్ ఇండియా- 2023' వేడుకలు దుబాయ్‌లో ఘనంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు డా.ప్రతాని రామకృష్ణ గౌడ్. ఈ సందర్భంగా దీని బ్రోచర్‌ను సోమవారం ఫిలించాంబర్‌లో రచయిత, ఎంపీ విజయేంద్రప్రసాద్ ఆవిష్కరించారు.



విజయేంద్రప్రసాద్, ఆర్.కె.గౌడ్

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'గత కొన్నేళ్లుగా ఆగిపోయిన నంది అవార్డ్స్‌ని మళ్లీ ప్రతాని రామకృష్ణ ప్రభుత్వ సహకారంతో ఇవ్వడం సంతోషకరం. అయితే తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా తీసే చిత్రాలకు స్పెషల్‌గా నంది అవార్డ్ కేటాయిస్తే బావుంటుంది. అలాగే తెలంగాణలో అద్భుతమైన టూరింగ్ స్పాట్స్ ఉన్నాయి. వాటిని బేస్ చేసుకుని 90 శాతం అక్కడే షూటింగ్ చేసే సినిమాలకు నంది అవార్డ్స్ తో పాటు నగదు ప్రోత్సాహకాలిస్తే మరిన్ని చిత్రాలు రూపొందడంతో పాటు తెలంగాణలో టూరిజం పెరిగే అవకాశం ఉంటుంది' అని అన్నారు.

'ఈ అవార్డ్స్‌కి ప్రభుత్వం నుంచి కచ్చితంగా మంచి సపోర్ట్ లభిస్తుంది. తప్పకుండా ఈ వేడుకని గ్రాండ్ సక్సెస్ చేస్తాం. అలాగే విజయేంద్రప్రసాద్ చెప్పిన విషయాన్ని కచ్చితంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం' అని టియస్ ఐఐసి చైర్మన్ గ్యాదరి బాలమల్లు తెలిపారు .డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, 'దుబాయ్‌లో జరిగే ఈ వేడుకలో దుబాయ్ ప్రిన్స్ చేతుల మీదుగా అవార్డులు ఇవ్వనున్నాం. పరిశ్రమ ప్రముఖులతో కూడిన జ్యూరీ ఎంపిక చేసిన విజేతలకు అవార్డులను అందజేస్తాం. 2021- 22 సంవత్సరంలో విడుదలైన చిత్రాల వాళ్లు అప్లయ్ చేసుకోవచ్చు' అని తెలిపారు.

మగవాళ్ళు పడే బాధలతో సేవ్ ది టైగర్స్

విభిన్నమైన కంటెంట్‌తో తెలుగు ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తున్న డిస్నీ ప్లస్ ఇప్పుడు 'సేవ్ ది టైగర్స్' వంటి మరో మంచి కథతో వస్తోంది. ప్రియదర్శి, అభినవ్ గోమటం, చైతన్యకృష్ణ, పావని, జోర్దార్ సుజాత, దేవయాని ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'సేవ్ ద టైగర్స్'. అంతరించిపోతున్న పులుల్ని, మొగుళ్లని కాపాడుకుందాం అనేది ఉపశీర్షిక.

నటుడుగా మంచి గుర్తింపు తెచ్చుకున్న తేజా కాకుమాను ఈ చిత్రానికి దర్శకుడు. ఆనందో బ్రహ్మ యాత్ర చిత్రాల ఫేమ్ మహి వి రాఘవ, ప్రదీప్ అద్వైతం షో రన్నర్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ వెబ్ సిరీస్ డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో ఈనెల 27 నుంచి స్ట్రీమింగ్ కాబోతోంది.

షో రన్నర్ మహి వి రాఘవ మాట్లాడుతూ, 'ప్రతి ఇంట్లోనూ ఒక కామెడీ స్టోరీ ఉంటుంది. భార్య భర్తల మధ్య ఉండే జోక్ ఎప్పుడు ఫెయిల్ కాదు. ఎవరి యుద్ధం వాళ్ళది. ఒకప్పుడు పెద్దవాళ్ళు చెబితే వినేవారు. ఇప్పుడు భార్య భర్త జాబ్స్ చేయడం వాళ్ళ ఒక డామినేటింగ్ వస్తుంది. అది ఒక సంఘర్షణకు దారి తీస్తుంది. మా సిరీస్ ఖచ్చితంగా అందరు చూసేలా ఉంటుంది. ముఖ్యంగా కుటుంబాల్లో ఆడవారి వల్ల మగవాళ్ల పడే బాధలను ఎంటర్టైనింగ్‌గా చూపిస్తూ రూపొందించిన సిరీస్ ఇది' అని తెలిపారు.



చైతన్య కృష్ణ, పావని

ఈసారి పీరియడ్ యాక్షన్ డ్రామా..



తిరువీర్

ఏషియన్ ఫిలిమ్స్ నారాయణ దాస్ నారంగ్ సమర్పణలో ఒక పీరియడ్ ఫిల్మ్ రూపొందు తోంది. రవి పనస ఫిలిం కార్పొరేషన్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రముఖ వ్యాపారవేత్త రవికుమార్ పనస అత్యున్నత సాంకేతిక విలువలతో నిర్మిస్తున్నారు. 'మసూద'లాంటి సూపర్ హిట్ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు హీరోగా దగ్గరైన తిరువీర్ ఈ చిత్రంలో కథానాయకుడిగా నటిస్తున్నారు. విభిన్న కథాంశంతో నూతన దర్శకుడు జి.జి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభమయ్యాయి.

'ఎక్కడా రాజీ పడిన నిర్మాణ విలువలతో, మునుపెన్నడూ చూడని కథాంశంతో, ప్రతిభావంతులైన నటులతో, దర్శకుడితో నిర్మితమవుతున్న ఈ చిత్రం ప్రేక్షకులని అలరిస్తుంది. ఏషియన్ ఫిలింస్ సమర్పణలో ఈ సినిమాని తీస్తుండడం మరింత సంతోషంగా ఉంది. ఇదొక పీరియడ్ యాక్షన్ డ్రామా జోనర్‌లో ఉంటుంది' అని నిర్మాత రవికుమార్ పనస చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

కోవొవాక్స్ ధర రూ.225!



న్యూఢిల్లీ : దేశంలో మళ్లీ కరోనా కేసులు పెరుగుతోన్నందున వ్యాక్సిన్ కంపెనీలు సొమ్ము చేసుకోవడానికి సిద్ధం అవుతున్నాయి. పెద్దల కోసం సీరమ్ ఇన్స్‌ట్యూట్ అభివృద్ధి చేసిన హెటెరోలాగస్ బూస్టర్ డోస్ అయినా కోవోవాక్స్‌ను కోవిన్ పోర్టల్‌లో చేర్చడానికి కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా ఆమోదం తెలిపారు. కోవొవాక్స్ ఒక్క డోస్ ధరను రూ.225గా నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీనికి జిఎస్‌టి అదనం. కోవోవాక్స ఆమోదం కోసం మార్చి 27న కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు సీరమ్ ఇన్స్‌ట్యూట్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఐ) డైరెక్టర్ ప్రకాశ్ కుమార్ సింగ్ లేఖ రాశారు. ఆ తర్వాత ఈ నిర్ణయం జరిగిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కోవోవాక్స్‌కు జనవరి 16న డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డిసిజిఐ) ఆమోదం తెలిపింది. తొలుత కోవాగ్జిన్, కోవిషీల్డ్‌లకు చెందిన రెండు డోసులు తీసుకున్న వారికి ఇది బూస్టర్ డోస్‌గా పని చేయనుందని ఆ కంపెనీ వర్గాలు తెలిపాయి. దీనికి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ), అమెరికాకు చెందిన యుఎస్ ఎఫ్‌డిఎ కూడా ఆమోదం తెలిపిందని పేర్కొన్నాయి.

రూ.900 కోట్లతో ఎక్సాన్‌మొబిల్ ప్లాంట్

న్యూఢిల్లీ: భారత్‌లో లూబ్రికెంట్ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నామని ఎక్సాన్‌మొబిల్ వెల్లడించింది. లూబ్రికేషన్ టెక్నాలజీలో గ్లోబల్ లీడర్ అయిన ఎక్సాన్ మొబిల్ మహారాష్ట్రలోని రాయ్‌గడ్‌లో రూ.900 కోట్ల పెట్టుబడితో దీన్ని నిర్మించనున్నట్లు ప్రకటించింది. దేశంలో పెరుగుతోన్న చమురు డిమాండ్‌ను తీర్చేందుకు ఏడాదికి 1,59,000 కిలోలీటర్ల ఫినిష్డ్ లూబ్రికెంట్‌ల సామర్థ్యంతో దీన్ని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొంది. 2025 చివరి నాటికి వాణిజ్య పరంగా ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు తెలిపింది.

గూగుల్ పే రివార్డ్స్‌లో రూ.80,000..!

వాషింగ్టన్: నగదు చెల్లింపుల యాప్ గూగుల్ పేలో స్క్రాచ్ చేసిన కొందరికి రూ.80,000 (దాదాపు వెయ్యి డాలర్లు) వరకు ఖాతాల్లో జమ అయ్యాయి. గూగుల్ పేలో చిన్నపాటి టెక్నికల్ సమస్య వల్ల అమెరికాలోని పలువురు ఖాతాదారులు ఈ బంఫర్ ఆఫర్‌ను కొట్టేశారు. కొద్దిమంది పిక్సల్ ఫోన్ యూజర్లు స్క్రాచ్ కార్డులతో రూ.800 నుంచి రూ.80వేల వరకు తమ ఖాతాల్లోకి వచ్చాయి. సోషల్ మీడియాలో ఈ విషయం దహనంలా వ్యాపించింది. సాంకేతిక లోపం వల్ల అలా జరిగిందని.. క్యాష్ బ్యాక్ అందుకున్న ఖాతాదారుల నుంచి రికవరీ చేస్తున్నామని ఆ సంస్థ తెలిపింది.

ఇండ్కల్ నుంచి ఏసర్ లార్జ్ అప్లయిన్సెస్

న్యూఢిల్లీ : బెంగళూరు కేంద్రంగా పని చేస్తున్న ఇండ్కల్ కొత్తగా ఏసర్ లార్జ్ బ్రాండ్‌పై ప్రీమియం ఎయిర్ కండీషనర్లు, వాషింగ్ మిషన్లను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఏసర్ లార్జ్ పేరుతో తన డబ్ల్యు సీరిస్‌లో క్యూఎల్ఇడి స్మార్ట్ టివిలను కూడా విడుదల చేసినట్లు పేర్కొంది. 65, 75 అంగుళాల పరిమాణంలో వీటిని ఆవిష్కరించినట్లు ఏసర్ ఇన్‌కార్పొరేటెడ్ వైస్ ప్రెసిడెంట్ జాడే జౌ తెలిపారు. ఎసి ధరలు రూ.27,999 నుంచి, ప్రీమియం వాషింగ్ మిషన్ల ధరలు రూ.13,499 నుంచి ప్రారంభమవుతాయని ఆ సంస్థ తెలిపింది.

హైదరాబాద్‌లో 'డిఎస్‌ఎం' తయారీ కేంద్రం ఏర్పాటు

హైదరాబాద్: ఆరోగ్య పౌష్టికాహారం ఉత్పత్తులను అందించే రాయల్ డిఎస్ఎం హైదారాబాద్‌లో తన నూతన ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. దేశ వ్యాప్తంగా పౌష్టికాహార అవసరాలను తీర్చేందుకు ఈ కేంద్రం మద్దతు చేయనుందని తెలిపింది. ఇది వినూత్న తరహా వాణిజ్య తయారీ కేంద్రమని పేర్కొంది. అత్యున్నత నాణ్యత కలిగిన ఉత్పత్తి ప్రక్రియలను వినియోగించుకుని న్యూట్రిషినల్లీ ఫోర్టిఫైడ్ (పోషక విలువలతో కూడిన) బియ్యం గింజలను ఉత్పత్తి చేస్తుందని తెలిపింది. సంవత్సరానికి 3600 టన్నుల కెర్నల్స్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది

ప్రపంచ వృద్ధిలో భారత్, చైనా కీకం

- సగం వాటా ఈ రెండు దేశాలదే
- ఐఎంఎఫ్ ఎండి అంచనా



వాషింగ్టన్ : ప్రపంచ వృద్ధి రేటులో భారత్, చైనా దేశాలు కీలక పాత్రను పోశించనున్నాయని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) పేర్కొంది. గ్లోబల్ వృద్ధిలో ఈ రెండు దేశాల వాటా సగం పైగా ఉండనుందని ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిష్టాలినా జార్జివా పేర్కొన్నారు. 2023లో ప్రపంచ వృద్ధి 3 శాతం లోపే ఉండొచ్చని ఆమె అంచనా వేశారు. జనవరిలో తాము అంచనా వేసిన 2.9 శాతంగానే చోటు చేసుకోవచ్చన్నారు. ఆర్థిక కార్యకలాపాల్లో మందగమన కాలం పెరగడంతో వచ్చే ఐదేళ్లలో ఇదే పరిస్థితి కొనసాగవచ్చన్నారు.

"1990 నుంచి అత్యల్ప మధ్య కాల వృద్ధి చోటు చేసుకుంటుంది. గత రెండు దశాబ్దాల నుండి సగటున 3.8 శాతం కంటే చాలా తక్కువగా నమోదవుతోంది. 90 శాతం అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు 2023లో తమ జిడిపిలో క్షీణతను చవి చూసే అవకాశం ఉంది. తమ మందగించిన ఎగుమతుల డిమాండ్‌తో తక్కువ ఆదాయాలు కలిగిన దేశాలు దిగాలు పడుతున్నాయి. వాటి తలసరి ఆదాయ వృద్ధి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల కంటే తక్కువగా ఉంది." అని క్రిష్టాలిని జార్జివా పేర్కొన్నారు. ఈ వారంలో ఐఎంఎఫ్ సమావేశాలు జరగనున్నాయి. వీటికి ముందు జార్జివా వ్యాఖ్యలు విశేషాన్ని సంతరించుకున్నాయి. వచ్చే భేటీలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ప్రధాన సమస్యలపై చర్చ జరగనుంది.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి

- సీసీఎల్‌ఏ నవీన్‌మిట్టల్‌కు వీఆర్ఏ జేఏసీ వినతి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని వీఆర్ఏల జేఏసీ కోరింది. ఈ మేరకు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయంలో సీసీఎల్ఏ, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్‌ను కలిసి వీఆర్ఏల పేస్కేలు, క్రమబద్ధీకరణ, పదోన్నతులు, వారసత్వ ఉద్యోగాలు, సమ్మె కాలానికి వేతనం వంటి తదితర అంశాలపైన వీఆర్ఏ జేఏసీ చైర్మెన్ ఎం.రాజయ్య, కో-కన్వీనర్స్ వంగూరు రాములు, కె.మాధవ్, వెంకటేష్‌యాదవ్, ఎస్‌కే.రఫీ వినతి పత్రం అందజేశారు. సీసీఎల్ఏ స్పందిస్తూ వీఆర్ఏల పేస్కేలు, ఇతర ముఖ్యమైన అంశాలన్నింటినీ సీఎం దష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల క్యాడర్ల పదోన్నతుల అంశంలో కూడా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జిల్లాల జేఏసీ చైర్మెన్లు గైని దయాసాగర్, బెజ్జం భరత్‌కుమార్, బోయరాములు, పగిడిరాజయ్య, తొర్రూర్ శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, డి,రాజు తదితరు పాల్గొన్నారు. వీరితోపాటు వీఆర్ఏ సమస్యలను పరిష్కరించాలని ట్రెసా రాష్ట్ర అధ్యక్షులు వంగా రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో సీసీఎల్ఏను కలిసి విన్నవించారు.

మసీదుపై మూకదాడి, విధ్వంసం

- ఆరుగురికి గాయాలు
- 10మంది అరెస్టు

చండీఘడ్: హర్యానాలోని సోనీపట్‌లో గల శాండల్ కలన్ గ్రామంలో లాఠీలు చేతబట్టిన కొంతమంది మతతత్వ గూండాలు మసీదులో చొరబడి అక్కడ నమాజ్ చేస్తున్న వారిపై దాడి చేశారు. మొత్తంగా ఆ స్థలాన్నంతా ధ్వంసం చేశారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ దాడిలో ఆరుగురు గాయపడ్డారు. ఈ దాడికి సంబంధించి పోలీసులు 10మందిని అరెస్టు చేశారు. ఈ సంఘటన తర్వాత అదనంగా పోలీసు బలగాలను మోహరించారు. సంఘ వ్యతిరేక శక్తులు కొందరు మసీదులోకి చొరబడి, ప్రార్థనలు చేస్తున్న వారిని కొట్టారని సోనీపట్ పోలీసు కమిషనర్ సతీష్ బాలన్ తెలిపారు. ఈ దాడికి ముందు గ్రామంలో ఇరు గ్రూపుల మధ్య ఎలాంటి ఘర్షణలు, గొడవలు లేవని తెలిపారు. లాఠీలు చేతబట్టుకున్న కొంతమంది వ్యక్తులు గ్రామ వీధుల్లో అటూ ఇటూ తిరుగుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తున్నాయి. లోపల ప్రార్థనలు ఆపాలని కొంతమంది వ్యక్తులు కోరారని, ఆ తర్వాత అక్కడ విధ్వంసం సృష్టించారని

తీవ్రమైన నేరాలను నిర్వచించండి

క్రిమినల్స్ డిబార్ పిటిషన్‌పై కేంద్రానికి 4 వారాల సుప్రీం గడువు

న్యూఢిల్లీ : తీవ్రమైన నేరాల్లో అభియోగాలను ఎదుర్కొంటున్న వారిని ఎన్నికల్లో పోటీ చేయనివ్వకుండా నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాల్సిందిగా కేంద్రాన్ని సుప్రీంకోర్టు సోమవారం కోరింది. అసలు తీవ్రమైన నేరాలంటే ఏమిటో ముందుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం వుందని జస్టిస్ కె.ఎం.జోసెఫ్, జస్టిస్ బి.వి.నాగరత్నలతో కూడిన బెంచ్ పేర్కొంది. ఈ విషయంలో కేంద్రం తన సమాధానాన్ని చెప్పలేదంటూ వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాల్సిందిగా అదనపు సొలిసిటర్ జనరల్ సంజయ్ జైన్‌ను బెంచ్ కోరింది. "ముందుగా మీరు తీవ్రమైన నేరాలేంటో గుర్తించండి, దాన్ని నిర్వచించండి, జులైలో విచారిద్దాం." అని బెంచ్ పేర్కొంది. ఈ విషయమై లాయర్ అశ్విని ఉపాధ్యాయ్ వేసిన పిటిషన్‌పై గతేడాది సెప్టెంబరు 28న న్యాయ, హోం మంత్రిత్వ శాఖలకు, ఎన్నికల కమిషన్‌కు సుప్రీం నోటీసులు జారీ చేసింది. క్రిమినల్ కేసుల్లో అభియోగాలు నమోదైన వారిని నిషేధించడంతో పాటూ అటువంటి అభ్యర్థులను ఎన్నికల్లో పోటీ చేయనివ్వకుండా నిలువరించేందుకు చర్యలు తీసుకోవాలంటూ కేంద్రాన్ని, ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని ఆ పిటిషన్ కోరింది. లా కమిషన్ సిఫార్సు చేసినా, కోర్టు గతంలో ఆదేశాలు జారీ చేసినా కేంద్రం, ఎన్నికల కమిషన్ ఆ దిశగా చర్యలు తీసుకోలేదని పిల్ పేర్కొంది. 2019లో లోక్‌సభ ఎన్నికల్లో 539మంది విజేతలు వుండగా, వారిలో 43శాతం మంది అంటే 233 మందిపై క్రిమినల్ కేసులు వున్నాయని పిల్ పేర్కొంది. స్వచ్ఛంద సంస్థ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ నివేదికలోని గణాంకాలను పిల్ ప్రముఖంగా ప్రస్తావించింది. 2009 నుండి తీవ్రమైన క్రిమినల్ కేసులు వున్న ఎంపీల సంఖ్య 109శాతం పెరిగిందని పిటిషన్ పేర్కొంది. అందులో ఒక పార్లమెంట్ సభ్యుడిపై ఏకంగా 204 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. నేరపూరితమైన రాజకీయాల స్థాయి బాగా పెరిగిపోయిందని, ఓటర్లు రాజ్యాంగంలోని 19వ అధికరణ కింద తమకు కల్పించబడిన ప్రాథమిక హక్కును స్వేచ్ఛగా, సక్రమంగా ఉపయోగించుకోవడం కష్టమై పోతోందని పిటిషన్ పేర్కొంది.

ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూనరేషన్ పెంచాలి : టీపీటీఎల్‌ఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ ఎగ్జామినర్లకు ఇస్తున్న రెమ్యూనరేషన్, టీఏ, డీఏలను పెంచాలని తెలంగాణ ప్రయివేట్ టీచర్లు, లెక్చరర్ల ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు కాచిగూడ జూనియర్ కాలేజ్ క్యాంప్ ఆఫీసర్ ఐలయ్యను ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎ విజయ్ కుమార్, నాయకులు కె విజయ్, అధ్యాపకులు సైదిబాబు, సైదులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ సెంటర్లలో కనీస సౌకర్యాల్లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రయివేట్ అధ్యాపకులకూ సీనియార్టీ ప్రకారం చీఫ్ ఎగ్జామినర్లుగా అవకాశమివ్వాలని కోరారు. అన్ని స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాల్లో ప్రాథమిక సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి పేపర్‌కు ఇస్తున్న రెమ్యూనరేషన్‌ను రూ.50 వరకు పెంచాలని కోరారు. రాష్ట్రంలోని ప్రయివేటు విద్యాసంస్థల్లోని బోధనా సిబ్బందిని రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. ప్రయివేటు ఉద్యోగులకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో సిబ్బంది అందరికీ గుర్తింపుకార్డులివ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని పేర్కొన్నారు. వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. కనీస వేతనాలు అమలు చేయాలని తెలిపారు. విద్యాసంవత్సరం మధ్యలో తీసేయకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా కోవిడ్ మాక్ డ్రిల్స్

- మంచి ప్రతిస్పందన వచ్చిందన్న ప్రభుత్వం
- ఉదాసీనత కూడదన్న ఐఎంఎ

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్న తరుణంలో కోవిడ్ సన్నద్ధతను పరీక్షించేందుకు దేశవ్యాప్తంగా ప్రధాన ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సోమ, మంగళవారాల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, బీహార్, కర్ణాటక, ముంబయిల్లో పలు ఆస్పత్రుల్లో ఈ డ్రిల్స్ జరిగాయి. ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో డ్రిల్‌ను కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ స్వయంగా వీక్షించారు. నాణ్యత కలిగిన క్లినికల్ పద్ధతులను, ఇన్ఫెక్షన్ నియంత్రణా చర్యలను, ఆస్పత్రి నిర్వహణను, పారిశుధ్య క్రమాన్ని, రోగికి ప్రాముఖ్యతనిచ్చే నిబంధనలను పాటించేలా ఆస్పత్రులు చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. ఈ మాక్ డ్రిల్స్‌కు దేశవ్యాప్తంగా మంచి ప్రతిస్పందన లభించింది. మంత్రులు, సీనియర్ అధికారులు ఆస్పత్రుల్లో ఏర్పాట్లను సమీక్షించారని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

కొత్తగా తలెత్తిన కరోనా వైరస్ వేరియంట్ ఎక్స్‌బిబి.1.16 కారణంగా ఇటీవల కేసులు బాగా పెచ్చరిల్లుతున్నాయని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ వేరియంట్ మ్యుటేషన్లు జరిగి కొత్త రకం పుట్టుకొచ్చిందని ఆ వైరస్‌కు సంబంధించిన కేసులే దేశంలో వివిధ ప్రాంతాల్లో వంద వరకు నమోదయ్యాయని ఆ ప్రకటన తెలిపింది. ఒమిక్రాన్ వేరియంట్లలో ఎక్స్‌బిబి అనేది ప్రస్తుతం బాగా ప్రబలుతోంది. గత 15 మాసాల్లో దీనికి సంబంధించి 400 కేసులు గుర్తించారు. వీటిల్లో 90శాతం ఎక్స్‌బిబి వే. కోవిడ్ వ్యాక్సిన్‌ను, బూస్టర్ డోస్‌ను తీసుకోవాల్సిందిగా ఇండియన్ మెడికల్ అసోసి యేషన్ (ఐఎంఎ) సిఫార్సు చేసింది. యాంటీబయాటిక్స్‌కు ఇందులో ఎలాంటి పాత్ర లేదని తెలిపింది. రోజూ క్రమం తప్పకుండా ఉప్పునీరును పుక్కిలించడం వల్ల కరోనా వైరస్ రాకుండా రక్షణ వుంటుందనడానికి ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని పేర్కొంది. ఇటీవల కాలంలో కోవిడ్ జాగ్రత్తలు పాటించడంలో ఉదాసీనత కారణంగానే కేసుల సంఖ్య పెరిగిందని తెలిపింది. పరీక్షలు ఎక్కువగా చేయకపోవడం, జాగ్రత్తలు సరిగా పాటించకపోవడం వంటివి ప్రధాన కారణాలుగా వున్నాయని ఐఎంఎ తెలిపింది. ఒకవేళ లక్షణాలున్నా వారు పరీక్షలు చేయించుకోవడానికి తిరస్కరించడంతో వైరస్ బయటకు తెలియకుండానే వ్యాప్తి చెందడానికి కారణమవుతోందని పేర్కొంది. వృద్ధులు, గర్భవతులు, తీవ్ర జబ్బులతో బాధపడుతున్న వారికి కోవిడ్ ముప్పు నుండి రక్షణ కల్పించాల్సిన అవసరముందని ఐఎంఎ పేర్కొంది.

ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీ ఫాసిస్ట్ బ్రాహ్మణీయ శక్తులకు

వ్యతిరేకంగా పోరాటాలు

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరుపాక అనిల్‌కుమార్ హెచ్చరిక

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశంలో నిరంతరం దళితులపై హింసకు పాల్పడుతున్న ఆర్‌ఎస్ఎస్-బీజేపీ ఫాసిస్ట్ బ్రాహ్మణీయ శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు తీవ్రతరం చేస్తామని తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరుపాక అనిల్‌కుమార్ తెలిపారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రసాదించిన భారత రాజ్యాంగం స్థానంలో మనుస్మతి తీసుకరావడానికి బీజేపీ, కాషాయ దళాలు కుట్రలు పన్నుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. భారత రాజ్యాంగాన్ని క్రమపద్ధతిలో మోడీ ప్రభుత్వం ధ్వంసం చేస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని మఖ్దూంభవన్ లో సోమవారం తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం రాష్ట్ర అధ్యక్షులు బందెల నరసయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మరుపాక అనిల్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై దౌర్జన్యాలు, హింస రోజురోజుకు పెరిగిపోతున్నా యని చెప్పారు.

సమాన హక్కులు అడుగుతున్న దళితులపై దాడులు చేసి కాషాయ దళాలు చంపేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీవించే హక్కులను కాపాడడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. దళితులపై దాడులను ప్రతిఘటిస్తూ, రాజకీయ సాధికారత, గుర్తింపు, ఆత్మ గౌరవం, హక్కులు కోసం సామూహిక ఉద్యమాలు నిర్మిం చాలని ఈ సందర్భంగా అనిల్‌కుమార్ పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో డీహెచ్‌పీఎస్ గౌరవ అధ్యక్షులు కె.యేసురత్నం, కార్యనిర్వాహక అధ్యక్షులు తాళ్లపల్లి లక్ష్మణ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు కె.రత్నకుమారి, వై.ఉషాశ్రీ, సహదేవ్, కె.రాజరత్నం, దేవి, పొచన్న, బి.లక్ష్మీపతి, కె.వెంకటస్వామి, ఆరుట్ల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంసెట్‌కు రికార్డు స్థాయిలో దరఖాస్తులు

ఇంజినీరింగ్‌కు 1.95 లక్షలు, అగ్రికల్చర్‌కు 1.09 లక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంసెట్‌కు రికార్డు స్థాయిలో దరఖాస్తులొచ్చాయి. ఇప్పటి వరకు 3,05,185 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. తెలంగాణలో ఇప్పటి వరకు ఇంత పెద్ద సంఖ్యలో దరఖాస్తులు దాటడం ఇదే మొదటి సారి కావడం విశేషం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు లక్షల వరకు దరఖాస్తులొచ్చేవి. కానీ తెలంగాణ రాష్ట్రంలోనే 3.05 లక్షల దరఖాస్తులు రికార్డు స్థాయిలో రావడం గమనార్హం. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి 1,95,515 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 1,09,335 మంది, రెండింటికీ 335 మంది కలిపి మొత్తం 3,05,185 మంది దరఖాస్తు చేశారు. అయితే 2014లో ఇంజినీరింగ్ విభాగానికి 2,82,815 మంది, అగ్రికల్చర్, మెడికల్ విభాగానికి 1,12,855 మంది కలిపి మొత్తం 3,95,670 మంది దరఖాస్తు చేయడం తెలిసిందే. 2016లో ఇంజినీరింగ్ విభాగానికి 1,44,510 మంది, అగ్రికల్చర్, మెడిసిన్ విభాగానికి 1,02,012 మంది కలిపి మొత్తం 2,46,522 మంది దరఖాస్తు చేశారు. 2021లో ఇంజినీరింగ్ విభాగానికి 1,64,964 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 86,642 మంది కలిపి మొత్తం 2,51,606 మంది దరఖాస్తు చేయడం గమనార్హం. గతేడాది ఇంజినీరింగ్ విభాగానికి 1,72,243 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 94,476 మంది కలిపి మొత్తం 2,66,719 మంది దరఖాస్తు చేశారు. ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తు చేసే గడువు సోమవారంతో ముగిసిన విషయం తెలిసిందే.

నిండుగా పరీక్షా కేంద్రాలు : కన్వీనర్

దరఖాస్తుల చేసిన అభ్యర్థులు అధికంగా ఉండ డంతో పరీక్షా కేంద్రాలు నిండుగా కనిపిస్తాయని ఎంసెట్ కన్వీనర్ డీన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసెట్‌కు తెలంగాణలో 16, ఏపీలో ఐదు కలిపి మొత్తం 21 ప్రాంతీయ కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు.

ఇంజినీరింగ్ విభాగానికి 2,11,728 మంది అభ్యర్థులకు పరీక్ష నిర్వహించే సామర్థ్యం ఉందని, ఇప్పటి వరకు 1,96,475 దరఖాస్తులొచ్చాయని పేర్కొన్నారు. ఇంకా 15,253 దరఖాస్తులు తక్కువగా ఉన్నాయని తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 1,29,680 మంది అభ్యర్థులకు పరీక్ష నిర్వహించే సామర్థ్యం ఉందని, ఇప్పటి వరకు 1,09,996 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. ఇంకా 19,684 దరఖాస్తులు తక్కువగా ఉన్నాయని తెలి పారు. రెండింటికీ కలిపి 338 మంది అభ్యర్థులు దర ఖాస్తు చేశారని పేర్కొన్నారు. వచ్చేనెల 10,11 తేదీ ల్లో ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం, అదేనెల 12 నుంచి 14వ తేదీ వరకు ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

జోజిలా టన్నెల్‌ను పరిశీలించిన గడ్కరీ

మెఘా సంస్థకు ప్రశంస



హైదరాబాద్ : కాశ్మీర్‌ను కన్యాకుమారితో అనుసంధానం చేయాలనే కలను సాధించడంలో జోజిలా టన్నెల్ కీలకపాత్ర పోశిస్తుందని కేంద్ర రోడ్డు, రవాణ, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. జోజిలా టన్నెల్ నిర్మాణ పనుల పట్ల మంత్రి సంతప్తి వ్యక్తం చేశారని మెఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) ఓ ప్రకటనలో తెలిపింది. జమ్మూ కాశ్మీర్ లెఫ్టనెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ కార్యదర్శి అల్కా ఉపాధ్యాయతో కలిసి జోజిలా టన్నెల్‌ను మంత్రి గడ్కరీ పనుల పురోగతిని సోమవారం పరిశీలించారు. ఎంఇఐఎల్ డైరక్టర్ సి.హెచ్ సుబ్బయ్య, జోజిలా ప్రాజెక్ట్ హెడ్ హర్పాల్ సింగ్ వారికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్ట్ పనుల పురోగతి గురించి వివరించారు. జోజిలా టన్నెల్ ప్రాజెక్ట్‌ను ఎంఇఐఎల్ నిర్మిస్తోంది. జోజిలా టన్నెల్‌ను సందర్శించిన గడ్కరీ.. టన్నెల్ లోపలికి వెళ్లి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల పురోగతి పట్ల గడ్కరీ సంతృప్తి వ్యక్తం చేశారు. "ఈ ప్రాజెక్ట్ ఇండియాలో భారీ గేమ్ ఛేంజర్ కాబోతుంది. కాశ్మీర్ లోయ, లడఖ్ మధ్య సంవత్సరం పొడవునా కనెక్టివిటీని అందిస్తోంది. అంతేకాకుండా కాశ్మీర్ నుంచి కన్యాకుమారిని అనుసంధానం చేస్తోంది. క్లిష్టమైన వాతవరణ పరిస్థితుల్లో ప్రాజెక్ట్‌లో పనులు కొనసాగిస్తున్న ఇంజినీర్లు, కాంట్రాక్టర్లకు అభినందనలు. టన్నెల్‌లో దాదాపు 38 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్ట్ పర్యాటక రంగాన్ని అభివద్ధి చేస్తుంది. దీనివల్ల ఉపాధి పెరుగుతుంది. ఇక్కడ రిసార్ట్స్, అడ్వెంచర్ స్పోర్ట్స్ వంటివి నిర్మిస్తూ.. కాశ్మీర్‌ను మరో స్విట్జర్లాండ్‌లా తీర్చిదిద్దుతాం" అని గడ్కరీ తెలిపారు. 2026 నాటికి ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని హర్పాల్ సింగ్ తెలిపారు. కాశ్మీర్ లోయ, లడఖ్ ప్రాంతం మధ్య అన్ని వాతావరణాలకు అనుసంధానంగా ఉండేలా వ్యూహాత్మకంగా జాతీయ రహదారిపై 11,578 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్న జోజిలా సొరంగం పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రెండేళ్లలో అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభిమిస్తామని తెలిపారు.

ప్రధాని మోడీ ప్రారంభ కార్యక్రమాలకు రూ.కోట్లు..!

- ఆర్‌టీఐ సమాచారంలో వెల్లడి

న్యూఢిల్లీ : ఐఐటీ ధార్వాడ్ కొత్త కేంపస్ ప్రారంభోత్సవానికి కర్నాటక ప్రభుత్వ రూ.9.49కోట్లను ఖర్చు పెట్టిందని ఆర్‌టీఐ సమాచారం ద్వారా వెల్లడైంది. ఈ ఏడాది మార్చి 12న ప్రధాని మోడీ ఈ క్యాంపస్‌ను ప్రారంభించారు. ప్రజల రవాణాకు, లంచ్‌లు, వేదిక ఏర్పాట్లు, బ్రాండ్లు, ప్రమోషన్లు, ఇతర సదుపాయాల కల్పనకు ఈ మొత్తం ఖర్చయిందని సమాచార హక్కు చట్టం ద్వారా అందిన సమాచారం వెల్లడించింది. ధార్వాడ్‌లో శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి పునాది వేయడంతో పాటూ కర్నాటకవ్యాప్తంగా అనేక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోడీ ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రకటించడానికి ముందుగానే ఇది జరిగింది. 2లక్షల మంది ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరిలో మెజారిటీ మందికి ఆహారం, రవాణా సదుపాయాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, కర్ణాటక ముఖ్యమంతి బసవరాజ్ బొమ్మై పాల్గొన్నారు. ఆర్‌టిఐ ద్వారా సమాచారం కోరిన జనతాదళ్ (సెక్యులర్) నేత గురురాజ్ హమ్‌సాహి మరద్‌కు ప్రభుత్వం ఈ సమాచారం అందచేసింది. కార్యక్రమం జరుగుతున్న వేదిక వద్దకు ప్రజలను తీసుకెళ్ళి రావడానికి రూ.2.83కోట్లను హుబ్లి-ధార్వాడ్ జిల్లా యంత్రాంగం భరించింది. హైదరాబాద్, తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాల్లో ప్రధాని పర్యటనలు జరుపుతున్న వేళ ఈ సమాచారం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధాని మోడీ హాజరయ్యే కార్యక్రమాలను ఇంత అర్భాటంగా జరుపుతుండడంపై కర్ణాటకలో ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. ప్రజాధనం పరోక్షంగా మోడీ ఎన్నికల ప్రచారానికి ఉపయోగపడుతోందని అన్నారు. కాగా డిప్యూటీ కమిషనర్ ఫండ్ నుండి ఖర్చు పెట్టిన మొత్తాన్ని మాత్రమే తమకు తెలియచేశారని, కానీ తమ అంచనాల ప్రకారం రూ.20కోట్లు ఖర్చు పెట్టారని హమ్‌సాహి మరద్ మీడియాతో వ్యాఖ్యానించారు. ప్రయివేటు వాహనాలను కిరాయికి తీసుకున్నారని, దాదాపు 60వేల మందికి భోజనాలు పెట్టారని, ఈ కార్యక్రమానికి రావడం కోసం మనిషికి వెయ్యి రూపాయిలు ఇస్తామని ప్రలోభ పెట్టి మరీ తీసుకువచ్చారని ఆయన విమర్శించారు.

రేపటినుంచి 'ఎస్‌ఏ-2' పరీక్షలు

- 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-2) పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి డైరెక్టర్ ఎం రాధారెడ్డి సోమవారం సవరణ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 20వ తేదీ వరకు ఈ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలుంటాయని వివరించారు. ఆరు, ఏడో తరగతి విద్యార్థులకు మొదటి రోజు పరీక్ష మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం మధ్యాహ్నం 3.45 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఆ తర్వాతి పరీక్షలను ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఈనెల 12న మొదటి రోజు గణితం పరీక్షను మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 3.45 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 13న రెండో రోజు ఫిజికల్ సైన్స్ పరీక్షను ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.15 వరకు, బయలాజికల్ సైన్స్ పరీక్షను మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు జరుపుతామని వివరించారు. ఆ తర్వాతి పరీక్షలను ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.15 వరకు నిర్వహిస్తామని తెలిపారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈనెల 12న మొదటి రోజు గణితం పరీక్షను మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 13న రెండో రోజు ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు ఫిజికల్ సైన్స్, 11.20 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు బయలాజికల్ సైన్స్ పరీక్షను నిర్వహిస్తామని వివరించారు. ఆ తర్వాతి పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఆరు పేపర్లతోనే పరీక్షలు నిర్వహిస్తుండడం గమనార్హం. ఈనెల 19న ప్రభుత్వం ఐచ్ఛిక సెలవు ప్రకటించడంతో ఆరోజు పరీక్షలను ఈనెల 18న నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు.

వారిద్దరూ క్రమశిక్షణకు ఉల్లంఘించారు

- వ్యక్తిగత అవకాశాలు రాలేదనే విమర్శలు
- జూపల్లి, పొంగులేటిపై మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ బహిష్కృత నేత జూపల్లి కృష్ణారావు విమర్శల్లో ప్రజా ప్రయోజనం లేదని రాష్ట్ర మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి ఇద్దరూ పార్టీ క్రమశిక్షణకు వ్యతిరేకంగా ప్రవర్తించారని తెలిపారు. 2018లో మహబూబ్‌నగర్ జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో గెలిచిన బీఆర్ఎస్ కొల్లాపూర్‌లోనే ఎందుకు ఓడిందనే విషయంపై జూపల్లి ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. 2012లో బీఆర్ఎస్‌లో చేరిన జూపల్లి, ఆయన గతంలో ఉన్న పార్టీయే యువత బలిదానాలకు కారణమని తెలుసుకోవాలని కోరారు. జూపల్లి, పొంగులేటి గత కొంత కాలంగా ఎవరి ట్రాప్‌లో ఉన్నారో ప్రజలకు తెలుసన్నారు. విలేకర్ల సమావేశంలో ఎంపీ పోతుగంటి రాములు, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి , ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన సచివాలయంలో అగ్నిప్రమాదం ఘటన

- సీబీఐ విచారణ కోరిన కెఎ పాల్ పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ : తెలంగాణ నూతన సచివాలయంలో అగ్నిప్రమాదంపై సీబీఐ విచారణ జరిపించాలంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ పాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహా, జస్టిస్ జెబి పార్డీవాలాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ఆర్టికల్ 32 ప్రకారం ఈ అభ్యర్థన ఎలా చేస్తారని కెఎ పాల్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. తెలంగాణ నూతన సచివాలయంలో అగ్నిప్రమాదం కాదనీ, నరబలి జరిగిందని పిటిషనర్ ఇన్ పర్సన్ పాల్ వాదించారు. ఇలాంటి పిటిషన్లు విచారించబోమని సీజేఐ స్పష్టం చేశారు. తాను 23 గంటలు ప్రయాణించి వచ్చానని కెఎ పాల్ చెబుతుండగా.. సీజేఐ జోక్యం చేసుకొని "ఏదేదో వాదిస్తున్నారు. ఉద్దేశం వేరుగా ఉంది. రాజకీయ వ్యక్తి కదా..." అని వ్యాఖ్యానించారు. దేశానికి బిలియన్లలో డొనేషన్లు ఇచ్చాననీ, ఆరుగురు సీఎంలు తన పీస్ ర్యాలీలకు వచ్చారని పాల్ పేర్కొన్నారు. కాగా, దేశంలో జరుగుతున్న అన్ని అగ్నిప్రమాదాలపైనా సీబీఐ విచారణ జరపమనాలా? అంటూ అసహనం వ్యక్తం చేసిన ధర్మాసనం పిటిషన్ కొట్టివేసింది.

నేడు వాయనాడ్‌కు రాహుల్

వయానాడ్ : కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ లోక్‌సభలో అనర్హతవేటుకు గురైన తర్వాత తొలిసారి తన నియోజకవర్గమైన వాయనాడ్‌కు మంగళవారం (ఏప్రిల్ 11) రానున్నారు. వాయనాడ్‌లో రాహుల్ మంగళవారం రోడ్‌షోను నిర్వహించనున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఇక అక్కడ రాహుల్‌కు ఘనంగా స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ పార్టీ భారీ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తున్నది. కాగా, మోడీ ఇంటిపేరు గురించి రాహుల్‌గాంధీ 2019లో చేసిన వ్యాఖ్యలపై గుజరాత్‌లోని సూరత్ కోర్టు అతనికి రెండేండ్ల జైలు శిక్ష విధించిన సంగతి తెలిసిందే. శిక్షానంతరం అతనిపై లోక్‌సభలో అనర్హత వేటు పడింది. ఇక ఈ కేసు విషయంలో రాహుల్‌కి ఏప్రిల్ 4న సూరత్‌కోర్టు బెయిల్ మంజూరైంది. అయితే రాహుల్ అప్పీల్‌పై ఏప్రిల్ 13వ తేదీన ఆ కోర్టు విచారణ చేపట్టనుంది.

జ్ఞానవాపి మసీదు కేసులో 14న సుప్రీం విచారణ

- 'వాజూ'కు అనుమతి కోరిన మసీదు కమిటీ

న్యూఢిల్లీ : రంజాన్ మాసంలో వారణాసిలోని జ్ఞానవాపి మసీదు సముదాయంలో 'వాజూ' చేసుకోవడానికి అనుమతినివ్వాల్సిందిగా అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ చేసిన పిటిషన్‌పై ఈ నెల 14న విచారించడానికి సుప్రీం సోమవారం అంగీకరించింది. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు శివలింగం నమూనాలో ఉందంటూ కొందరు చెబుతున్న ప్రాంతాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా గతేడాది నవంబరు 11న సుప్రీం కోరింది. ఈ అంశంపై త్వరగా విచారణ చేపట్టాల్సిందిగా మసీదు కమిటీ తరపు సీనియర్ న్యాయవాది హుజెఫా అహ్మది కోర్టును కోరారు. దీనిపై ఈ నెల 14న విచారణ చేపడతామని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ తెలిపారు. ఈ వివాదానికి సంబంధించి వారణాసి కోర్టులో దాఖలైన అన్ని పిటిషన్లను కలిపి విచారించాలని కోరుతూ కొందరు హిందువులు చేసిన విజ్ఞప్తిపై ఈ నెల 21న విచారించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది.

దొంగలముఠా నాయకుడు మోడీ



- ఆయన మద్దతు లేకుండా అదానీ వ్యాపారమే లేదు
- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రధాని నరేంద్రమోడీ దొంగలముఠాకు నాయకుడిగా వ్యవహరిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ అన్నారు. ఆయన మద్దతు లేకుండా అదానీ వ్యాపారమే లేదన్నారు. పేపర్ లీకేజీ కేసులో అరెస్టై జైలుకెళ్లిన బండి సంజయ్ లాంటి వారికి 'మీ వెనుక నేనున్నా' అని భరోసా ఇస్తున్నారని విమర్శించారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు ఈనెల 14 నుంచి మే 15వ తేదీ వరకు నిర్వహించే 'బీజేపీ హటావో - దేశ్ బచావో' పాదయాత్ర కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని సోమవారంనాడిక్కడి మఖ్దూం భవన్‌లో ఆయన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వేస్టేషన్లు, రైళ్లు, పోర్టులను ప్రజల సొమ్ముతో అభివద్ధి చేసి, వాటిని తిరిగి కార్పొరేట్ శక్తులకు అమ్మేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని అన్నారు.ప్రధాని చదువుకు సంబంధించిన అంశంపై కూడా అబద్ధాలాడుతున్నారని ఎద్దేవా చేశారు.

'విశాఖ'పై తెలంగాణ చొరవ అభినందనీయం

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను తెలంగాణ ప్రభుత్వం తరపున కొనుగోలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు చేసిన ప్రతిపాదనను స్వాగతిస్తున్నామని డాక్టర్ కే నారాయణ అన్నారు. ఈ ప్లాంటుకు బొగ్గు, స్టీల్ లింకు ఉన్నదనీ, సింగరేణి సంస్థ ద్వారా దీన్ని నడిపించవచ్చని చెప్పారు. సీఎం కేసీఆర్ చొరవను ఆయన కొనియాడారు. బంగారుబాతును అదానీ తన్నుకుపోతుంటే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లొంగిపోయినా, తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం సంతోషమన్నారు.

పాదయాత్ర జయప్రదం చేయండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావల్సిన నిధులెన్ని? రాష్ట్రం నుంచి కేంద్రానికి వెళ్లిన పన్నులు ఎన్ని? అనే అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. విభజన హామీలు ఇప్పటి వరకు అమలు చేయలేదని ఆక్షేపించారు. ఈ నెల 14 నుంచి మే 15 వరకు 'బీజేపీ హటావో - దేశ్ బచావో' నినాదంతో జరిగే పాదయాత్రను విజయవంతం చేయాలని ప్రజల్ని కోరారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఉన్న బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందనీ, దాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ ప్రారంభిస్తారని తెలిపారు. హైదరాబాద్‌లోని 15 నియోజకవర్గాలు సహా రాష్ట్రవ్యాప్తంగా ఈ యాత్ర జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలు, రాష్ట్రంపై చూపుతున్న నిర్లక్ష్యం తదితర అంశాలను ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టి.నర్సింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి. స్టాలిన్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి. వెంకటేశం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి. చంద్రమోహన్‌గౌడ్, పడాల నళిని, నిర్లేకంటి శ్రీకాంత్, ఆర్. మల్లేష్ పాల్గొన్నారు.

కర్ణాటకలో కాంగ్రెస్‌ను అస్థిరపరిచేందుకు కేసీఆర్ యత్నం

- సీఎం భూదోపిడీని సీరియల్‌గా విడుదల చేస్తాం
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

త్వరలో ఎన్నికలు జరగనున్న కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అస్థిరపరిచేందుకు సీఎం కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి విమర్శించారు. సీఎం కేసీఆర్ భూదోపిడీతో రూ.లక్ష కోట్లు వెనకేసుకున్నారనీ, ఆ దోపిడీ పర్వాన్ని సీరియల్ గా విడుదల చేస్తామని ఆయన హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జేడీఎస్ ద్వారా తన అస్థిత్వాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఆ పార్టీకి వేల కోట్ల రూపాయలు సమకూర్చుతానంటూ బేరసారాలు మొదలుపెట్టారని ఆరోపించారు. భూములను వనరులుగా పెట్టుకుని డబ్బులు సంపాదిస్తున్నారనీ, తనతో ఉన్న వారికి భూములు పంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దందా ద్వారా వచ్చిన సొమ్ముతో దేశ రాజకీయాలను కేసీఆర్ శాసించాలనుకుంటున్నారని చెప్పారు. సీఎం కేసీఆర్ అత్యంత సన్నిహితుడైన హెటిరో పార్థసారధి రెడ్డికి నిబంధనలకు విరుద్ధంగా హైటెక్ సిటీకి అత్యంత సమీపంలో భూమిని కేటాయించారని చెప్పారు. తద్వారా రూ.5,344 కోట్ల లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. "ఆరు నెలల్లో మా ప్రభుత్వం వస్తుంది... ఎవ్వరినీ వదిలే ప్రసక్తి లేదు. సోమేశ్ కుమార్, అర్వింద్ కుమార్, జయేష్ రంజన్, మేడ్చల్, రంగారెడ్డి కలెక్టర్లు జైలుకు వెళ్లాల్సి వస్తుంది. ఖానామెట్‌లో 41 సర్వే నెంబర్‌లో 150 ఎకరాల భూమి ఉండేది. అందులో కేసీఆర్ 60 ఎకరాలు మాఫియాకు కట్టబెట్టారు. మంగళవారం యశోదా హాస్పిటల్ కొల్లగొట్టిన భూములపై వివరాలు చెబుతా. ఖానామెట్ భూములపై ధారవాహికగా వివరాలను విడుదల చేస్తాం" అని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఎన్నికలకు ముందు, తర్వాత కేసీఆర్ కుటుంబ ఆస్తులు ఎంత? అని ప్రశ్నించారు. దీనిపై సీబీఐకి కూడా లేఖ రాస్తానని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

అన్నీ హెూటళ్లు, రెస్టారెంట్లలో తాగునీటిని ఉచితంగా అందించాలి

- అర్వింద్ కుమార్

నవతెలంగాణ - హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని హెూటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, వీధి వ్యాపారులు తప్పనిసరిగా జలమండలి సరఫరా చేసే తాగునీటిని గానీ, ఆర్.ఓ వాటర్, శుద్ధి చేసిన నీటిని గానీ తప్పనిసరిగా ఉచితంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమీషనర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. ఒకవేళ, హెూటళ్లు, రెస్టారెంట్లలో తప్పనిసరి పరిస్థితుల్లో వాటర్ బాటిళ్లను సరఫరా చేస్తే ఆయా బాటిళ్లపై ముద్రించిన గరిష్ట ధరను మాత్రమే వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలోని అనేక హెూటళ్లు, రెస్టారెంట్లలో వేర్వేరు బ్రాండ్ల పేరుతో బాటిల్ వాటర్‌ను అత్యధిక ధరకు విక్రయిస్తున్నారని ఒక స్వచ్ఛంద సంస్థ చేసిన ఫిర్యాదు మేరకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్పందించారు.

ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూనరేషన్ పెంచాలి : టీపీటీఎల్ఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ ఎగ్జామినర్లకు ఇస్తున్న రెమ్యూనరేషన్, టీఏ, డీఏలను పెంచాలని తెలంగాణ ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్ల ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు కాచిగూడ జూనియర్ కాలేజ్ క్యాంప్ ఆఫీసర్ ఐలయ్యను ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎ విజయ్ కుమార్, నాయకులు కె విజయ్, అధ్యాపకులు సైదిబాబు, సైదులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ సెంటర్లలో కనీస సౌకర్యాల్లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రయివేట్ అధ్యాపకులకూ సీనియార్టీ ప్రకారం చీఫ్ ఎగ్జామినర్లుగా అవకాశమివ్వాలని కోరారు. అన్ని స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాల్లో ప్రాథమిక సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి పేపర్‌కు ఇస్తున్న రెమ్యూనరేషన్‌ను రూ.50 వరకు పెంచాలని కోరారు. రాష్ట్రంలోని ప్రయివేటు విద్యాసంస్థల్లోని బోధనా సిబ్బందిని రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. ప్రయివేటు ఉద్యోగులకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో సిబ్బంది అందరికీ గుర్తింపుకార్డులివ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని పేర్కొన్నారు. వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. కనీస వేతనాలు అమలు చేయాలని తెలిపారు. విద్యాసంవత్సరం మధ్యలో తీసేయకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

నూతన పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలి

- సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను కొనసాగించాలి
- టీఎన్జీవో అధ్యక్షులు మామిళ్ల రాజేందర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ ఏడాది జులై ఒకటో తేదీ నుంచి అమలయ్యేలా నూతన పే రివిజన్ కమిటీ (పీఆర్సీ)ని వెంటనే ఏర్పాటు చేయాలని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి రాయకంటి ప్రతాప్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం హైదరాబాద్‌లో టీఎన్జీవో కేంద్ర సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సుదీర్ఘ చర్చల అనంతరం తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించామని వారు తెలిపారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని పేర్కొన్నారు. 2004, సెప్టెంబర్ ఒకటి నుంచి నియమితులైన ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల ఆరోగ్య బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడం కోసం ఒక శాతం చందాతో ఈహెచ్ఎస్ సౌకర్యాన్ని కల్పించేలా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. గచ్చిబౌలిలోని ఇండ్లస్థలాలను భాగ్యనగర్ టీఎన్జీవో సొసైటీకి కేటాయించడానికి అడ్డుగా ఉన్న ప్రభుత్వ మెమోను రద్దు చేసి వెంటనే బీటీఎన్జీవోకు కేటాయించాలని తెలిపారు. రాష్ట్ర నూతన సచివాలయంతోపాటు అన్ని జిల్లాల కలెక్టరేట్ కార్యాలయాల్లో టీఎన్జీఓకు కార్యాలయాలు కేటాయించాలని కోరారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి పేర్కొన్నారు. రెండేండ్ల సర్వీసు పూర్తిచేసుకున్న పంచాయతి కార్యదర్శులకు పదోన్నతి ప్రక్రియను చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని పేర్కొన్నారు. ఉద్యోగుల సాధారణ బదిలీలు చేపట్టాలని, డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలిపారు. టీఎన్జీవో కేంద్ర సంఘానికి ఎన్నికల గడువు ఈ ఏడాది జూన్‌లో ఉన్నందున ఆలోగానే జరపాలంటూ ఏకగ్రీవంగా తీర్మానించామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్, ముత్యాల సత్యనారాయణ గౌడ్, కోశాధికారి రామినేని శ్రీనివాసరావుతో జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముందస్తు సమాచారం లేకుండానే ప్రజావాణి రద్దు

సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు

- నిరాశతో వెనుతిరిగిన ఫిర్యాదుదారులు
- ముందస్తు సమాచారం లేదంటున్న ఉద్యోగస్తులు

నవతెలంగాణ-వరంగల్

వరంగల్ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి అధికారులకు తమ సమస్యలను, గోడును విన్నవించుకోవడానికి వచ్చిన ప్రజలకు ప్రజావాణి రద్దయినట్టు తెలియడంతో తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. సంబంధిత అధికారులకు సైతం కలెక్టరేట్‌కు వచ్చిన తర్వాతనే రద్దయిన విషయం తెలిసుకోవాల్సిన పరిస్థితి ఉంది.

భగభగమనే మండే ఎండలను సైతం లెక్కచేయకుండా సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వృద్ధులు, పిల్లలు, మహిళలు, రైతులు.. రాయపర్తి, వర్ధన్నపేట, నర్సంపేట, నల్లబెల్లి, ఖిలావరంగల్ వంటి పలు మండలాల నుంచి కలెక్టరేట్‌లోని ప్రజావాణికి వచ్చారు. తీరా ప్రజావాణి రద్దయినట్టు తెలియడంతో తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి సంఘటనలు జరగలేదని, కొంతమంది అధికారుల నిర్లక్ష్యం వల్లనే ముందస్తు సమాచారం అందటం లేదని పలువురు బహిరంగంగా విమర్శించారు. ఇప్పటికైనా ప్రజావాణి నిర్వహించడానికి ఆనానుకుల పరిస్థితులు తలెత్తినప్పుడు ముందస్తుగా ప్రజలకు సమాచారాన్ని అందజేస్తే సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ప్రయాసపడాల్సిన అవసరం ఉండదని బాధితులు వాపోతున్నారు. డబ్బులు ఖర్చు అవుతున్నాయే తప్ప ఏండ్ల తరబడి తిరిగినా సమస్యలు పరిష్కారం కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజావాణి లేదని ఇక్కడికి అచ్చినంక తెలిసింది : వక్కల రవి, రైతు నల్లబెల్లి

పూర్వికుల నుంచి వారసత్వంగా నాకు వచ్చిన 1.19 ఎకరాల భూమి మీద గతంలో బ్యాంకులో లోన్ తీసుకున్నాను. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నేటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా పాసుబుక్కులు ఇచ్చింది. 2021 తర్వాత 1-బి లో ఒక ఎకరం భూమి చూపెడుతుంది. మిగతా 19 గుంటల భూమి 1-బిలో నమోదుకాక కార్యాలయం చుట్టూ తిరగలేకపోతున్నాను.

రైతుబంధు ఎకరం భూమికే వస్తుంది. 19 గుంటల భూమికి పడట్లేదని పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం కావడం లేదు. ముందస్తు సమాచారం ఇస్తే సమయం డబ్బు ఖర్చు అయ్యేది కాదు.

జీతాలే ఇయ్యలేనోడు..వైజాగ్ స్టీల్ బిడ్డింగ్‌లో పాల్గొంటాడా?

బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ హామీ ఏమైంది : బండి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉద్యోగులకు సరిగ్గా జీతాలే ఇయ్యలేనోడు.. వైజాగ్ స్టీల్ బిడ్డింగ్ పాల్గొంటాడా? అని సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ వ్యాఖ్యలు చేశారు. సోమవారం హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర పదాధికారులతో కలిసి ఆయన బలగం సినిమా చూశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ పెడతానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. బిచ్చమెత్తుకునే స్థాయి నుంచి వేల కోట్ల రూపాయలు ఎట్లా సంపాదించారు? అని కేసీఆర్‌ను ప్రశ్నించారు. దమ్ముంటే వరంగల్ సీపీ కాల్ లిస్ట్ ను బయటపెట్టాలని సవాల్ విసిరారు. త్వరలో వరంగల్ సీపీ అవినీతి, అక్రమాల బండారం బయటపెడతానన్నారు. ఆయనపై పరువు నష్టం దావా వేస్తానని చెప్పారు. తానేమైనా టెర్రరిస్టునా? బెయిల్ ఎందుకు రద్దు చేయాలి? అని ప్రశ్నించారు. ఈటల రాజేందర్ ఏం తప్పు చేశారని నోటీసులిస్తారని నిలదీశారు. డబ్బు సంబంధాలే తప్ప మానవ సంబంధాల్లేని వ్యక్తి కేసీఆర్ అని విమర్శించారు. రేవంత్ రెడ్డి బిడ్డ పెళ్లి, మా అత్తమ్మ పక్షిముట్టే కార్యక్రమాలను జరగనీయకుండా ఇబ్బందికి గురిచేసిన నీచుడన్నారు. ఆయనకు బలగం సినిమా చూపిస్తేనైనా కనువిప్పు కలుగుతుందేమోనన్నారు. డైరెక్టర్ వేణు సహా బలగం సినిమా యూనిట్‌కు అభినందనలు తెలిపారు.

19 ఎస్సీ నియోజకవర్గాల్లో గెలుపే మా లక్ష్యం

బీజేపీ జాతీయ కార్యదర్శి అర్వింద్ మీనన్

తెలంగాణలోని 19 ఎస్సీ నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా తమ పార్టీ పనిచేస్తున్నదనీ, దానికి సంబంధించిన రోడ్ మ్యాప్‌ను కూడా సిద్ధం చేశామని బీజేపీ జాతీయ కార్యదర్శి అర్వింద్ మీనన్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొప్పుభాష అధ్యక్షతన రాష్ట్ర పదాధికారులు, జిల్లా ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్వింద్ మీనన్ మాట్లాడుతూ..ఆ నియోజకవర్గాల్లో ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులను మండలాల ఇన్‌చార్జీలుగా నియమించి ప్రతి బూత్‌లో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతామన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ మోర్చా ఇన్‌చార్జి డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి, ఎస్సీమోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్, జాతీయ కార్యవర్గ సభ్యులు వేముల అశోక్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి పలువురు మహారాష్ట్ర నేతలు

అధికార బీఆర్ఎస్‌లోకి సోమవారం పలువురు మహారాష్ట్ర నేతలు చేరారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సమక్షంలో హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో వారు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ రాష్ట్ర మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత శంకర్అన్న దోంగే నేతృత్వంలో ఎన్సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ సోలంకే, మాజీ ఎమ్మెల్యే విజయ్ దోంబరే, మాజీ స్పీకర్ సుశీల్ ఘోటే, గులాబీ కండువా కప్పుకున్నారు.

గవర్నర్ తీరు రాజకీయ ప్రతీకార చర్య

రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ వాసుదేవరెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాజ్యాంగబద్ధంగా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని, మంత్రిమండలి ఆమోదం తెలిపిన బిల్లుల్ని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సుప్రీంకోర్టు మొట్టికాయలు వేస్తుందని తెలిసి కొన్ని బిల్లులను ఆమోదించి, మరికొన్ని తిరస్కరించారని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ డాక్టర్ కే వాసుదేవరెడ్డి విమర్శించారు. ఈ మేరకు సోమవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గవర్నర్‌ది పూర్తిగా రాజకీయ ప్రతీకారచర్యేనన్నారు. గవర్నర్ అధికారాలపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. కేంద్రం గవర్నర్ వ్యవస్థను అడ్డం పెట్టుకొని రాష్ట్రాల సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కల్గిస్తుందని చెప్పారు.

బీ-పాస్ ఆలస్యంపై అధికారులకు జరిమానా

29మందిపై చర్యలు...వారిలో నలుగురు మున్సిపల్ కమిషనర్లు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో టీఎస్‌బీపాస్ ద్వారా నిర్ణీత గడువులోపు భవననిర్మాణ అనుమతులను ఇవ్వనందుకు 29 మంది అధికారులపై పురపాలకశాఖ చర్యలకు ఉపక్రమించింది. భవన నిర్మాణాలకోసం దరఖాస్తులు చేసుకొని 15 రోజులు దాటినా ఆయా విభాగాల అధికారులు వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనితో 29 మంది ఉద్యోగుల్లో ఒక్కొక్కరి జీతం నుంచి రూ.3వేలు జరిమానాగా విధించినట్టు పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ తెలిపారు. ఈమేరకు కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. జీతంలో కోతకు గురైనవారిలో నలుగురు మున్సిపల్ కమిషనర్లు,13 మంది సైట్ టెక్నికల్ వెరిఫికేషన్ అధికారులు, 10 మంది సైట్ వెరిఫికేషన్ అధికారులు ఉన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హన్మకొండ, మేడ్చల్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సూర్యాపేట, వరంగల్, యాదాద్రి జిల్లాల కలెక్టర్లను ఆదేశిస్తూ లేఖ రాసారు.

డిస్కంలకు అవార్డులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ సంస్థలకు ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐపీపీఏఐ) అవార్డులు లభించాయి. ఉత్తమ పనితీరు కనబర్చినందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్)కు మొదటి అవార్డు లభించింది. అలాగే వినియోగదారులకు అవగాహన కల్పించడంలోనూ అవార్డు వచ్చింది. కర్నాటకలోని బెల్గాంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్-ఎన్పీడీసీఎల్)కు కూడా నాలుగు విభాగాల్లో అవార్డుల లభించాయి. ఆయా డిస్కంల మేనేజర్లు ఈ అవార్డుల్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తర, దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థల సీఎమ్‌డీలు ఏ గోపాలరావు, జీ రఘుమారెడ్డి విద్యుత్ ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.

ద.మ.రైల్వే పీసీఓఎమ్‌గా బీ నగ్య

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్‌గా ఐఆర్‌టీఎస్ అధికారిణి బి. నగ్య సోమవారం రైల్‌నిలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ (ఐఆర్‌టీఎస్) 1989 బ్యాచ్‌కి చెందిన నగ్య స్వగ్రామం సూర్యాపేట జిల్లా కోదాడ. అంతకుముందు ఆమె ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా, భువనేశ్వర్ బీ చీఫ్ ఫ్రైట్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్ (సిఎఫ్‌టిఎం), చీఫ్ ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్ (సిపిటిఎం)గా, చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ మేనేజర్‌తో పాటు పలు బాధ్యతలు నిర్వహించారు.

'న్యాక్'కు విశ్వకర్మ అవార్డు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నిర్మాణ రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్న 'న్యాక్' సంస్థకు విశ్వకర్మ అవార్డు లభించింది. నిర్మాణ నైపుణ్య అభివద్ధి సాధన విభాగంలో ఈ అవార్డును అందచేశారు. అవార్డు రావడంపై న్యాక్ వైస్ చైర్మెన్, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సంస్థ అధికారులకు అభినందనలు తెలిపారు. సోమవారం ఢిల్లీలో జరిగిన న్యాక్ 14వ కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (న్యూఢిల్లీ) సమావేశంలో ఈ అవార్డును పార్లమెంటరీ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘువాల్ ఈ అవార్డును ప్రదానం చేశారు. ఢిల్లీలో ఈ అవార్డులు అందుకున్న న్యాక్ డైరెక్టర్ జనరల్ కె.బిక్షపతి, డైరెక్టర్లు రాజిరెడ్డి, శాంతి శ్రీ, హేమలత, సత్యపాల్‌రెడ్డి తదితరులను మంత్రి అభినందించారు.

ఆర్టీసీలో ఎన్నికలపై హైకోర్టులో పిటీషన్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్‌ఆర్టీసీలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ఎంప్లాయిస్ యూనియన్ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసినట్టు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ బాబు, కే రాజిరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీలో రెండేండ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారనీ, దీనిపై కార్మిక శాఖ అధికారులకు, మానవ హక్కుల కమిషన్‌కు గతంలో విన్నవించినట్టు తెలిపారు.

వాకపల్లి ఆదివాసీ మహిళలపై జరిగిన ఘటనపై తిరిగి దర్యాప్తు చేయించాలి : ఓపీడీఆర్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వాకపల్లి ఆదివాసీ మహిళలపై 2007లో జరిగిన లైంగిక దాడి ఘటనపై నేర పరిశోధన స్వతంత్ర దర్యాప్తు సంస్థతో హైకోర్టు పర్యవేక్షణలో తిరిగి దర్యాప్తు చేయించాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ(ఓపీడీఆర్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి నర్సింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తమపై గ్రేహౌండ్స్ పోలీసులు లైంగిక దాడి చేశారంటూ బాధిత మహిళలు పాడేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. అయినా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని తెలిపారు. ఈ సంఘటనపై వివిధ ప్రజాసంఘాలు, హక్కుల సంఘాలు రాజకీయ పార్టీలు ఆందోళన చేయటంతో 2007ఆగస్టు 20న పోలీసులు ఎఫ్ఐఆర్ 86/2007 గా సెక్షన్ 376, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారని తెలిపారు. కేసు ప్రారంభ దశలోనే అప్పటి ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి జానారెడ్డి, డీజీపీ వాకపల్లి ఘటనపై మాట్లాడుతూ ఆదివాసీ మహిళలపై పోలీసులు ఎలాంటి లైంగిక దాడికి పాల్పడలేదనీ, ఇది మావోయిస్టుల ప్రేరేపిత అబద్ధపు కేసంటూ పేర్కొన్నారని గుర్తుచేశారు. అధికారులు ఉద్దేశపూర్వ కంగానే కేసు వీగిపోయే విధంగా వ్యవహరించారని తెలిపారు.అందువల్ల కోర్టు ఈ కేసును పున్హ పరిశోధనకు అర్హ మైనదిగా భావించి తిరిగి దర్యాప్తునకు పంపించాలని కోరారు.

రెండో విడత గొర్రెల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు

తెలంగాణ రాష్ట్ర షీప్స్, గోట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ :దూదిమెట్ల బాలరాజుయాదవ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణలో రెండో విడత గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర గొర్రెలు, మేకల అభివద్ధి సంస్థ చెర్మెన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ తెలిపారు. మొత్తం 3.5లక్షల యూనిట్లను గొర్రెలను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మాసబ్‌ట్యాంక్‌లోని తెలంగాణ గొర్రెలు, మేకల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర కార్యాలయంలో సంస్థ ఎండీ, ముఖ్య అధికారుతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అన్ని జిల్లాలలోని కలెక్టర్ల అధ్వర్యంలో గొర్రెల పంపిణీని చేపడుతున్నామని వివరించారు. ఐయూనిట్ల రవాణా సరఫరా కోసం టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్నదని తెలిపారు. 3.5లక్షల యూనిట్లకు కావాల్సిన గొర్రెలను అధికారులు సమావేశంలో గుర్తించామని తెలిపారు. జిల్లా అధికారుల నేతత్వంలో లబ్దిదారుల డీడీ చెల్లింపులు, సర్టిఫికెట్ల సేకరణ, లబ్దిదారుల అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాల వారీగా లబ్దిదారుల సంఖ్య, వారి వివరాలను ఈ-ల్యాబ్ పోర్టల్‌లో పొందుపరచాలని అధికారులను ఆదేశించారు. రూ.6100 కోట్ల నిధుల కేటాయింపుతో రెండో విడుత గొర్రెల పంపిణీ చేపడుతున్నామని తెలిపారు.

సివిల్ సప్లయ్ దిద్దుబాటు

సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లులకు కేటాయింపులు కష్టమే!

- డిఫాల్టర్లు, అక్రమార్కులను గుర్తించే పనిలో టాస్క్‌ఫోర్స్
- వందశాతం సీఎంఆర్ ఇచ్చిన మిల్లులకు ప్రాధాన్యత
- మిగిలిన ధాన్యం బహిరంగ మార్కెట్‌లో అమ్మే ఆలోచనలు
- ఏటా నష్టాన్ని నియంత్రించేందుకు పలు కీలక నిర్ణయాలు
- సీఎం కేసీఆర్ వద్దకు చేరిన ప్రతిపాదనలు
- మరో పది రోజుల్లో ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ షురూ!

నవతెలంగాణ - కరీంనగర్
ప్రాంతీయ ప్రతినిధి (బి.శ్రీకాంత్)

ప్రతియేటా వానాకాలం, యాసంగి సీజన్‌లలో ఇబ్బడిముబ్బడిగా ధాన్యం దిగుబడి వస్తోంది. అయితే, ధాన్యం సీఎంఆర్ విషయంలో రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ దిద్దుబాటు చర్యలకు దిగింది. మిల్లర్లు మర ఆడించిన బియ్యం ఇవ్వకపోవడం.. గడువు దాటిందని కేంద్రం తీసుకోకపోవడంతో ఆ భారమంతా రాష్ట్ర సివిల్ సప్లయ్ సంస్థపైనే పడుతోంది. ప్రతి సీజన్‌లో మిల్లర్లకు ధాన్యం కేటాయించడం.. సకాలంలో సీఎంఆర్ రూపంలో బియ్యం తిరిగి ఇవ్వకపోవడం పరిపాటిగా మారింది. కేటాయించిన ధాన్యం కొందరు మిల్లర్లు అమ్ముకోవడం, మళ్లీ వచ్చిన సీజన్ ధాన్యం మర ఆడించి పాత లెక్కలు చూపడం, రేషన్ డీలర్లతోనే పీడీఎస్ బియ్యం కొని ఎఫ్‌సీఐకి అప్పగించడం వంటి అక్రమాలూ జరుగుతున్నాయి.. దీంతో ఈసారి ఆ నష్టాన్ని నియంత్రించేందుకు సివిల్ సప్లయ్ శాఖ దిద్దుబాటు చర్యలకు దిగింది. డిఫాల్టర్లు, అక్రమార్కులకు ధాన్యం కేటాయించకుండా.. మిగిలిన ధాన్యాన్ని ఎంఎస్పీ ధరకే బయట అమ్మేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. రెండు రోజుల కిందట తయారు చేసి పంపిన పలు కీలక నిర్ణయాల నివేదిక సీఎం అనుమతి కోసం ఎదురుచూస్తున్నట్టు సివిల్ సప్లయ్ వర్గాల సమాచారం.

సివిల్ సప్లయ్ సంస్థకు నష్టాలు వస్తున్న కారణాల్లో మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ ఇవ్వకపోవడమే ప్రధాన అంశంగా ఉంది. ప్రతి సీజన్‌కు కొంత సీఎంఆర్ పెండింగ్ పెడుతున్న మిల్లులు.. ఆర్నెళ్లకోమారు వచ్చే ఖరీఫ్, రబీ ధాన్యం తీసుకుంటూ గందరగోళంగా బియ్యం అప్పగిస్తున్నాయి. పాత సీజన్‌కు సంబంధించిన బియ్యాన్ని తరువాతి సీజన్‌లో వచ్చే ధాన్యం మర ఆడించి ఇస్తున్న పరిస్థితి అక్కడక్కడా ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అయినా పూర్తిస్థాయిలో సకాలంలో సీఎంఆర్ అప్పగించడంలో మిల్లులు చేస్తున్న జాప్యానికి ఎఫ్‌సీఐ నుంచి గడువు ముగిసిపోవడంతో ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వంపైనే భారం పడుతోంది. ఇది రాష్ట్ర వ్యాప్తంగా ఉంది.



కరీంనగర్ జిల్లా వరకు పరిశీలిస్తే 2021-22 వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం సేకరించిన 3,95,863 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని 183 మిల్లులకు కేటాయిస్తే.. తిరిగి బియ్యం రూపంలో 2,65,228 మెట్రిక్‌టన్నుల బియ్యం రావాల్సి ఉంది. ఇందులో మిల్లులు 86.65శాతమే అప్పగించాయి. అందులోనూ వంద శాతం సీఎంఆర్ అప్పగించిన మిల్లులు 117 మాత్రమే ఉన్నాయి. మిగిలిన 66 మిల్లులు 35,401మెట్రిక్‌టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సి ఉంది. 2021-2022 యాసంగి సీజన్‌ను పరిశీలిస్తే.. ప్రభుత్వం 178 మిల్లులకు 3.07లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించింది. తిరిగి 2.08లక్షల మెట్రిక్‌టన్నుల బియ్యం రావాల్సి ఉండగా.. ఇంకా 38,519 మెట్రిక్‌టన్నుల (19శాతం) సీఎంఆర్ పెండింగ్‌లోనే ఉంది. ఇందులో 70మిల్లులు వంద శాతం సీఎంఆర్ అప్పగించగా.. 108మిల్లుల్లో ఇంకా పెండింగ్ ఉండటం గమనార్హం. మొన్నటి వానాకాలం సీజన్‌కు సంబంధించి కూడా ప్రభుత్వం మిల్లులకు కేటాయించిన ధాన్యంలో సీఎంఆర్ రూపంలో 12.21శాతమే వచ్చింది.

బయట మార్కెట్‌లో ధాన్యం అమ్ముకునే ఆలోచనలో సివిల్ సప్లయ్

ప్రతి సీజన్‌లోనూ మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ ఇవ్వకపోవడం, డిఫాల్టర్లు, అక్రమార్కుల సంఖ్య పెరుగుతుండటంతో ప్రభుత్వం ఈ యాసంగి పంటపై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కొనుగోలు చేసిన ధాన్యంలో సగం ధాన్యం మిల్లులకు ఇవ్వకుండా గోదాములకు తరలించే ఆలోచనలో ఉంది. తద్వారా మిల్లర్లపై ఒత్తిడి తగ్గి సకాలంలో మిల్లింగ్ పూర్తయ్యే అవకాశాలు ఉంటాయని భావిస్తోంది. ఒకవేళ ఖాళీగా ఉన్న మిల్లర్లకు అవసరమైతే మరికొంత ధాన్యాన్ని ఇవ్వనుంది. లేకపోతే ఎంఎస్పీ నష్టపోకుండా టెండర్ల ప్రక్రియ ద్వారా ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్మే ఆలోచనలో ఉంది. మొత్తంగా ట్రాన్స్‌పోర్టు, మిల్లింగ్, సీఎంఆర్ డెలివరీ, ఎఫ్‌సీఐతో ఇబ్బందులు లేకుండా.. పౌరసరఫరాల శాఖ నష్టపోకుండా చర్యలు తీసుకునేందుకు పలు కీలక ప్రతిపాదనలు తయారు చేసుకుంది. ఇప్పుడు వాటిని సీఎం కేసీఆర్ దగ్గర అనుమతి కోసం పంపించారు.